veluturu telugu daily

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి నల్గొండ శుక్రవారం 16.10.2026

సంపుటి : 9 సంచిక : 124

www. veluturu.com

## ఉపాధి కేంద్రాలుగా గ్రామాలు

- మహిళా శక్తికి వేదికగా సరస్ మేళా-2026
- మహిళా సాధికారతే వికసిత్ భారత్‌కు పునాది
- గ్రామీణ మహిళల ఉత్పత్తులకు 'స్వయం ఏపీ' బ్రాండ్
- విజయవాడలో సరస్ మేళాను ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు

11






## పేదల పక్షాన పోరాడిన ప్రజావీరుడు పండుగ సాయన్న

12

ముదిరాజ్‌లతో పాటు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు

ముస్లాయిపల్లిలో విగ్రహావిష్కరణ చేసిన మంత్రి వాకిటి శ్రీహరి

## మెడికల్ కాలేజీల అభివృద్ధికి రూ.379 కోట్ల కేంద్ర నిధులు

- పీజీ సీట్ల పెంపునకు అనుగుణంగా వసతుల కల్పన
- మరో రూ.253 కోట్లు సమకూర్చనున్న రాష్ట్ర ప్రభుత్వం

12



## రూ. 400ల కోట్ల ఆస్తిని కాపాడిన హైడ్రా

- రెండు ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్
- రెవెన్యూ అధికారుల వినతి మేరకు హైడ్రా చర్యలు

12





## బీఎస్ఎఫ్ క్యాంప్‌లో ఫుడ్ పాయిజనింగ్

### 75మంది జవాన్లకు అస్వస్థత

**మణిపూర్, వెలుతురు:**

మణిపూర్, ఇంఫాల్‌లోని బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ క్యాంపులో ఫుడ్ పాయిజన్ కలకలం రేపింది. ఈ ఘటనలో దాదాపు 75మంది బీఎస్ఎఫ్ జవాన్లు, ఇతర సిబ్బంది అస్వస్థతకు గురయ్యారు. గురువారం ఉదయం ఈ ఘటన జరగ్గా జవాన్లను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఉదయం జవాన్లు, సిబ్బంది బ్రేక్ ఫాస్ట్ చేసినట్టు తెలుస్తోంది. ఆహారం తిన్న తరవాత వాంతులు, కడుపునొప్పి లాంటి లక్షణాలు కనిపించాయి. ఈ క్రమంలో ఆహారంత తిన్న 75మంది అస్వస్థతకు గురయ్యారు.

వెంటనే వారిని స్థానిక రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం జవాన్లు చికిత్స పొందుతుండగా వారి పరిస్థితి నిలకడగానే ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు. ఎలాంటి ప్రాణాపాయం లేదని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అంటున్నారు. అయితే ఫుడ్ పాయిజన్‌కు కారణం ఏంటనేది ఇంకా తెలియలేదు. ఈ ఘటనపై ఉన్నతాధి కారులు విచారణ జరుపుతున్నారు. ఇప్పటికే సంబంధిత ఆహార పదార్థాలను సేకరించి పరిశీలించేందుకు ల్యాబ్‌కు తరలించారు.

## ఎల్‌నినోతో కోవిడ్ తరహా

# సంక్షోభం!



### రైతులు అప్రమత్తంగా ఉండాలి: సీఎం రేవంత్‌రెడ్డి

**ఎల్‌నినో విషయంలో శాస్త్రవేత్తలు ఊహించినట్లుగానే పరిస్థితులు చేయి దాటిపోయేలా ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నీరు, విద్యుత్ కొరతను తీవ్రంగా ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ప్రజల దైనందిన కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు, రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితులపై మంత్రులతో చర్చించిన అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. యాసంగిలో ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. దాదాపు 100 దేశాల్లో ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ఐక్యరాజ్య సమితి వెల్లడించిన విషయాన్ని గుర్తు చేశారు. - హైదరాబాద్, వెలుతురు**

#### వచ్చే ఎనిమిది నెలలు కీలకం..

- నీటిని పొదుపుగా వాడుకోవాలి
- యాసంగిలో వరి సాగు వాయిదా వేసుకోండి
- రాష్ట్రంలో నీటి కొరత తీవ్రం.. విద్యుత్ వినియోగం పెరిగింది
- అదనపు విద్యుత్ ఇవ్వాలి.. కేంద్రానికి సీఎం విజ్ఞప్తి
- సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కేబినెట్ ఉపసంఘం
- కాళేశ్వరం, కృష్ణా జలాలపై బీఆర్ఎస్‌పై విమర్శలు

#### వరి సాగు వాయిదా వేసుకోండి..

గతేడాది ఇదే సమయానికి రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లలో కలిపి 400 టీఎంసీలకు పైగా నీరు అందుబాటులో ఉండగా, ఈ ఏడాది 209 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని సీఎం తెలిపారు. ఈ నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. వచ్చే ఎనిమిది నెలలు అత్యంత కీలకమని, మళ్లీ వర్షాలు వచ్చే వరకు అందరూ జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే వాడుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. హైదరాబాద్‌కు నీరందించే జలాశయాలు కూడా ఎండిపోతున్నాయని తెలిపారు. రైతులు పెద్దమనసు చేసుకుని ఒక వరి సీజన్‌ను వాయిదా వేసుకోవాలని, యాసంగిలో వరి పంట వేయొద్దని విజ్ఞప్తి చేశారు. రైతులను ఆదుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు.

#### కేంద్రం ఆదుకోవాలి..

ఎండల తీవ్రతతో విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. సగటు వినియోగానికి అదనంగా 5వేల మెగావాట్ల విద్యుత్ వాడకం పెరిగిందన్నారు. అక్టోబరులో ఈ స్థాయిలో విద్యుత్ వినియోగం చరిత్రలో ఎప్పుడూ లేదని పేర్కొన్నారు. మార్కెట్లో విద్యుత్ ఏ ధరకు లభించినా కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. రాష్ట్రానికి అదనపు విద్యుత్ ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నామని, విద్యుత్‌పై ఇచ్చే సబ్సిడీలను పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. ఎల్‌నినో కష్టకాలంలో రాష్ట్రాలను కేంద్రం ఆదుకోవాలని, కేంద్ర-రాష్ట్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్ర నిధుల వాటాను పెంచాలని కోరారు.

#### విపక్షాలు కలిసి రావాలి..

సమస్యను పరిష్కరించేందుకు కేబినెట్ ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు - మిగతా 2 లో..

## తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి



- సింగిల్ విండో ద్వారా అనుమతులు..
- భూమి, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తాం
- పారిశ్రామికవేత్తలకు గార్డియన్‌గా ఉంటాను
- సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భరోసా

2

## తెలంగాణలో భూ కుంభకోణాలపై సమగ్ర విచారణ జరపాలి

- బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్
- భూముల అన్యాక్రాంతంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన ప్రైవేటు భూములను తొలగించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- వివరాలు 2 లో..



## విదేశీ బొగ్గు ముసుగులో

# రూ. 3 వేల కోట్ల స్కాంకు కుట్ర!

### భోత్రా లాజిస్టిక్స్ ఒప్పందాలపై అనుమానాలు

### సింగరేణిని బలహీనపరిచి దిగుమతులకు తెర

### స్వతంత్ర విచారణ జరపాలి.. కేటీఆర్ బహిరంగ లేఖ



**హైదరాబాద్, వెలుతురు:**

విదేశీ బొగ్గు దిగుమతుల పేరుతో రాష్ట్రంలో రూ.3 వేల కోట్ల కుంభకోణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రంగం సిద్ధం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కావాలనే బొగ్గు, విద్యుత్ సంక్షోభాన్ని సృష్టించి, దాన్ని సాకుగా చూపుతూ విదేశీ బొగ్గు దిగుమతులకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు.

#### టన్నుకు రూ.1,500 కమిషన్ అంటూ ఆరోపణలు

భోత్రా లాజిస్టిక్స్ అనే సంస్థకు కాంట్రాక్టులు అప్పగించడంలో అనుసరించిన ప్రమాణాలేమిటో ప్రభుత్వం వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి చేసుకున్న ఒప్పందాలు, టెండర్ల వివరాలు, చెల్లింపులను బహిర్గతం చేయాలని కోరారు. ప్రతి టన్నుపై రూ.1,500 చొప్పున కమిషన్ రూపంలో భారీగా దోచుకునేందుకు కుట్ర జరుగుతోందని, దీనిపై స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అయితే, ఈ ఆరోపణలపై ప్రభుత్వం స్పందించాల్సి ఉంది.

#### తగ్గుతున్న సింగరేణి ఉత్పత్తి.. రూ.60 వేల కోట్ల బకాయిలు

2023-24లో 70.02 మిలియన్ టన్నులుగా ఉన్న సింగరేణి బొగ్గు ఉత్పత్తి 2025-26లో సుమారు 58 మిలియన్ - మిగతా 2 లో..

## ఇటు కొరడా.. అటు వేటు..!!



కీసర డిప్యూటీ తహసీల్దార్



వేములవాడ తహసీల్దార్, ఆపరేటర్

విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్ పంద్యాల సంధ్యా రాకేష్

### అవినీతి అధికారుల గుండెల్లో ఏసీబీ దడ్ఢేల్

- రూ.3.70 లక్షల లంచం తీసుకుంటూ ఇద్దరు అధికారులు పట్టివేత
- వేములవాడ రూరల్ తహసీల్దార్‌ను పట్టుకున్న ఏసీబీ
- ఘట్‌కేసర్ సీఐపై సస్పెన్షన్ వేటు..!
- భూమి పనుల నుంచి విద్యుత్ మీటర్ల వరకు లంచాల దందా

**ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి అధికారుల తీరు మారడం లేదు. ప్రజల అవసరాలను ఆసరా గా చేసుకుని కొందరు అధికారులు లంచాల కోసం వేధిస్తుండగా, మరికొందరు విధులను అడ్డుపెట్టుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో చోటుచేసుకున్న వరుస పరిణామాలు అధికార యంత్రాంగంలోని అవినీతి తీరును బయటపెడుతున్నాయి.**



ఘట్‌కేసర్ సీఐ

**హైదరాబాద్/ఘట్‌కేసర్, వెలుతురు:**

కీసర తహసీల్దార్ కార్యాలయంలో రూ. 2.50 లక్షల లంచం తీసుకుంటూ డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌రెడ్డి ఏసీబీకి చిక్కగా, హైదరాబాద్‌లో విద్యుత్ మీటర్ల కోసం రూ. 1.20 లక్షలు తీసుకుంటూ ఓ విద్యుత్ సహాయ ఇంజనీర్ పట్టుబడ్డారు. మరోవైపు బాధితుల ఫిర్యాదులు, అంతర్గత విచారణలో ఆరోపణలు రుజువు కావడంతో ఘట్‌కేసర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామిపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు.

#### భూమి పనులకు రూ.5 లక్షల డిమాండ్

కీసర తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌రెడ్డిని రూ. 2.50 లక్షల లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. భూమి మ్యుటేషన్, సర్వే పనుల కోసం రూ. 5 లక్షలు డిమాండ్ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో మరికొందరి పాత్ర ఉందా అనే కోణంలో ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

#### విద్యుత్ మీటర్లకూ లంచం

హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలో మాదన్నపేట సెక్షన్ విద్యుత్ సహాయ ఇంజినీర్‌గా పనిచేస్తున్న పందాల సంధ్యారాకేష్ ఏసీబీకి పట్టుబడ్డారు. పాత మీటర్ల స్థానంలో ఆరు కొత్త విద్యుత్ మీటర్లు ఇవ్వాలని కోరిన ఫిర్యాదుదారుడిని లంచం కోసం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఏసీబీని ఆశ్రయించిన బాధితుడి ఫిర్యాదు మేరకు అధికారులు గురువారం మాటువేసి, రూ. 1.20 లక్షలు తీసుకుంటుండగా ఏఈని పట్టుకున్నారు. విధి నిర్వహణలో అవినీతికి పాల్పడినట్లు కేసు నమోదు చేసి నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో - మిగతా 11 లో..

# భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రక్షాళన చేస్తాం

- ఏళ్ల తరబడి తిష్టవేసిన అధికారులను బదిలీ చేస్తాం
- 2018 నుంచి క్లెయిమ్‌లపై సమగ్ర విజిలెన్స్ విచారణ
- అక్రమాలకు పాల్పడిన వారెవరైనా ఉపేక్షించం
- నా సిఫారసు లేఖతో క్లెయిమ్ మంజూరైనట్లు వచ్చిన వార్తలు అవాస్తవం
- శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్, వెలుతురు:**

కార్మికుల సంక్షేమ నిధులను పరిరక్షించడంతో పాటు పరిపాలనలో పారదర్శకతే లక్ష్యంగా కార్మిక శాఖలో సమూల ప్రక్షాళన చేపట్టనున్నట్లు శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియను ప్రక్షాళన చేయడంతో పాటు, ఏళ్ల తరబడి ఒకే చోట తిష్టవేసిన అధికారులను త్వరలోనే బదిలీ చేస్తామని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి సంబంధించిన ప్రతి రూపాయి సక్రమంగా వినియోగమయ్యేలా పటిష్ఠమైన వ్యవస్థను రూపొందిస్తామన్నారు.

సచివాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. కార్మిక శాఖలో క్లెయిమ్‌ల ప్రాసెసింగ్‌లో అవకతవకలు జరిగినట్లు గుర్తించిన వెంటనే ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని తెలిపారు. ప్రాథమిక ఆధారాల మేరకు ఇద్దరు అధికారులను ఇప్పటికే సస్పెండ్ చేశామని, వ్యవహారంపై సమగ్ర విజిలెన్స్ విచారణకు ఆదేశించామని వెల్లడించారు. విచారణలో ఎవరి పాత్ర బయటపడినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కార్మికుల పరిహార క్లెయిమ్‌ల పరిష్కారంలో పారదర్శకత లోపించడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని మంత్రి తెలిపారు. బోగస్ పత్రాలు, నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా అక్రమంగా క్లెయిమ్‌లు పొందినట్లు ఆరోపణలు రావడంతో 2018 నుంచి ఇప్పటివరకు నమోదైన అన్ని రకాల క్లెయిమ్‌లను సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించినట్లు చెప్పారు. జాయింట్ లేబర్ కమిషనర్ స్థాయిలో ప్రాథమిక విచారణ జరిపి ఇద్దరు అధికారులపై చర్యలు తీసుకున్నామని వివరించారు. దాని ఆధారంగా విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు తెలిపారు.

తన సిఫారసు లేఖ ఆధారంగా కార్మికుల పరిహార క్లెయిమ్ మంజూరైనట్లు ఒక పత్రికలో వచ్చిన కథనాలు అవాస్తవమని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులను ఆశ్రయించడం సహజమని, సంబంధిత అధికారులకు నిబంధనల ప్రకారం పరిశీలించాలని సూచించడం సాధారణ విధానమని చెప్పారు. తన వద్దకు వచ్చిన దరఖాస్తుపై నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని మాత్రమే సూచించానని వివరించారు.

సింగరేణి సంస్థ పరిస్థితిపై బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సింగరేణిలో ఉద్యోగుల సంఖ్య లక్ష నుంచి 38 వేలకు పడిపోయిందని, దాదాపు 62 వేల ఉద్యోగాలు తగ్గిపోయాయని అన్నారు. ఆ పదేళ్లలో ఒక్క కొత్త బొగ్గు గని కూడా సంస్థకు రాలేదని పేర్కొన్నారు.

బొగ్గు గనుల వేలం చట్టానికి పార్లమెంట్‌లో అనుకూలంగా ఓటేసింది బీఆర్ఎస్ ఎంపీలేనని మంత్రి గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు గనులు కేటాయించే అవకాశాలపై కేంద్రానికి లేఖ రాసినా అప్పటి ప్రభుత్వం స్పందించలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో వేలంలో పాల్గొని ఆర్కేఓసీ మైన్, తాడిచర్లలో మరో గనిని సింగరేణికి దక్కేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

## పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- సింగిల్ విండో ద్వారా అనుమతులు..
- భూమి, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తాం
- పారిశ్రామికవేత్తలకు గార్డియన్‌గా ఉంటాను
- సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భరోసా
- సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్--2026లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్, వెలుతురు:**

"తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి.. మీ అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుంది. పరిశ్రమల స్థాపనకు సింగిల్ విండో అనుమతులు, భూమి, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తాం. హైదరాబాద్ పెట్టుబడులకు అత్యంత సురక్షితమైన, అనుకూలమైన గమ్యస్థానం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలి" అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు తాను గార్డియన్‌గా వ్యవహరిస్తానని, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. హైటెక్స్‌లో నిర్వహించిన సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ గ్లోబల్ బిజినెస్ మీట్-2026లో ఆయన మాట్లాడుతూ, సంపద సృష్టికర్తలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను సింగిల్ విండో విధానం ద్వారా అందించడంతోపాటు, పారిశ్రామిక పార్కుల ద్వారా భూమి, అవసరమైన విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. శాంతిభద్రతలు, మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అనుకూలమైన వ్యాపార వాతావరణం హైదరాబాద్‌ను పెట్టుబడులకు అత్యంత అనువైన గమ్యస్థానంగా నిలుపుతున్నాయని పేర్కొన్నారు.

తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు అనేక అనుకూలతలు ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి వివరించారు. దేశంలో భౌగోళికంగా అనువైన ప్రాంతంలో ఉండటం, పారిశ్రామిక అవసరాలకు తగిన భూమి అందుబాటులో ఉండటం, మెరుగైన మౌలిక సదుపాయాలు, విద్యాసంస్థల ద్వారా అభివృద్ధి చెందిన నైపుణ్యవంతమైన మానవ వనరులు రాష్ట్రానికి ప్రధాన బలాలని అన్నారు.

ప్రాచీన కాలం నుంచి హైదరాబాద్ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వ్యాపారులను, పెట్టుబడిదారులను ఆకర్షిస్తోందని, మారుతున్న ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం మరిన్ని పెట్టుబడులను తీసుకురావడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని వివరించారు.

### మూడు ప్రాంతాలుగా అభివృద్ధి ప్రణాళిక

హైదరాబాద్ పరిసర ప్రాంతాల అభివృద్ధికి కోర్ అర్బన్ రీజియన్ (కోర్), పెరి అర్బన్ రీజియన్ (ప్యూర్), రూరల్ అగ్రికల్చర్ రీజియన్ (రేర్) విధానాల ద్వారా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. కోర్ అర్బన్ ప్రాంతంలో ఐటీ, మౌలిక సదుపాయాలు, సేవారంగానికి ప్రాధాన్యమిస్తామని చెప్పారు. పెరి అర్బన్ ప్రాంతంలో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక క్లస్టర్లను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఔటర్ రింగ్ రోడ్డు, భవిష్యత్తులో నిర్మించనున్న రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతాన్ని అనుసంధానిస్తూ రేడియల్ రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టామని తెలిపారు. ఇప్పటికే 21 రేడియల్ రోడ్లకు సంబంధించి మంజూరు, రూపకల్పన ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ రహదారుల అనుసంధానంతో ఫార్మా, బయోటెక్నాలజీ, విద్య, సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాలకు ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేసే అవకాశం ఏర్పడుతుందని వివరించారు. రూరల్ అగ్రికల్చర్ రీజియన్‌లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను పెద్దఎత్తున ప్రోత్సహించేందుకు అవసరమైన వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక వనరులకు విలువ జోడించే పరిశ్రమలు ఏర్పాటు కావడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని పేర్కొన్నారు.

### సంపద సృష్టిలో పారిశ్రామికవేత్తలదే కీలక పాత్ర

మారుతున్న ఆర్థిక పరిస్థితుల్లో సంపద సృష్టికి వ్యవసాయంతోపాటు పరిశ్రమలు, సేవారంగం కీలకంగా మారాయని ఉప ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో వ్యవసాయ రంగం వాటా సుమారు 16 శాతం ఉండగా, పరిశ్రమలు, సేవారంగం కలిపి ఆర్థిక వ్యవస్థకు ప్రధానంగా దోహదపడుతున్నాయని వివరించారు. సేవారంగం వాటా సుమారు 65 శాతంగా ఉందని, పారిశ్రామిక రంగం కూడా ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు.

ఫార్మా, కోర్ ఇండస్ట్రీలు, ఆక్వా, ఎగుమతులు, దిగుమతులు, ఐటీ, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు వంటి విభిన్న రంగాల్లో ఉన్న వ్యాపారవేత్తలు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి మరింతగా తోడ్పడాలని పిలుపునిచ్చారు. సంపద సృష్టించేవారికి ప్రతి రాష్ట్రం, ప్రతి సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. పారిశ్రామికవేత్తలు ఎదగడంతోపాటు రాష్ట్రానికి ఉపాధి, పెట్టుబడులు, ఆదాయం పెరగడానికి దోహదపడాలని ఆకాంక్షించారు.

### పరిశ్రమలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సహా రాష్ట్ర మంత్రివర్గం మొత్తం పెట్టుబడిదారులకు అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. పరిశ్రమల స్థాపనలో ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

### అందరినీ కలుపుకొని అభివృద్ధి సాధించాలి

సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం కాకుండా, అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందాలని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. పారిశ్రామికవేత్తలు తమ అనుభవం, పరిజ్ఞానాన్ని ఇతర వర్గాలతో పంచుకోవాలని, కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే వారికి మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. సమాఖ్య వంటి సంస్థల ద్వారా ఈ తరహా కార్యక్రమాలకు వేదికలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఒక వర్గం మాత్రమే అభివృద్ధి చెందడం సంపూర్ణ ప్రగతి కాదని, తమతోపాటు మరో పదిమందిని ముందుకు తీసుకెళ్లినప్పుడే సమాజం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. పెట్టుబడిదారులు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ప్రభుత్వం కూడా వారితో కలిసి పనిచేస్తుందని భరోసా ఇచ్చారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలకు స్వాగతం పలికిన భట్టి, వ్యాపారాలు విస్తరించుకుంటూ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు సహకరించాలని కోరారు.

# గనులు పోగొట్టింది మీరు.. సింగరేణిని కాపాడేది మేము!

- బీఆర్ఎస్ ఆరోపణలకు మంత్రి శ్రీధర్‌బాబు కౌంటర్
- కొత్త గనులతో ఉత్పత్తి పెంపునకు చర్యలు
- టెండర్లలో పారదర్శకతకు సైట్ విజిట్ నిబంధన
- ఆధారాలుంటే బయటపెట్టండి.. దుష్ప్రచారం మానుకోండి




**హైదరాబాద్, వెలుతురు:**

సింగరేణి సంస్థపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర నాయకులు చేస్తున్న ఆరోపణలను మంత్రి శ్రీధర్‌బాబు తీవ్రంగా ఖండించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణికి కొత్త గనులు దక్కకుండా చేసి, సంస్థను అప్పుల ఊబిలోకి నెట్టారని విమర్శించారు. తమ ప్రభుత్వం పారదర్శకతకు పెద్దపీట వేస్తూ సంస్థను బలోపేతం చేస్తోందని తెలిపారు. టెండర్లలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న వారు ఆధారాలు బయటపెట్టాలని, కార్మికులు, అధికారుల నిజాయితీపై బురదజల్లడం మానుకోవాలని హితవు పలికారు.

### కొత్త గనులతో ఉత్పత్తి పెంపు

ప్రస్తుతం సింగరేణిలో తొమ్మిది గనుల నుంచి జీ-9 గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి అవుతోందని, ఈ ఏడాది ఇప్పటివరకు 25 మిలియన్ టన్నులకు పైగా బొగ్గు సరఫరా చేయగా, అందులో జీ-9 బొగ్గు 1.20 మిలియన్ టన్నులేనని శ్రీధర్‌బాబు వివరించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి ఏటా 14 మిలియన్ టన్నుల జీ-9 బొగ్గు సరఫరా చేసే ఒప్పందం బీఆర్ఎస్ హయాంలోనే జరిగిందన్నారు. కేంద్రం నిర్వహించిన బొగ్గు గనుల వేలంలో సింగరేణి పాల్గొనకపోవడంతో కోయగూడెం-3, సత్తుపల్లి-3 బ్లాకులు చేజారాయని, దీంతో ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి అవకాశాన్ని కోల్పోయిందని విమర్శించారు. 14 గనులు మూతపడటంతో 15 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యానికి నష్టం జరిగిందన్నారు. తమ ప్రభుత్వం రెండేళ్లలో నైనీ గనికి అనుమతులు సాధించడంతోపాటు తాడిచెర్ల-2, మణుగూరు పీకే ఓసీ-2 డిప్‌సైడ్ బ్లాకులను దక్కించుకుందని తెలిపారు.

### టెండర్లలో పారదర్శకతే లక్ష్యం

సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధన కాంట్రాక్టర్లకు పనులపై ముందస్తు అవగాహన కల్పించి, పనులు మధ్యలో నిలిచిపోకుండా ఉండేందుకేనని మంత్రి పేర్కొన్నారు. గతంలో క్షేత్రస్థాయి పరిస్థితులు పరిశీలించకుండానే టెండర్లు వేసి, పనులు ప్రారంభించిన తర్వాత కాంట్రాక్టర్లు మధ్యలోనే తప్పుకోవడంతో సింగరేణి నష్టపోయిందన్నారు. 2018, 2021, 2023లోనూ టెండర్లలో ఈ నిబంధన అమలైందని గుర్తుచేశారు. బొగ్గు ఉత్పత్తి నుంచి రవాణా, తూకం, పంపిణీ వరకు సాంకేతిక నిఘా వ్యవస్థ ఉందని, బొగ్గు మాయమయ్యే అవకాశం లేదని స్పష్టం చేశారు.

### కార్మికుల సంక్షేమమే ప్రాధాన్యం

సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం విద్యుత్ సంస్థల బకాయిలు చెల్లించకుండా సంస్థను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టిందని ఆరోపించారు. టెండర్లలో కమీషన్ల సంస్కృతికి అడ్డుకట్ట వేసి, ఆర్థిక క్రమశిక్షణ తీసుకొస్తున్నామని తెలిపారు. కార్మికులకు న్యాయం చేయడంతోపాటు గనుల భద్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ బొగ్గు ఉత్పత్తిని పెంచుతామని, థర్మల్, సౌర విద్యుత్‌తోపాటు కీలక ఖనిజాల రంగాల్లోనూ సింగరేణిని విస్తరిస్తామని పేర్కొన్నారు.

# తెలంగాణలో భూ కుంభకోణాలపై సమగ్ర విచారణ జరపాలి

## బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్

**హైదరాబాద్ వెలుతురు:**

తెలంగాణలో ధరణి, భూభారతి పోర్టల్ల ద్వారా చోటుచేసుకున్న భూ రికార్డుల అవకతవకలు, 22ఏ నిషేధిత భూముల వివాదాలు, ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సమగ్ర పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రామ్ చందర్ రావు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు. రాష్ట్రంలో భూ కుంభ కోణాలపై బీజేపీ నిరంతరం పోరాటం చేస్తోందని, రాష్ట్ర అధ్యక్షుల ఆధ్వర్యంలో ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.




### 1. ధరణి, భూభారతి అవకతవకలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిజాలు బహిర్గతం చేయాలి

ధరణి వ్యవహారంపై అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గళమెత్తడం వల్లే ప్రభుత్వం చర్చకు అంగీకరించిందని గుర్తుచేశారు.

ఫోరెన్సిక్ ఆడిట్‌లో భయంకరమైన నిజాలు బయటపడ్డాయని రెవెన్యూ మంత్రి వెల్లడించినప్పటికీ, ఆ నివేదికను ప్రజలకు ఎందుకు బహిర్గతం చేయడం లేదని నిలదీశారు. విచారణను ముందుకు తీసుకెళ్లకుండా 'సెట్టింగుల' కోసమే ఎస్ఐటీ స్థానంలో ఎస్ఈటీని ఏర్పాటు చేశారా అని ప్రశ్నించారు.

గతంలో ధరణి ద్వారా లక్షల కోట్ల దోపిడీ జరిగిందని ఆరోపించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక ఒక్క ఎకరం భూమిని కూడా స్వాధీనం చేసుకోకపోవడం, బాధ్యులపై కేసు నమోదు చేయకపోవడం వెనుక ఆంతర్యమేంటని నిలదీశారు. సుమారు 200 ఫైళ్లను అధ్యయనం చేసిన తర్వాత ఇవి రాష్ట్ర చరిత్రలోనే అత్యంత తీవ్రమైన కుంభకోణాలని తేల్చిచెప్పారు.

### 2. 22ఏ నిషేధిత జాబితా గందరగోళం - పట్టాదారుల ఇబ్బందులు

రిజిస్ట్రేషన్ చట్టం సెక్షన్ 22ఏ ప్రకారం అసైన్డ్, ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్ భూములను మాత్రమే నిషేధిత జాబితాలో ఉంచాల్సి ఉండగా.. రేరా అనుమతులు పొందిన ప్రైవేట్ కాలనీలు, భవనాలను కూడా చేర్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 2023 డిసెంబర్ 7 నాటికి 98,56,838 ఎకరాలు ఉన్న 22ఏ జాబితా, 2026 ఆగస్టు 31నాటికి 98,31,320 ఎకరాలకు (25,518 ఎకరాల తేడా) తగ్గిందని తెలిపారు. అటవీ, దేవాదాయ, వక్ఫ్, అసైన్డ్ భూముల గణాంకాలకు, మీడియా నివేదికలకు మధ్య భారీ వ్యత్యాసాలు ఉన్నాయని, వీటిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ గందరగోళాన్ని బినామీలు, దళారులు కమిషన్ల కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు.

### 3. ప్రముఖ భూ కుంభకోణాలు - కీలక ఆరోపణలు

సుమారు 24 లక్షల ఎకరాల అసైన్డ్ భూములపై బడా వ్యక్తుల కన్ను పడిందని, వాటికి విక్రయ హక్కులు కల్పించేలా కొత్త జీవో తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

871 ఎకరాల IDPL గల్ఫ్ ఆయిల్ భూమి (విలువ రూ.87,000 కోట్లు), పరిశ్రమల కోసం కేటాయించి ఫీనిక్స్, హానర్ వంటి కంపెనీలకు కట్టబెట్టిన భూముల వ్యవహారంపై సమగ్ర విచారణ కోరారు. ఉదాసీ మఠానికి సంబంధించిన 537 ఎకరాల భూమిని సుప్రీంకోర్టులో గెలిచినా ఎందుకు స్వాధీనం చేసుకోలేదని, IDPLకేంద్ర ప్రభుత్వ భూమి ఆక్రమణలపై ఎందుకు చర్యలు లేవని నిలదీశారు.

పేదల 60 గజాల ఇళ్లను కూల్చే హైడ్రా... మూసీ నది ఆక్రమణలు, వంశీరామ్ బిల్డర్స్ (రూ. 7,000 కోట్ల విలువైన 27 ఎకరాలు), ఆదిత్య లగ్జరీ టవర్స్, పుప్పాలగూడ, శేరిలింగంపల్లి, జానకిరాంగూడ ప్రాంతాల్లోని భూ ఆక్రమణలు, TGIIC భూములను ఫీనిక్స్, రాఘవ కన్స్ట్రక్షన్స్‌కు బదిలీ చేసిన అంశాలపై పెద్దల విషయంలో ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి కుటుంబానికి సంబంధించిన కంపెనీలు (బ్లూ స్టోన్, ఫీనిక్స్, నోవా (ప్రాజెక్ట్స్))ప్రాజెక్టులకు అనుమతులు ఎలా వచ్చాయని నిలదీస్తూ, బీఆర్ఎస్-కాంగ్రెస్ మధ్య చీకటి ఒప్పందం ఉందా అని అనుమానం వ్యక్తం చేశారు.

### 4. బీజేపీ ప్రధాన డిమాండ్లు

- ధరణి, భూభారతి పోర్టల్లపై సమగ్ర న్యాయ విచారణతో పాటు సీబీఐ విచారణ జరపాలి.
- ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికను తక్షణమే బహిర్గతం చేయాలి.
- 22ఏ నిషేధిత జాబితాలో తప్పుగా చేర్చిన ప్రైవేట్ ఆస్తులను తొలగించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.
- చట్టబద్ధమైన హక్కులు కలిగిన భూ యజమానులకు న్యాయం జరిగే వరకు మరియు భూ కుంభకోణాల నిజాలు వెలుగులోకి వచ్చే వరకు బీజేపీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

# సంక్షోభం!



(మొదటిపేజీ తరువాయి)

సీఎం వెల్లడించారు. దసరా తర్వాత ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. కేంద్రం నుంచి అధిక నిధులు పొందేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. విపక్షాలు కూడా రాజకీయం చేయకుండా ప్రభుత్వంతో కలిసి రావాలని కోరారు. ప్రకృతి విపత్తును ఎదుర్కొనేందుకు అందరి సహకారం అవసరమని, దుష్ప్రచారాలను నమ్మకుండా సంయమనంతో ఉండాలని విజ్ఞప్తి చేశారు.

### కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే ఆ వెసులుబాటు ఎందుకు?

కమీషన్ల కోసం కాళేశ్వరం పేరిట రూ.లక్ష కోట్లను గోదావరిలో వృథాగా పోశారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మేడిగడ్డను పూర్తిగా కూల్చేసి మళ్లీ నిర్మించాలని కేంద్ర నిపుణుల కమిటీ చెప్పిందన్నారు. ఎల్‌నినో పరిస్థితులపై మంత్రులతో చర్చించిన అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను తగ్గించి రాష్ట్రానికి మరణశాసనం రాసిందెవరని ప్రశ్నించారు. కృష్ణా జలాల్లో 299 టీఎంసీలు చాలంటూ 2015లో సంతకం చేసిందెవరని నిలదీశారు. పదేళ్లలో కృష్ణా బేసిన్‌లో ఒక్క ప్రాజెక్టునైనా పూర్తి చేశారా అని ప్రశ్నించారు. ఒక్క ప్రాజెక్టు పూర్తి చేసినా నీటిని నిల్వ చేసుకుని ఉండేవాళ్లమని అన్నారు. దాదాపు వంద దేశాల్లో ఎల్‌నినో ప్రభావం ఉందని, మరి ఆయా దేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే కరువు వచ్చిందా అని ప్రశ్నించారు. కొండపోచమ్మ నుంచి పంచపాండవుల చెరువుకు కాలువ తవ్వారని, అక్కడి నుంచి మోటార్ల ద్వారా నేరుగా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీరు వెళ్తోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో మరెవరికీ లేని ప్రత్యేక వెసులుబాటు కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే ఎందుకని ప్రశ్నించారు. ఈ నీటి ఎత్తిపోతలపై నిజనిర్ధారణకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

# రూ.3 వేల కోట్ల స్కాంకు కుట్ర!

(మొదటిపేజీ తరువాయి)

టన్నులకు తగ్గిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఉత్పత్తి తగ్గుదలకు కారణాలు, గనుల అభివృద్ధికి తీసుకున్న చర్యలను వెల్లడించాలని కోరారు. సింగరేణికి సుమారు రూ.60 వేల కోట్ల బకాయిలున్నాయన్న అంశంపై సంస్థల వారీగా పూర్తి లెక్కలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించకుండా సంస్థను బలహీనపరిచి, దేశీయ బొగ్గు సరిపోవడం లేదని చెప్పడం ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు.

### యాదాద్రికి బొగ్గు సరఫరాపై స్పష్టత ఇవ్వాలి

యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి సింగరేణి గనుల నుంచి ఏడాదికి 14 మిలియన్ టన్నుల జి-9 గ్రేడ్ బొగ్గు సరఫరాకు 2018లో లింకేజీ కేటాయించారని, 2022లో సరఫరా ఒప్పందం కుదిరిందని కేటీఆర్ గుర్తుచేశారు. అయినప్పటికీ కొరత పేరుతో విదేశీ బొగ్గు దిగుమతుల అవసరం ఏమిటని ప్రశ్నించారు. ఒడిశాలోని నైని బ్లాక్, మహానది ప్రాంతాల నుంచి దేశీయ బొగ్గు సరఫరాను పెంచే అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. విదేశీ బొగ్గు దిగుమతులపై శ్వేతపత్రం విడుదల చేయాలని, భోత్రా లాజిస్టిక్స్ పాత్రపై విచారణ జరపాలని, సింగరేణి ఉత్పత్తి తగ్గుదలపై నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి సింగరేణిని బలహీనపరిచే ప్రయత్నాలను బీఆర్ఎస్ సహించబోదని హెచ్చరించారు.

# మిరప రైతులకు అండగా అపార్డ్ సంస్థ

## ఉచితంగా స్టిక్కీ ప్యాడ్స్, ఫెరోమోన్ ట్రాప్స్ పంపిణీ

**ఆస్పరి, వెలుతురు అక్టోబర్ 15:** మిరప పంటను చీడపీడల నుండి కాపాడుకుంటూ, అధిక దిగుబడులు సాధించేందుకు ఆధునిక సాంకేతికతను జోడించాలని ఆస్పరి సింగిల్ విండో డైరెక్టర్, మాజీ ఎంపీటీసీ ముత్తుకూరు మల్లికార్జున పిలుపునిచ్చారు. ముత్తుకూరు గ్రామంలో 'అపార్డ్' సంస్థ ఆధ్వర్యంలో గురువారం మిరప రైతులకు చీడపీడల యాజమాన్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న మల్లికార్జున, అపార్డ్ సంస్థ ఈడబ్ల్యూసి. వెంకప్పలు కలిసి గ్రామానికి చెందిన 20 మంది మిరప రైతులకు ఉచితంగా స్టిక్కీ ప్యాడ్స్, ఫెరోమోన్ ట్రాప్స్ పంపిణీ చేశారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యం

- కాంగ్రెస్ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి
- ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: ఎంపీ చామల
- వరంగల్‌లో కాంగ్రెస్ ఉమ్మడి జిల్లాల సన్నాహక సమావేశం



**వరంగల్, వెలుతురు అక్టోబర్ 15:** వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం వరంగల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లాల సన్నాహక సమావేశంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్కతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేసేందుకు పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో కలిసి కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా ఎంపీ చామల మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో పాటు పట్టభద్రులు, యువత సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించి శాసనమండలికి పంపాలని కోరారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# దసరా వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జగ్గారెడ్డి



**సంగారెడ్డి, వెలుతురు అక్టోబర్ 15 :** సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో దసరా ఉత్సవాల కోసం జరుగుతున్న ఏర్పాట్లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గురువారం పరిశీలించారు. రావణ దహనం కోసం సిద్ధం చేస్తున్న 55 అడుగుల రావణాసురుడి బొమ్మతో పాటు బాణసంచా కాల్చేందుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. గత ముప్పై ఏళ్లుగా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ స్టేడియంలో ఏటా దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. భారీ రావణాసురుడి బొమ్మ దహనం, పెద్ద ఎత్తున బాణసంచా ప్రదర్శనతో పాటు ప్రముఖ కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ ఏడాది కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జగ్గారెడ్డి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్ల పరిశీలన సందర్భంగా స్టేడియంతో పాటు చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జగ్గారెడ్డి సూచించారు. ముళ్లకంపలను తొలగించి, చెత్తాచెదారం లేకుండా మైదానాన్ని శుభ్రం చేయాలని మున్సిపల్ సిబ్బందికి, ఉత్సవ నిర్వాహకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, భవాని యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు బెస్త నగేష్, సభ్యులు, నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, కిరణ్ గౌడ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక బస్సు సర్వీసులు విజయవంతం

- టీజీఎస్ ఆర్టీసీ వీసీ,ఎండీ వై. నాగిరెడ్డి
- దసరా సందర్భంగా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా క్షేత్రస్థాయిలో ప్రతీరోజూ సమీక్షలకు ఎండీ ఆదేశం
- అక్టోబర్ 9 నుండి 14 వరకు 2,474 ప్రత్యేక బస్సుల ఆపరేషన్ 94.07 శాతం
- ఖమ్మంలో అత్యధికంగా 133.33%, మెదక్‌లో 123.15%, ఆదిలాబాద్‌లో 116.90% ఆపరేషన్ నమోదు



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 15 :** దసరా పండుగను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సు సర్వీసులు అత్యంత ప్రణాళికాబద్ధంగా, విజయవంతంగా కొనసాగుతున్నాయని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి వెల్లడించారు. పండుగ వేళ స్వంత ఊర్లకు వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు తలెత్తకుండా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, అన్ని రీజినల్ మేనేజర్లుఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో పరిస్థితిని ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ఎండీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**అక్టోబర్ 9 నుండి 14 వరకు నడిపిన ప్రత్యేక సర్వీసులు**

సంస్థ మొత్తం 2,630 బస్సులను సిద్ధం చేయగా... 2,474 బస్సులను విజయవంతంగా నడిపి 94.07 శాతం లక్ష్యాన్ని సాధించిందని ఎండీ వివరించారు. అక్టోబర్ 10న అమావాస్య రోజున ప్రయాణికుల రద్దీ ఊహించని విధంగా పెరిగినప్పటికీ, కేటాయించిన 529 బస్సులకు గాను 689 బస్సులను నడిపించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం జరిగింది.

**జోన్ల వారీగా దసరా - 2026 ప్రత్యేక సర్వీసులు**

09/10/26 నుండి 14/10/26 వరకు కరీంనగర్ జోన్ 1,770 బస్సుల లక్ష్యానికి గాను 1,565 బస్సులను నడిపి 88.42 శాతం సాధించింది . ఇందులో ఖమ్మం రీజియన్ నిర్ణయించిన 273 బస్సులకు గాను 364 బస్సులను నడిపి 133.33 శాతంతో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలవగా, ఆదిలాబాద్ రీజియన్ 116.90 శాతం, కరీంనగర్ 94.76 శాతం, వరంగల్ 66.73 శాతం, నిజామాబాద్ 62.69 శాతం ఆపరేషన్ సాధించాయి. అలాగే హైదరాబాద్ జోన్ 860 బస్సులకు గాను 682 బస్సులను నడిపి 79.30 శాతం ప్రగతిని కనబరిచింది. ఈ జోన్ పరిధిలోని మెదక్ రీజియన్ 123.15 శాతంతో మెరుగైన సేవలు అందించగా, నల్గొండ 79.70 శాతం, మహబూబ్‌నగర్ 70.17 శాతం, రంగారెడ్డి రీజియన్ 37.74 శాతం ఆపరేషన్ నమోదు చేశాయి. దీనికి అదనంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అదనపు రద్దీని తట్టుకోవడానికి ఎటువంటి ముందస్తు ప్రణాళిక లేకపోయినా ప్రత్యేకంగా 227 బస్సులను అందుబాటులోకి తెచ్చి ప్రయాణికులకు రవాణా సదుపాయం కల్పించారు. అదేవిధంగా 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున అవసరమైన చోట్ల అదనపు బస్సు లను నడపాలని ఆయన అధికారులను ఆదేశించారు. స్పెషల్ బస్సుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎండీ నాగిరెడ్డి అధికారులకు సూచించారు

**తిరిగి నగరాలకు చేరుకునే ప్రయాణికుల కోసం..**

పండుగ ముగిసిన అనంతరం తిరిగి నగరాలకు చేరుకునే ప్రయాణికుల కోసం కూడా ఇదే తరహాలో ప్రత్యేక బస్సు సర్వీసులను సిద్ధం చేయాలని అధికారులను ఎండీ వై. నాగిరెడ్డి ఆదేశించారు. టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ ను ఒఒఒ.ట్రంతీఒఎబం.అఅ వెబ్ సైట్ లో బుక్ చేసుకోవాలని ఆయన తెలిపారు. దసరా కు స్వంత ఊర్లకు వెళ్లే ప్రయాణీకులు ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 లలో సంప్రదించాలని ఎండీ నాగిరెడ్డి సూచించారు. బస్ స్టేషన్లలో తాగునీరు, విశ్రాంతి వసతులు, పారిశుద్ధ్యం మరియు భద్రత విషయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటు న్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రయాణికులందరూ ఆర్టీసీ సేవలనే వినియోగించుకుని సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎండీ నాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

# కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో పరిశ్రమల తనిఖీ



**వరంగల్, వెలుతురు అక్టోబర్ 15:** వరంగల్ జిల్లాలో వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ఉన్న అపారమైన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, పరిశ్రమల పురోగతికి అవసరమైన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, ఐఏఎస్ అధికారులకు సూచించారు. గురువారం ఆయన వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను సందర్శించారు. పార్క్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న కిటెక్స్ , యంగ్‌వన్ , గణేశాకంపెనీలను స్వయంగా తనిఖీ చేశారు. ఆయా పరిశ్రమల్లోని ఉత్పత్తి కార్యకలాపాలు, పనితీరును పరిశీలించి, సంబంధిత అంశాలపై అధికారులు, పరిశ్రమల ప్రతినిధులతో ముచ్చటించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. వరంగల్ ప్రాంతంలో వస్త్ర పరిశ్రమలకు మరింత ప్రోత్సాహం కల్పించాలని, స్థానిక ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలను పెంపొందించాలని సూచించారు. పరిశ్రమల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను క్షుణ్ణంగా పరిశీలించి, తగిన ప్రతిపాదనలతో ముందుకు రావాలని అధికారులను ఆదేశించారు.వస్త్ర పరిశ్రమ రంగం అభివృద్ధి చెందడం ద్వారా స్థానికంగా పరిశ్రమల విస్తరణకు, ఈ ప్రాంత ఆర్థిక పురోగతికి దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి, పరిశ్రమలకు అవసరమైన సహకారాన్ని సకాలంలో అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, చేనేత మరియు వస్త్ర శాఖ అదనపు సంచాలకులు ఎన్. వెంకటేశ్వరరావు, ఏడీ శ్రీకాంత్ రెడ్డి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ స్వామి, నారాయణ రెడ్డి, టీటీడీఓ, సంగెం తహసీల్దార్ జి. రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ కౌన్సిల్ సమావేశ ఫలితాలపై అవగాహన

**-జీఎస్టీ కౌన్సిల్ సమావేశ ఫలితాలపై అవగాహన**



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 15 :** కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) ఛైర్మన్ శ్రీ వివేక్ చతుర్వేది, సీబీఐసీ సభ్యుడు (జీఎస్టీ) శ్రీ సంజయ్ మంగళ్‌తో కలిసి 2026 అక్టోబర్ 15న హైదరాబాద్‌లో జీఎస్టీ పన్ను చెల్లింపుదారులు, వాణిజ్య, పారిశ్రామిక రంగాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. 57వ జీఎస్టీ మండలి సమావేశంలో సిఫార్సు చేసిన జీఎస్టీ ప్రక్రియల సంస్కరణలు, కీలక చర్యల గురించి ఈ సమావేశంలో వివరించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు, భారీ ఉత్పత్తి సంస్థలు, సేవలందించే సంస్థలు, వ్యాపారులు, ఎగుమతిదారులు, స్టార్టప్‌లు, ఈ-కామర్స్ సంస్థల ప్రతినిధులతో పాటు వివిధ వాణిజ్య మండళ్లు, సంఘాలకు చెందిన సుమారు 250 మంది పన్ను చెల్లింపుదారులు, ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

2. హైదరాబాద్ సీజీఎస్టీ జోన్ చీఫ్ కమిషనర్ శ్రీ అరుణ్ కుమార్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర జీఎస్టీ విభాగాలకు చెందిన సీనియర్ అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

3. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో జీఎస్టీ కీలక సాధనంగా రూపుదిద్దుకుందని సీబీఐసీ ఛైర్మన్ శ్రీ వివేక్ చతుర్వేది తెలిపారు. 56వ జీఎస్టీ మండలి సమావేశంలో పన్ను రేట్ల హేతుబద్ధీకరణ, కీలక రంగాలపై పన్ను భారాన్ని తగ్గించడంపై దృష్టి సారించినట్లు వివరించారు. జీఎస్టీ సంస్కరణలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రక్రియాపరమైన మార్పులు అవసరమని భావించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో 57వ సమావేశంలో నిజాయితీగా పన్నులు చెల్లించే వారికి ఇబ్బందులు తగ్గించేలా తదుపరి తరం ప్రక్రియాపరమైన సంస్కరణల సమగ్ర కార్యాచరణకు జీఎస్టీ మండలి సిఫార్సులు చేసిందన్నారు. నిజాయితీగా పనిచేసే పరిశ్రమలను ప్రోత్సహించాలని, పన్నుల పరిపాలన వ్యవస్థను ఆర్థిక భాగస్వామిగా పనిచేసేలా మార్చాలని ఆయన పేర్కొన్నారు. జీఎస్టీ చట్టంలో అరెస్టుకు సంబంధించిన నిబంధనలను తొలగించడం, ప్రాసిక్యూషన్‌కు వర్తించే కనీస పరిమితిని పెంచడం, ఆటోమేటెడ్ వ్యవస్థ ద్వారా రిఫండ్‌లు అందించడం, మానవ ప్రమేయం ఉండే దశలను తగ్గించడం వంటి ప్రధాన సిఫార్సులను వివరించారు. అలాగే నిర్దిష్ట నిఘా సమాచార ఆధారంగా మాత్రమే వాహనాలను తనిఖీ చేయాలని, అది కూడా సరుకు బయలుదేరే రాష్ట్రం, చేరుకునే రాష్ట్రంలో మాత్రమే తనిఖీకి అనుమతించాలని సూచించినట్లు తెలిపారు. ఈ తనిఖీలకు జాయింట్ కమిషనర్ స్థాయి లేదా అంతకంటే పైస్థాయి అధికారి అనుమతి తప్పనిసరి అని వివరించారు.

4. కేంద్ర ప్రభుత్వ పరిపాలనా పరిధిలోకి వచ్చే పన్ను చెల్లింపుదారుల కోసం జీఎస్టీ పరిపాలనను కేంద్రీకృతం చేసే ప్రతిపాదిత కార్యక్రమం గురించి కూడా సీబీఐసీ ఛైర్మన్ వివరించారు. ఈ ప్రతిపాదనపై వాణిజ్య రంగ ప్రతినిధుల అభిప్రాయాలను కోరారు.

5. సమావేశంలో పాల్గొన్నవారు లేవనెత్తిన ప్రశ్నలకు, కోరిన వివరణలకు సీబీఐసీ ఛైర్మన్, సభ్యుడు (జీఎస్టీ) సమాధానాలు ఇచ్చారు. మరిన్ని పన్ను సంస్కరణలపై ప్రతినిధులు చేసిన సూచనలను స్వాగతిస్తూ, వాటిని తగిన విధంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

6. 57వ జీఎస్టీ మండలి సమావేశంలో ప్రకటించిన నిర్ణయాలను వాణిజ్య, పారిశ్రామిక రంగాల ప్రతినిధులు స్వాగతించారు. ఈ నిర్ణయాలు పరస్పర విశ్వాసంపై ఆధారపడిన పన్నుల పరిపాలన వ్యవస్థను నిర్మించేందుకు, వ్యాపార సంస్థలకు వర్కింగ్ క్యాపిటల్ అందుబాటును మెరుగుపరిచేందుకు, వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేసేందుకు గణనీయంగా దోహదపడతాయని వారు పేర్కొన్నారు.

7. మధ్యాహ్నం జరిగిన సమావేశంలో సీబీఐసీ ఛైర్మన్, సభ్యుడు (జీఎస్టీ) సీబీఐసీ అధికారులతో సమావేశమయ్యారు. పారదర్శకంగా, ఎలాంటి అనవసర ఇబ్బందులు లేని, ముందుగా అంచనా వేయగల పన్నుల పరిపాలన వ్యవస్థను అందించాల్సిన అవసరాన్ని వారు నొక్కిచెప్పారు.

# ఉద్యోగుల ఐక్యతనే టీజీఈజేఏసీ బలం

**-ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటూనే సమస్యలపై ఒత్తిడి తెద్దాం**




- ప్రజా ప్రభుత్వంలోనే ఎన్నో విజయాలు సాధించుకున్నాం
- తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 15:** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగులకు స్వేచ్ఛా వాతావరణం వచ్చిందని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. గత పదేళ్ల ప్రభుత్వంలో పరిష్కారానికి నోచుకోని ఎన్నో సమస్యలను ఈ ప్రజా ప్రభుత్వంలో పరిష్కారం చేసిన ఘనత తెలంగాణ ఉద్యోగుల జేఏసీకే దక్కుతుందన్నారు. దీనికంతటికీ ప్రధాన కారణం మన ఉద్యోగుల జేఏసీలోని ఐక్యతనేన న్నారు. ఐక్యతతో ఉంటే భవిష్యత్తులో మరెన్నో విజయాలను సాధించుకోవచ్చని.. ఇదే ఐక్యతతో ముందుకు సాగుదామని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం వరంగల్‌లో ఉద్యోగులతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. జేఏసీ నేత ఇక్బాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్, జేఏసీ నాయకులు విచ్చేసి మాట్లాడారు.

**ఉద్యోగుల సంక్షేమమే టీజీఈజేఏసీ లక్ష్యం..**

రాష్ట్రంలోని ప్రతి ఉద్యోగి సంక్షేమమే లక్ష్యంగా టీజీఈజేఏసీ పని చేస్తుందని ఈ సందర్భంగా లచ్చిరెడ్డి పేర్కొన్నారు. ఒకవైపు ఉద్యోగుల హక్కుల కోసం ప్రభుత్వంతో కొట్లాడుతూనే.. మరోవైపు అదే ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటూ మన జేఏసీ ఎన్నో విజయాలను సాధించిందన్నారు. భవిష్యత్తులోనూ మరెన్నో విజయాలను సాధించబోతుందన్నారు. ఇప్పటికే ఉద్యోగులకు రెండు డీఏల విషయంలో మన జేఏసీ సాధించిన విజయమేనన్నారు. ఇదే కాకుండా ఉద్యోగులకు కొత్త ఆరోగ్య పథకం రావడంలోనూ, రూపాయి చెల్లించకుండా వైద్య సేవలు పొందడంలోనూ ప్రభుత్వ పెద్దల సహకారంతో మన జేఏసీ కృషి ఫలితమేనన్నారు.

**ప్రతి ఉద్యోగి సమస్యను తెలుసుకునేందుకే ముఖాముఖి..**

రాష్ట్రంలో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకొని ఎన్నో ఉద్యోగుల సమస్యలు ఉన్నాయని ఈ సందర్భంగా లచ్చిరెడ్డి పేర్కొన్నారు. అందుకోసమే ప్రతి ఉద్యోగి సమస్యను ప్రత్యక్షంగా తెలుసుకొనేందుకే ఉద్యోగులతో ముఖాముఖి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇక్కడ ఉద్యోగుల నుంచి తెలుసుకున్న ప్రతి సమస్యను ప్రభుత్వం దగ్గరకు తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఇదే సమస్యలపై ప్రభుత్వ పెద్దలకు సైతం సలహాలు, సూచనలు ఇచ్చేందుకు దోహదపడుతాయన్నారు.

**పట్టభద్రుల ఎన్నికల్లో సత్తా చాటాలి..**

రాష్ట్రంలో ఉద్యోగుల సంఖ్య తగ్గిపోయిందని కొందరు.. వీరి పాత్ర ఏముంటుందని మరికొందరు అంటున్నారని ఈ సందర్భంగా లచ్చిరెడ్డి గుర్తుచేశారు. వాస్తవానికి ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలను చేరవేయడంలో ఉద్యోగుల పాత్రనే కీలకమైందన్నారు. ఇదే కాకుండా ప్రతి ఎన్నికల సమయంలోనూ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కలిపితే చాలా పెద్ద సంఖ్యగానే మారుతుందన్నారు. అందుకే త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ప్రతి ఉద్యోగి ముందుగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇదే కాకుండా కుటుంబ సభ్యులతో పాటు బంధుమిత్రులను సైతం ఓటరుగా నమోదు చేయించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ నాయకులు ఎస్.రాములు, కె.మహిపాల్‌రెడ్డి, బాణాల రాంరెడ్డి, రమేష్ పాక, పూల్‌సింగ్ చౌహాన్, కృష్ణుడు, గరికె ఉపేంద్రరావు, హబీబుద్దీన్, ఉపేందర్, శ్రీకాంత్‌గౌడ్, బాణాల రాంరెడ్డి, వర్రె భిక్షం, కె.రేణుక, బుచ్చయ్య, వై.కుమార్, అజీజ్, సుదర్శన్‌గౌడ్, రాజేశ్వరరావు, మురళీ, శ్రీనివాస్, కృష్ణంరాజు, తిరుపతి, వేణు, అర్జున్ మల్లారం, శిరీషారెడ్డి, బుచ్చిబాబు, నర్సమ్మ, కె.సతీష్, పులిరాజు, మహేంద్ర, హరిప్రసాద్, సర్వేశ్వర్, లక్ష్మయ్య, నాగరాజు, చిరంజీవి, వెంకటనరసింహారెడ్డి, శ్రీనివాస్, వినోద్‌కుమార్, గిరిబాబు, వీరయ్య, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ తెలంగాణ సంస్కృతి సంప్రదాయానికి ప్రతీక

- గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా లోక్ భవన్ లో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు
- బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ దంపతులు
- గౌరమ్మకు గవర్నర్ దంపతుల ప్రత్యేక పూజలు తెలంగాణ సుభిక్షంగా ఉండాలని ప్రార్థన





**హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 15, 2026 :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు , స్త్రీశక్తికి, సౌభాగ్యానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ రాష్ట్ర ప్రజల్లో ప్రకృతి పట్ల ఆరాధనాభావాన్ని, సాంస్కృతిక వారసత్వం పట్ల గౌరవాన్ని, సామాజిక ఐక్యతను పెంపొందిస్తుందని గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా అన్నారు. పుష్పాలనే దైవ స్వరూపంగా భావించి పూజించే ప్రకృతి ఉత్సవం బతుకమ్మ పండుగ అని గవర్నర్ పేర్కొన్నారు . గురువారం లోక్‌భవన్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన తన సతీమణి శ్రీమతి జానకి శుక్లాతో కలిసి పాల్గొని, గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలు, శాంతి, ఆరోగ్యం, సమృద్ధి కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ ... పూలతో అలంకరించిన బతుకమ్మ ప్రకృతి సౌందర్యానికి, జీవన వైభవానికి, మానవాళికి ప్రకృతితో ఉన్న విడదీయరాని అనుబంధానికి ప్రతిబింబమని అన్నారు. ప్రకృతిని పరిరక్షించడం, సహజ వనరులను గౌరవించడం, పర్యావరణం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించడం వంటి విలువలను ఈ పండుగ చాటిచెబుతుందని తెలిపారు. బతుకమ్మ మహిళల సృజనాత్మకతకు, ఆత్మగౌరవానికి, సామాజిక భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. జానపద గీతాలు, కళలు, సంప్రదాయ ఆచారాల ద్వారా తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని సజీవంగా నిలుపుతున్న మహిళల పాత్ర ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ అమూల్యమైన వారసత్వాన్ని పరిరక్షించి, భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.ప్రకృతి పరిరక్షణ, మహిళా సాధికారత, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, సామాజిక సామరస్యానికి ప్రాధాన్యమిస్తూ తెలంగాణ పురోగతి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గవర్నర్ పిలుపునిచ్చారు. బతుకమ్మ పండుగ ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, ఐక్యతను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

**వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు**

లోక్‌భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో సుమారు 400 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు . తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు , లోక్‌భవన్ మహిళా ఉద్యోగులు , వారి కుటుంబ సభ్యులు ఉన్నారు. గౌరీదేవి ప్రతిరూపాల చుట్టూ మహిళలంతా చేరి, చప్పట్లు కొడుతూ, లయబద్ధంగా ఉయ్యాల పాటలు పాడుతూ, నృత్యాలు చేశారు. కోలాటాల కోలాహలంతో అమ్మవారికి నీరాజనాలు పట్టారు. కుటుంబ క్షేమాన్ని కాంక్షిస్తూ, తమ సౌభాగ్యాన్ని నిండు నూరేళ్లు కాపాడమంటూ ఆ తల్లిని మనసారా వేడుకున్నారు. అనంతరం బతుకమ్మలను గవర్నర్ సతీమణి శ్రీమతి జానకి శుక్లా, మహిళా ఉద్యోగినులు లోక్ భవన్ లోని కొలనులో నిమజ్జనం చేశారు. కోలాట బృందాల సందడి, బతుకమ్మ పాటల మధురిమతో లోక్ భవన్ ప్రాంగణం పండుగ కళను సంతరించుకోనుంది.

**రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగుల్లో... లోక్ భవన్**

బతుకమ్మ పండుగ వేళ లోక్ భవన్ రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో జిగేల్‌మంటూ వెలిగిపోయింది. పూల పండుగైన బతుకమ్మకు ఈ విద్యుత్ కాంతులు అదనపు శోభను ఇచ్చాయి. వేడుకల్లో గవర్నర్ సంయుక్త కార్యదర్శి శ్రీ శశికిరణ్ కోమండూర్ , ఉప కార్యదర్శి పల్లవి , ప్రెస్ సెక్రెటరీ మామిండ్ల దశరథం ,అధికారులు , ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు .

# నిన్ను నువ్వు నమ్ము!



**"ఆయుష్షును దేవుడు ఇస్తాడు... తల్లి జన్మనిస్తుంది..."**

అనే మాటల్లో జీవితం పట్ల కృతజ్ఞత ఉంది. తల్లి మనకు జన్మనిచ్చి, ప్రేమతో పెంచుతుంది. కుటుంబం, గురువులు, సమాజం మన ఎదుగుదలకు తోడ్పడతారు. అయితే మనకు లభించిన జీవితాన్ని ఎలా ఉపయోగించుకోవాలనే బాధ్యత మనకూ ఉంటుంది. మన బదులుగా మరొకరు మన లక్ష్యాల కోసం కష్టపడలేరు; మనం వేయాల్సిన అడుగును మనమే వేయాలి.

"నీ తలరాతను రాసుకునే అవకాశం నీకే ఉంది" అంటే, జీవితంలో జరిగేదంతా మన అదుపులో ఉంటుందని కాదు. మన నిర్ణయాలు, అలవాట్లు, క్రమశిక్షణ, కృషి ద్వారా భవిష్యత్తును ప్రభావితం చేయగలమని అర్థం. ఈరోజు నేర్చుకున్న ఒక మంచి విషయం, మార్చుకున్న ఒక చెడు అలవాటు, నిజాయితీగా చేసిన ఒక ప్రయత్నం---రేపటి జీవితానికి పునాది కావచ్చు.

కొన్నిసార్లు మనం చేయాల్సిన పనిని వాయిదా వేస్తాం. నేర్చుకునే అవకాశం ఉన్నా పట్టించుకోము. తప్పు తెలిసినా సరిదిద్దుకోము. ఆ తర్వాత ఆశించిన ఫలితం రాకపోతే "నా అదృష్టం ఇంతే... దేవుడు ఇలాగే రాశాడు..." అని సరిపెట్టుకుంటాం. అలా అనుకోవడం వల్ల కొద్దిసేపు మనసుకు ఊరట కలిగినా, సమస్యకు పరిష్కారం దొరకదు. మన లోపాన్ని గుర్తించి మార్చుకున్నప్పుడే ముందడుగు పడుతుంది.

అయితే, ప్రతి ఓటమినీ చేతగానితనంగా చూడకూడదు. నిజాయితీగా కష్టపడినా అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ బాధ్యతలు, అవకాశాల కొరత వంటి కారణాలతో ఫలితం ఆలస్యం కావచ్చు. అలాంటి సమయంలో మనల్ని మనం తక్కువ చేసుకోవాల్సిన అవసరం లేదు. మనకు సాధ్యమైన మార్పును గుర్తించి, అవసంౕమైన సహాయం తీసుకుని, పరిస్థితులకు తగినట్టు ప్రయత్నాన్ని కొనసాగించాలి.

పరీక్షకు సిద్ధం కాకుండా ఫలితాన్ని అదృష్టంపై వదిలేయడం ఒక విషయం. బాగా చదివినా ఆశించిన మార్కులు రాకపోవడం మరో విషయం. మొదటి సందర్భంలో అలవాట్లు మార్చుకోవాలి. రెండో సందర్భంలో ఎక్కడ ఇబ్బంది ఎదురైందో తెలుసుకుని, పద్ధతిని మెరుగుపరచుకోవాలి. రెండింటిలోనూ ఉపయోగపడేది మన ప్రయత్నాన్ని సమీక్షించుకోవడమే.

"పక్షులు ఆకాశాన్ని నమ్మి ఎగరవు... తమ రెక్కలను నమ్ముకుని ఎగురుతాయి" అనే ఉపమానం ఆత్మవిశ్వాసానికి అందమైన ఉదాహరణ. ఆకాశం ఎంత విశాలంగా ఉన్నా, పక్షి తన రెక్కలను కదపాలి. అలాగే అవకాశాలు కనిపించినంత మాత్రాన విజయం రాదు. వాటిని ఉపయోగించుకునే నైపుణ్యం, ధైర్యం, శ్రమ మనలో పెరగాలి.

మనిషికి రెక్కల్లాంటివి---జ్ఞానం, అనుభవం, పట్టుదల, క్రమశిక్షణ. వృత్తిలో కొత్త విషయం నేర్చుకోవడం, చేసిన తప్పును ఒప్పుకోవడం, మాట నిలబెట్టుకోవడం, పనిని బాధ్యతగా పూర్తి చేయడం ద్వారా ఆ రెక్కలు బలపడతాయి. ఆత్మవిశ్వాసం అంటే "నాకు అన్నీ తెలుసు" అనుకోవడం కాదు; "తెలియనిది నేర్చుకోగలను, తప్పును సరిదిద్దుకోగలను" అని నమ్మడం.

దేవుడిపై విశ్వాసం మనసుకు ధైర్యాన్ని ఇవ్వవచ్చు. ఆ ధైర్యంతో మనం పని చేయాలి. ప్రార్థనతోపాటు ప్రయత్నం, ఆశతోపాటు ఆచరణ, సంకల్పంతో పాటు క్రమశిక్షణ ఉన్నప్పుడే మార్పుకు అవకాశం పెరుగుతుంది. ఇతరుల సహాయం తీసుకోవడం కూడా బలమే; ఆ సహాయాన్ని సద్వినియోగం చేసుకునే బాధ్యత మనది.

మన గతాన్ని మార్చలేకపోవచ్చు. కానీ గతంలోని తప్పును మళ్లీ చేయకుండా ఈరోజు జాగ్రత్తపడవచ్చు. వచ్చిన ప్రతి అవకాశాన్నీ నిలబెట్టుకోలేకపోవచ్చు. కానీ మరో అవకాశం వచ్చినప్పుడు సిద్ధంగా ఉండవచ్చు. ఒక్కసారిగా జీవితమంతా మారకపోయినా, ప్రతిరోజూ చేసే చిన్న మంచి ప్రయత్నాలు మన దారిని మార్చగలవు. "నా రాత ఇంతే" అని ఆగిపోవడం కంటే... "ఇక్కడి నుంచి నేను ఏమి చేయగలను?" అని ఆలోచించాలి. మన శక్తిని గుర్తించి, మన ప్రయత్నాన్ని కొనసాగించాలి. ఆశకు తోడుగా అడుగు పడినప్పుడే ప్రయాణం ముందుకు సాగుతుంది.



-మీ నక్క యాదగిరి

## ఆకాశం వైపు అడుగులు..

# నేలను కోల్పోతున్నామా?

**చంద్రుడిపై అడుగులు వేయాలని, అంగారకుడి రహస్యాలను ఛేదించాలని, అంతరిక్షంలో కొత్త ప్రపంచాలను అన్వేషించాలని మానవ మేధస్సు నిరంతరం ముందుకు సాగుతోంది. ఈ విజయాలు శాస్త్రీయ పురోగతికి గర్వకారణాలు. అయితే అంతరిక్షంలో కొత్త చరిత్రను లిఖిస్తున్న మనిషి, తాను జీవిస్తున్న భూమి భవిష్యత్తును కూడా అంతే శ్రద్ధతో కాపాడుకోవాలి. అమెరికా అంతరిక్ష సంస్థ నాసా 2026 ఫిబ్రవరి 27న ప్రకటించిన ఆర్టెమిస్ కార్యక్రమ మార్పులు చంద్రుడిపై మానవ అన్వేషణను మరింత ముందుకు తీసుకెళ్లే లక్ష్యాన్ని చాటాయి. ఈ సాంకేతిక విజయాల స్ఫూర్తితో పర్యావరణ పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యం ఇచ్చి కార్యాచరణ సాగితే అభివృద్ధికి మరింత సార్థకత చేకూరుతుంది. ఐక్యరాజ్యసమితి 2025 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల నివేదిక ప్రకారం, 2000 నుంచి 2020 మధ్య ప్రపంచ అటవీ విస్తీర్ణం సుమారు పది కోట్ల హెక్టార్లు తగ్గింది. 2020 నాటికి ప్రపంచ భూభాగంలో అడవుల వాటా 31 శాతంగా నమోదైంది. అటవీ నష్టానికి వ్యవసాయ విస్తరణ ప్రధాన కారణం. ఈ గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నప్పటికీ, శాస్త్రీయ పరిజ్ఞానం, సమర్థవంతమైన విధానాలు, ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి సంపదను పునరుద్ధరించే అవకాశాలు ఇంకా ఉన్నాయి.**



**ప్రకృతి పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం**

ప్రకృతిని కాపాడుకోవడం ప్రభుత్వాలు, పర్యా వరణ సంస్థలకే పరిమితమైన బాధ్యత కాదు. అడవులతో మమేకమై జీవిస్తూ, తరతరాలుగా ప్రకృతి వనరులపై అనుభవజ్ఞానాన్ని సంపాదించిన ఆదివాసీ సమాజాల నుంచి ప్రపంచం నేర్చుకోవాల్సింది చాలానే ఉంది. ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక వ్యవహారాల విభాగం 2025 ఏప్రిల్‌లో ప్రచురించిన 'స్టేట్ ఆఫ్ ది వరల్డ్స్ ఇండిజినస్ పీపుల్స్' నివేదిక వాతావరణ సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో ఈ సమాజాల పాత్రను స్పష్టం చేసింది. ప్రపంచ జనాభాలో వారి వాటా సుమారు ఐదు శాతమే అయినప్పటికీ, భూమి, అడవులు, జీవవైవిధ్య పరిరక్షణలో వారి అనుభవానికి అంతర్జాతీయంగా గుర్తింపు ఉంది. ప్రకృతితో వారి అనుబంధం కేవలం జీవనోపాధికే పరిమితం కాదు. అది సంస్కృతి, సంప్రదాయం, సామూహిక జీవనం, ఆధ్యాత్మిక విశ్వాసాలతో ముడిపడి ఉంటుంది. స్థానిక విత్తనాల సంరక్షణ, ఔషధ మొక్కలపై అవగాహన, నీటి వనరుల నిర్వహణ, అడవులపై ఆధారపడిన జీవన విధానాలు పర్యావరణ పరిరక్షణకు గణనీయంగా తోడ్పడగలవు. అయితే ఈ సమాజాల అనుభవాన్ని గుర్తించడం మాత్రమే సరిపోదు. వారి భూమి, జీవనోపాధి, సాంస్కృతిక గుర్తింపు, చట్టబద్ధమైన హక్కులకు రక్షణ కల్పించాలి. స్థానిక అనుభవజ్ఞానాన్ని ఆధునిక శాస్త్రీయ పరిశోధనతో సమన్వయం చేస్తే ప్రకృతి పరిరక్షణ మరింత ప్రభావవంతంగా మారుతుంది.

**స్థానిక జ్ఞానం ప్రపంచానికి వెలుగు**

తెలంగాణలోని ఆదిలాబాద్ ప్రాంతంతో పాటు మధ్య భారతదేశంలోని పలు ప్రాంతాల్లో గోండు సమాజం ప్రకృతితో ముడిపడిన ప్రత్యేక జీవన సంప్రదాయాలను కొనసాగిస్తోంది. అడవులు, నీటి వనరులు, స్థానిక జీవవైవిధ్యం, సామూహిక ఆచారాలు వారి సాంస్కృతిక వారసత్వంలో భాగం. ఈ వారసత్వాన్ని భావితరాలకు అందించడంలో భాషకు కీలక స్థానం ఉంది. ఆదిలాబాద్ జిల్లా గుంజాల గ్రామంతో అనుబంధం కలిగిన గుంజాల గోండి లిపికి యూనికోడ్ ప్రమాణంలో ప్రత్యేక కోడ్ పరిధి ఉండటం భాషా పరిరక్షణలో ముఖ్యమైన ముందడుగు. దీనివల్ల కంప్యూటర్లు, డిజిటల్ పరికరాల్లో ఈ లిపిని ఉపయోగించడం, పుస్తకాలు, పత్రాలను భద్రపరచడం, భాషా సమాచారాన్ని విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడం సాధ్యమైంది. అయినప్పటికీ డిజిటల్ గుర్తింపుతోనే సంస్కృతి పరిరక్షణ పూర్తి కాదు. మాతృభాషలో విద్యకు ప్రోత్సాహం, స్థానిక చరిత్రను పత్రబద్ధం చేయడం, సంప్రదాయ జ్ఞానాన్ని సంబంధిత సమాజాల సమ్మతితో భద్రపరచడం, యువతకు తమ వారసత్వాన్ని పరిచయం చేయడం అవసరం. గోండు సమాజం ప్రకృతితో ఏర్పరచుకున్న అనుబంధాన్ని గౌరవిస్తూ, వారి భాషకు ఆధునిక సాంకేతిక ప్రపంచంలో తగిన స్థానం కల్పించడం సమ్మిళిత అభివృద్ధికి దోహదపడుతుంది. స్థానిక సంస్కృతిని కాపాడటం అంటే గతాన్ని మాత్రమే సంరక్షించడం కాదు. భవిష్యత్తుకు అవసరమైన జ్ఞానాన్ని కూడా భద్రపరచడం.

**పర్యావరణ సమతుల్యతే అసలైన ప్రగతి**

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణానికి ఎదురవుతున్న సవాళ్లు తీవ్రమైనవే అయినప్పటికీ, కొన్ని రంగాల్లో ఆశాజనక మార్పులు కనిపిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి 2025 నివేదిక ప్రకారం, ప్రపంచంలో వార్షిక అటవీ నష్టం 2010--2015 మధ్య సుమారు 1.2 కోట్ల హెక్టార్లుగా ఉండగా, 2015--2020 మధ్య సుమారు కోటి హెక్టార్లకు తగ్గింది. ఇది సానుకూల పరిణామమే అయినా, అడవుల నష్టం పూర్తిగా ఆగలేదన్న వాస్తవాన్ని గుర్తించాలి. మరోవైపు భూక్షీణతకు గురైన భూభాగం ప్రపంచవ్యాప్తంగా 2015లో 11.3 శాతంగా ఉండగా, 2019 నాటికి 15.5 శాతానికి పెరిగింది. దీని ప్రభావం సుమారు 320 కోట్ల మంది ప్రజల జీవనంపై పడినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఈ పరిస్థితుల్లో అటవీ పునరుద్ధరణ, నేల నాణ్యత మెరుగుదల, నీటి వనరుల సంరక్షణ, స్థానిక సమాజాల భాగస్వామ్యానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలి. మొక్కలు నాటిన సంఖ్య ఒక్కటే విజయానికి కొలమానం కాకూడదు. నాటిన మొక్కలు బతికి పెరుగుతున్నాయా, స్థానిక జీవవైవిధ్యానికి తోడ్పడుతున్నాయా, నేల ఆరోగ్యం మెరుగుపడుతోందా అనే అంశాలను కూడా పరిశీలించాలి. పర్యావరణ కార్యక్రమాల ఫలితాలను పారదర్శకంగా వెల్లడిస్తూ, శాస్త్రీయ పరిశీలనతో పాటు స్థానిక ప్రజల అనుభవాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. పర్యావరణ పరిరక్షణను అభివృద్ధికి అడ్డంకిగా కాకుండా, వ్యవసాయం, ఆరోగ్యం, ఉపాధి, ఆర్థిక భద్రతకు తోడ్పడే దీర్ఘకాలిక పెట్టుబడిగా చూడాలి. ప్రకృతిని కాపాడుతూ అభివృద్ధిని సాధించినప్పుడే ఆ పురోగతి సమాజంలోని అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుస్తుంది.

**హక్కుల గౌరవంతోనే సమగ్ర అభివృద్ధి**

భారతదేశంలో ఆదివాసీ సమాజాల హక్కులు, జీవనోపాధి, సాంస్కృతిక గుర్తింపును పరిరక్షించేందుకు రాజ్యాంగం, చట్టాలు కీలకమైన ఆధారాలను కల్పిస్తున్నాయి. రాజ్యాంగంలోని 342వ అధికరణం షెడ్యూల్డ్ తెగల గుర్తింపునకు సంబంధించినది. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో స్థానిక స్వపరిపాలనకు 1996 పీసా చట్టం, అటవీ నివాసుల హక్కుల గుర్తింపునకు 2006 అటవీ హక్కుల చట్టం ప్రాధాన్యం కలిగి ఉన్నాయి. అయితే చట్టాల ప్రయోజనం అర్హులైన ప్రజలకు చేరినప్పుడే వాటి లక్ష్యం నెరవేరుతుంది. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ 2026 ఆగస్టు 12న రాజ్యసభకు అందించిన సమాచారం ప్రకారం, జూన్ 30 నాటికి దేశవ్యాప్తంగా అటవీ హక్కుల చట్టం కింద దాదాపు 54,01,561 దరఖాస్తులు అందాయి. వాటిలో 25,42,359 హక్కుల పత్రాలు జారీ కాగా, 18,13,232 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. 10,45,970 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. జారీ చేసిన పత్రాల్లో 24,18,197 వ్యక్తిగత హక్కులకు, 1,24,162 సామూహిక హక్కులకు సంబంధించినవిగా తెలుస్తుంది. ఈ వివరాలు హక్కుల గుర్తింపుతో పాటు దరఖాస్తుల పరిష్కారం, తిరస్కరణలకు స్పష్టమైన కారణాలు తెలియజేయడం, నిబంధనల ప్రకారం పునఃపరిశీలనకు అవకాశం కల్పించడం వంటి అంశాల ప్రాధాన్యాన్ని సూచిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, అటవీ శాఖలు, గ్రామసభలు సమన్వయంతో పనిచేస్తే హక్కుల అమలు మరింత మెరుగుపడుతుంది. అంతరిక్షాన్ని చేరడం మానవ మేధస్సుకు నిదర్శనం. భూమిని భావితరాలకు భద్రంగా అందించడం ఆ మేధస్సుకు అసలైన బాధ్యత. ప్రకృతిని కాపాడే అభివృద్ధి, ఆదివాసీ హక్కులను గౌరవించే పాలన, స్థానిక జ్ఞానానికి గుర్తింపు కలిసినప్పుడే ప్రగతికి సంపూర్ణ అర్థం చేకూరుతుంది. భావితరాలు గర్వంగా చదివే అంతరిక్ష విజయాల చరిత్రను లిఖించడమే కాదు.. అవి గర్వంగా జీవించేలా పచ్చని భూమిని వారసత్వంగా అందించడమే మానవ ప్రగతికి అసలైన విజయం.



వ్యాసకర్త:
-ఫిరోజ్ ఖాన్, సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
ఫోన్: 9640466464

## శ్రమను గౌరవించని

# సమాజంలో అభివృద్ధి సాధ్యమా?

**దేశం అభివృద్ధి చెందుతోందట. నగరాలు విస్తరిస్తున్నాయట. కొత్త రహదారులు వస్తున్నాయట. ఆకాశహర్మ్యాలు పెరుగుతున్నాయట. సాంకేతికత పరుగులు పెడుతోందట. ఆర్థిక వ్యవస్థ వేగంగా ఎదుగుతోందట. ఇవన్నీ నిజమే కావచ్చు. కానీ ఈ అభివృద్ధి మధ్యలో కష్టపడి పనిచేసే మనిషి ఎక్కడ ఉన్నాడు? అతని జీవితం ఎంత మారింది? అతని కుటుంబానికి భద్రత ఎంత పెరిగింది? అతని పిల్లల భవిష్యత్తు ఎంత మెరుగైంది? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకోవడం అద్దం ముందు నిలబడి మనల్ని మనమే పొగుడుకోవడమే. పొలంలో విత్తనం వేసేది రైతు. ఎండనకా, వాననకా పంటను కాపాడేది రైతు. కలుపు తీసేది కూలీ. పంటను కోసేది కూలీ. ధాన్యాన్ని మోసేది కూలీ. నగరాల్లో భవనాలు నిర్మించేది కార్మికుడు. రోడ్లపై తారు పోసేది కార్మికుడే. మన ఇళ్లను శుభ్రం చేసేది, మన చెత్తను తొలగించేది, మన సౌకర్యాల కోసం తెల్లవారుజామునే పనిలోకి వెళ్లేది కూడా శ్రమజీవే.**



సమాజం అతని శ్రమను ఉపయోగించుకుంటుంది తప్ప, అతని జీవితాన్ని గౌరవించడానికి మాత్రం వెనుకాడుతుంది. ఇదే మన అభివృద్ధి నమూనాలోని అసలు వైరుధ్యం. ఒక మనిషి రోజంతా కష్టపడుతున్నాడు. అయినా నెలాఖరులో అతని చేతిలో మిగిలేది అప్పులే. మరోవైపు శ్రమతో సంబంధం లేని సంపదపై సంపద పెరుగుతోంది. ఒక కుటుంబం తరతరాలుగా ఆస్తులను వారసత్వంగా పొందుతోంది. ఇంకొక కుటుంబం తరతరాలుగా అప్పులను వారసత్వంగా మోస్తోంది. ఒకరి పిల్లలకు ప్రైవేట్ విద్య, మెరుగైన వైద్యం, సురక్షితమైన జీవితం అందుబాటులో ఉంటే, మరొకరి పిల్లలు కనీస అవసరాల కోసం కూడా పోరాడాల్సి వస్తోంది. సమాజంలో అసమానత ఇంత స్పష్టంగా కనిపిస్తున్నా దాన్ని సహజమైన విషయంగా చూడటం మరింత ప్రమాదకరం. పేదరికం అనేది కేవలం డబ్బు లేకపోవడం కాదు. అవకాశాలు లేకపోవడం కూడా పేదరికమే. భూమి లేకపోవడం, స్థిరమైన ఉపాధి లేకపోవడం, నాణ్యమైన విద్య అందకపోవడం, వైద్యం ఖరీదైపోవడం, అప్పుల నుంచి బయటపడలేకపోవడం---ఇవన్నీ పేదరికాన్ని తరతరాలకు కొనసాగించే కారణాలే. ఒక కుటుంబం అనారోగ్యానికి అప్పు చేస్తుంది. ఆ అప్పు తీర్చడానికి మరో అప్పు చేస్తుంది. అధిక వడ్డీ ఆ కుటుంబ ఆదాయాన్ని మింగేస్తుంది. చివరకు కష్టపడేది కుటుంబమే అయినా, కష్టఫలం మాత్రం అప్పుదారుడి చేతుల్లోకి వెళ్తుంది. ఇదే దోపిడీకి ఆధునిక రూపం. మార్కెట్‌లో ప్రతి వస్తువుకు ధర ఉంటుంది. కానీ ఆ వస్తువును తయారు చేసిన మనిషి శ్రమకు మాత్రం ఎప్పుడూ న్యాయమైన ధర ఉండదు. రైతు పండించిన పంటకు ధర నిర్ణయించేది అతను కాకపోవచ్చు. కార్మికుడి వేతనాన్ని నిర్ణయించే శక్తి అతని చేతుల్లో ఉండకపోవచ్చు. అసంఘటిత రంగంలోని కూలీకి పని ఉన్న రోజే ఆదాయం. పని లేని రోజు జీవితం నిలిచిపోవాల్సిందే. ఈ అనిశ్చితి మధ్య కూడా మనం అతని శ్రమను చౌకగా కొనాలని చూస్తే, మనం అభివృద్ధి చెందుతున్నామా లేక అసమానతను మరింత బలపరుస్తున్నామా అన్న ప్రశ్న తప్పదు. శ్రమను గౌరవించడం అంటే కూలీని చూసి జాలి పడటం కాదు. రైతును చూసి సానుభూతి చూపడం కాదు. కార్మికుడిని ఒకరోజు సన్మానించడం అంతకన్నా కాదు. శ్రమకు న్యాయమైన ప్రతిఫలం ఇవ్వడం, పని చేసే మనిషికి భద్రత కల్పించడం, అతని హక్కులను రక్షించడం, అతని పిల్లలకు సమాన అవకాశాలు కల్పించడం ఇదే నిజమైన శ్రమ గౌరవం. కష్టపడే మనిషి తన జీవితాన్ని మార్చుకునే అవకాశం పొందినప్పుడే సమాజం ముందుకు వెళ్తుంది. ఈరోజు మనం అభివృద్ధిని కొలిచే ప్రమాణాలను కూడా ఒకసారి పరిశీలించాలి. ఎన్ని ఫ్లైఓవర్లు నిర్మించాం? ఎన్ని పరిశ్రమలు వచ్చాయి? ఎంత పెట్టుబడి వచ్చింది? అనే లెక్కలతో పాటు ఎన్ని కుటుంబాలు అప్పుల నుంచి బయటపడ్డాయి? ఎన్ని కూలీలకు స్థిరమైన ఉపాధి వచ్చింది? రైతు ఆదాయం ఎంత స్థిరపడింది? సామాన్యుడికి వైద్యం, విద్య ఎంత అందుబాటులోకి వచ్చాయి? అనే ప్రశ్నలు కూడా అడగాలి. ఎందుకంటే కాంక్రీట్ భవనాల ఎత్తు పెరిగినంత మాత్రాన మనిషి జీవితం ఎత్తుకు ఎదిగినట్లు కాదు. సమాజంలో సంపద పెరగడం అవసరమే. కానీ ఆ సంపద సృష్టిలో భాగస్వాములైన ప్రజల జీవితాలు కూడా మెరుగు పడాలి.

**శ్రమకు విలువలేని చోట సమానత్వం లేదు**

అభివృద్ధి ఫలాలు కొద్దిమందికే పరిమితమైతే అది ఆర్థిక వృద్ధి కావచ్చు, కానీ సామాజిక అభివృద్ధి కాదు. ప్రజల కొనుగోలు శక్తి పెరగాలి. ఉపాధి భద్రత పెరగాలి. కష్టజీవికి గౌరవం పెరగాలి. పేద కుటుంబంలోని పిల్లవాడికి కూడా తన తల్లిదండ్రుల పేదరికాన్ని వారసత్వంగా మోసే పరిస్థితి ఉండకూడదు. చివరికి ప్రశ్న ఒక్కటే---ఈ సమాజాన్ని నిజంగా నడిపించేది ఎవరు? సంపదను కూడబెట్టిన కొద్దిమందా? లేక ఆ సంపదను సృష్టించే కోట్లాది శ్రమజీవులా? సమాధానం మన కళ్లముందే ఉంది. అయినా శ్రమజీవి జీవితాన్ని అంచునే ఉంచి అభివృద్ధి గురించి మాట్లాడటం ఎంతకాలం కొనసాగుతుంది? మనిషి శ్రమకు విలువ లేని చోట సంపద ఉండవచ్చు, సాంకేతికత ఉండవచ్చు, భవనాలు ఉండవచ్చు. కానీ సమానత్వం ఉండదు. న్యాయం ఉండదు. నిజమైన అభివృద్ధి ఉండదు. శ్రమను గౌరవించే సమాజమే స్థిరమైన సమాజం. శ్రమకు న్యాయం చేసే అభివృద్ధే ప్రజల అభివృద్ధి. కష్టజీవి జీవితం మారనంత వరకు అభివృద్ధి కథ అసంపూర్ణంగానే మిగులుతుంది అనేది ఈనాటి పాలకులు గుర్తురుగాలి.



-మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

## ఆందోళనల వెనుక

# ప్రజాహితమా? రాజకీయ వ్యూహమా?

**కాక్రోచ్ జంతా పార్టీ పోరాటం..
మోదీ సర్కార్‌కు సవాలా?
ప్రపంచ రాజకీయ కుట్రకు
తెరతీస్తుందా?**



**ప్రజాస్వామ్యంలో నిరసన హక్కు ఎంత ముఖ్యమో.. ఆ నిరసన వెనుక ఉన్న వాస్తవాలను తెలుసుకోవడం కూడా అంతే ముఖ్యం! దేశ రాజకీయాల్లో మరోసారి ఆందోళనల వేడి పెరిగింది. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుంటూ కాక్రోచ్ జంతా పార్టీ, కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష శక్తులు నిరసనల బాట పట్టాయి. ముఖ్యంగా ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ, ఓటు హక్కుల పరిరక్షణ, ఎన్నికల సంఘం పనితీరు వంటి అంశాలు రాజకీయ దుమారానికి కారణమవుతున్నాయి. అక్టోబర్ 2026లో ఢిల్లీలో నిరసనలు మరింత ఉధృతమయ్యాయి. ఈ పరిణామాలు దేశ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరతీశాయి. అయితే అసలు ప్రశ్న ఒక్కటే.. ఇది ప్రజల హక్కుల కోసం జరుగుతున్న నిజమైన పోరాటమా? అధికారాన్ని ఇబ్బందుల్లోకి నెట్టేందుకు సాగుతున్న రాజకీయ వ్యూహమా? లేక దీని వెనుక అంతర్జాతీయ రాజకీయ ప్రయోజనాలున్నాయా? ఈ ప్రశ్నలకు సమాధానం భావోద్వేగాల్లో కాదు వాస్తవాలు, ఆధారాలు, ప్రజల అనుభవాల్లో వెతకాలి.**

ప్రజల ఓటు.. రాజకీయ పార్టీలకు ఆటబొమ్మ కాదు! ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు ప్రాణం. ఒక పేదవాడి ఓటుకైనా, ఒక సంపన్నుడి ఓటుకైనా సమాన విలువే ఉంటుంది. ఓటర్ల జాబితాలో అర్హులైన వారి పేర్లు తొలగిపోయినా, అర్హత లేని పేర్లు కొనసాగినా అది ఎన్నికల వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. ప్రస్తుతం ప్రక్రియపై ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న ప్రధాన అభ్యంతరం ఇదే. అర్హులైన ఓటర్లు అనవసరమైన పత్రాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, కొందరి పేర్లు తొలగిపోయే ప్రమాదం ఉందని విమర్శిస్తున్నాయి. మరోవైపు, మరణించినవారు, వేరే ప్రాంతాలకు వెళ్లిపోయినవారు, ఒకటికంటే ఎక్కువ చోట్ల నమోదైనవారి పేర్లను సరిచేయడం అవసరమని ఎన్నికల సంఘం వాదిస్తోంది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే.. ఓటర్ల జాబితాలను సరిచేయడం తప్పు కాదు. కానీ ఆ ప్రక్రియలో ఒక్క అర్హుడి ఓటు హక్కు కూడా అన్యాయంగా కోల్పోకుండా చూడటం అత్యంత ముఖ్యం. ఓటర్ల జాబితా శుద్ధి పేరుతో అర్హులైన వారి ఓట్లు పోకూడదు. ఓటు హక్కు పరిరక్షణ పేరుతో తప్పులను సరిచేసే ప్రయత్నాలను కూడా అడ్డుకోకూ డదు. ఈ రెండింటి మధ్య సమతుల్యతే ప్రజాస్వామ్యా నికి అసలైన పరీక్ష.

**కాక్రోచ్ జంతా పార్టీ పోరాటం..
ఎంతవరకు ప్రభావవంతం?**

యువతలోని అసంతృప్తిని రాజకీయ ఉద్యమంగా మార్చుకునే ప్రయత్నమే కాక్రోచ్ జంతా పార్టీ ఉద్యమంలో కనిపిస్తోంది. ఉద్యోగాలు, పరీక్షల్లో అక్రమాల ఆరోపణలు, ప్రభుత్వ వ్యవస్థల జవాబుదారీతనం, ఇప్పుడు ఓటు హక్కుల అంశం.. ఇలా ప్రజలకు నేరుగా సంబంధం ఉన్న సమస్యలపై ఈ ఉద్యమం దృష్టి సారించింది. ఈ ఉద్యమానికి సంబంధించిన గత నిరసనలు విద్యాశాఖలో పరీక్షల వివాదంపై కూడా ఒత్తిడి పెంచాయి. ఇప్పుడు ఎన్నికల సంఘం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతూ ప్రతిపక్షాలతో కలిసి నిరసనలు సాగించడం రాజకీయంగా మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఇక్కడ ఒక సందేహం సహజంగా వస్తుంది. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడటమే లక్ష్యమైతే, ఆ పోరాటం ఫలితంగా ప్రజలకు ఏం లభించింది? నిరుద్యోగికి ఉద్యోగం వచ్చిందా? పరీక్షల్లో అక్రమాలపై పారదర్శక చర్యలు జరిగాయా? ఓటర్ల జాబితాలో తప్పులు సరిచేయబడ్డాయా? ఈ ప్రశ్నలకు సమాధానాలు ఉద్యమం సాధించిన విజయాలను కొలిచే అసలైన ప్రమాణాలు. నినాదాలు జనాన్ని ఆకర్షించవచ్చు. ర్యాలీలు వార్తల్లో నిలవవచ్చు. కానీ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురాగలిగినప్పుడే ఒక ఉద్యమం తన విశ్వసనీయతను నిరూపించుకుంటుంది.

**మోదీ సర్కార్‌కు నిజంగా నష్టం జరుగుతుందా?**

రాజకీయంగా చూస్తే.. కచ్చితంగా ఈ తరహా ఆందోళనలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచగలవు. ముఖ్యంగా యువత, నిరుద్యోగులు, మధ్యతరగతి ప్రజల్లో అసంతృప్తి పెరిగితే అది భవిష్యత్తులో ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. కానీ నిరసనలు పెరిగాయని మాత్రమే ప్రభుత్వం పడిపోతుందని చెప్పలేం. అలాగే ఆందోళనలను పట్టించుకోనంత మాత్రాన ప్రభుత్వం రాజకీయంగా సురక్షితంగా ఉంటుందని కూడా భావించలేం. ప్రజలు ప్రభుత్వాన్ని అంచనా వేసేది అనేక అంశాల ఆధారంగా ఉంటుంది. అభివృద్ధి, ఉద్యోగాలు, ధరలు, సంక్షేమ పథకాలు, జాతీయ భద్రత, నాయకత్వంపై విశ్వాసం, స్థానిక సమస్యల పరిష్కారం.. ఇవన్నీ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తాయి. ఈ ఉద్యమం మోదీ ప్రభుత్వానికి రాజకీయంగా నష్టం కలిగిస్తుందా లేదా అన్నది ప్రధానంగా మూడు అంశాలపై ఆధారపడి ఉంటుంది. మొదటిది.. నిరసనకారులు చేస్తున్న ఆరోపణలకు బలమైన ఆధారాలు ఉన్నాయా? రెండోది.. ఉద్యమం ప్రజల దైనందిన సమస్యలతో ఎంతవరకు ముడిపడి ఉంది? మూడోది.. ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ఓట్లుగా మార్చుకునే రాజకీయ సామర్థ్యం ప్రతిపక్షాలకు ఉందా? ప్రభుత్వం ఆరోపణలకు స్పష్టమైన సమాధా నాలు ఇవ్వలేకపోతే ప్రతిపక్షాలకు రాజకీయ అవకాశం లభిస్తుంది. మరోవైపు, ఆరోపణలు నిరాధారమని తేలితే ఉద్యమ విశ్వసనీయత దెబ్బతినవచ్చు.

**ప్రపంచ రాజకీయ కుట్ర కోణం ఉందా?**

ఇది అత్యంత సున్నితమైన ప్రశ్న. ప్రపంచ రాజకీయాల్లో వివిధ దేశాలు తమ వ్యూహాత్మక ప్రయోజనాలను కాపాడుకోవడానికి ప్రయత్నించడం కొత్త విషయం కాదు. కొన్ని సందర్భాల్లో విదేశీ శక్తులు ఇతర దేశాల్లోని రాజకీయ విభేదాలను తమ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడానికి ప్రయత్నించవచ్చు. అందుకే విదేశీ జోక్యం, రహస్య నిధులు, డిజిటల్ ప్రచారాలపై అప్రమత్తంగా ఉండటం అవసరమే. కానీ ఒక దేశంలో నిరసనలు జరుగుతున్నాయనే కారణంతోనే వాటి వెనుక విదేశీ కుట్ర ఉందని తేల్చడం సరైన పద్ధతి కాదు.

-ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9440287170



## దుర్గామాత మడపం వద్ద కుంకు మార్చన కార్యక్రమం

**మంచాల వెలుతురు అక్టోబర్ 15:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేణుగోపాల స్వామి భజన మండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గ మాత మండపం వద్ద కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు ఈకార్యక్ర మంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొని కుంకుమార్చన ప్ర త్యేక పూజలు చేశారు అనంతరం వేణుగోపాల భజన మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్ర మం నిర్వహించారు ఈకార్యక్రమంలో వేణుగోపాలస్వామి భజన మండలి దేవినవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు భజన మండలి సభ్యులు మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి రూ.1.10 లక్షల సీఎంఆర్ఎఫ్ వైద్యసాయం అందజేత



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 15:**
కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ. వివేకానంద్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి (జవీ=ఖీ) ద్వారా మంజూరైన రూ. 1,10,000 విలువైన ఎల్ఓసీని జీడిమెట్ల 132వ డివిజన్ (286), కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన జి. ఎల్లయ్య (53) కు చింతల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారకుండా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలిచి, మెరుగైన వైద్యం పొందేందుకు సహకరించడం ప్రజాసేవలో భాగమని పేర్కొన్నారు. పేద ప్రజలకు వైద్యసాయం అందేలా చొరవ తీసుకుంటున్న ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ కి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంపత్ మాధవ రెడ్డి, కుంట సిద్ధి రాములు, సమ్మయ్య నేత, కాలె నగేష్, ఆటో బలరాం, గణేష్, జయంచారి, శ్ చంద్రశేఖర్ రెడ్డి, బాలమల్లేష్, పార్టీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల ఆత్మవిశ్వాసం, స్వావలంబనకు సమాజం అండగా నిలవాలి

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- లూయిస్ బ్రెయిలీ భవన్‌లో ఘనంగా ప్రపంచ తెల్లకర్ర దినోత్సవం
- డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు





**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 15:**
ప్రపంచ తెల్లకర్ర దినోత్సవం, భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 130వ డివిజన్ పరిధిలోని సూరారంలోని లూయిస్ బ్రెయిలీ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ శ్రీ కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దృష్టిలోపం ఉన్నవారికి తెల్లకర్ర కేవలం నడకకు ఉపయోగపడే సాధనం మాత్రమే కాదని, అది వారి ఆత్మవిశ్వాసానికి, స్వతంత్రంగా జీవించే హక్కుకు ప్రతీక అని పేర్కొన్నారు. దివ్యాంగులు సమాజంలో గౌరవప్రదంగా, ఆత్మగౌరవంతో జీవించేలా ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. వారి ప్రతిభను గుర్తించి, విద్య, ఉపాధి, సామాజిక అవకాశాల్లో సమాన ప్రాధాన్యత కల్పించడం మనందరి బాధ్యత అని అన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ప్రస్తావిస్తూ.. కలాం ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ తమ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. దివ్యాంగుల సంక్షేమం, సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ వారికి అవసరమైన సహకారం అందించడం ద్వారా సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి బాటలు వేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, కొంపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, స్థానిక సీనియర్ నాయకులు వరాల వినోద్, కోలా శ్రీకాంత్, గుబ్బల లక్ష్మీనారాయణ, గట్టు అశోక్, రాజ్ కుమార్, జన్ముల ప్రభాకర్, రామ్ బాబు, బైరేష్ గౌడ్, సత్యం గౌడ్, చిన్న వెంకటస్వామి, రాజు, అనీల్, గణేష్, మటన్ మహమూద్, బద్రి, జహీర్, మరియు లూయిస్ బ్రెయిలీ భవన్ ప్రతినిధులు, నిర్వాహకులు, అంజయ్య గౌడ్, ప్రవీణ్ గౌడ్, వీర రాఘవన్, యాదయ్య యాదవ్, నరేందర్ రెడ్డి, శేఖర్ గౌడ్ మరియు స్థానిక నాయకులు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

## మన్నెగూడలో ఘనంగా ప్రారంభమైన ఝాన్సీ చిన్నపిల్లల, ఛాతీ వైద్యశాల

### చిన్నపిల్లల ఆరోగ్య సంరక్షణతో పాటు ఊపిరితిత్తుల వ్యాధులకు ప్రత్యేక వైద్య సేవలు




**రంగారెడ్డి జిల్లా, వెలుతురు అక్టోబర్ 15:**
మన్నెగూడ బస్టాండ్ పక్కన, సాగర్ రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన ఝాన్సీ చిన్నపిల్లల మరియు ఛాతీ వైద్యశాల ఘనంగా ప్రారంభమైంది. ఈ వైద్యశాల ద్వారా చిన్నపిల్లల ఆరోగ్య సంరక్షణతో పాటు ఛాతీ, ఊపిరితిత్తులకు సంబంధించిన వివిధ వ్యాధులకు ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. అనుభవజ్ఞులైన వైద్య నిపుణుల ఆధ్వర్యంలో నవజాత శిశువుల నుంచి పెద్దవారి వరకు అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సలు అందించనున్నారు.

**చిన్నపిల్లలకు ప్రత్యేక వైద్య సేవలు**

వైద్యశాలలో చిన్నపిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ ఝాన్సీ కె. సేవలు అందించనున్నారు. కిమ్స్‌లో ఉన్నత వైద్య విద్యను అభ్యసించిన ఆమెకు చిన్నపిల్లల వైద్యం, నవజాత శిశువుల సంరక్షణలో ప్రత్యేక శిక్షణ ఉంది. నవజాత శిశువుల సంరక్షణ, పిల్లల ఎదుగుదల పర్యవేక్షణ, ఆరోగ్య పరీక్షలు, టీకాలు, జ్వరం, దగ్గు, జలుబు, ఉబ్బసం, టైఫాయిడ్, డెంగ్యూ వంటి వ్యాధులకు చికిత్స అందిస్తారు. తల్లిపాలపై సలహాలు, పిల్లల్లో ఏకాగ్రత లోపం, రక్త సంబంధిత వ్యాధులకు సంబంధించిన వైద్య సేవలు కూడా అందుబాటులో ఉంటాయి.

**ఛాతీ, ఊపిరితిత్తుల వ్యాధులకు ప్రత్యేక చికిత్స**

ఛాతీ, ఊపిరితిత్తుల వ్యాధులు, అత్యవసర వైద్య సేవల నిపుణుడు డాక్టర్ విజేందర్ ఎం. వైద్య సేవలు అందించనున్నారు. గాంధీ వైద్య కళాశాలలో వైద్య విద్యను అభ్యసించిన ఆయన, జాతీయ శ్వాసకోశ వ్యాధుల సంస్థలో ఛాతీ వైద్యంలో ఉన్నత శిక్షణ పొందారు. ఉబ్బసం, దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులు, శ్వాసనాళాల వాపు, క్షయ, న్యూమోనియా, గురక, నిద్రలో శ్వాస సమస్యలు, ఛాతీలో నీరు చేరడం వంటి సమస్యలకు చికిత్స అందిస్తారు. ఊపిరితిత్తుల మధ్య కణజాల వ్యాధులు, ఊపిరితిత్తుల క్యాన్సర్ నిర్ధారణతో పాటు శ్వాసనాళాల అంతర్గత పరీక్షలు, ఛాతీ అంతర్గత పరీక్షలు, ఊపిరితిత్తుల పనితీరు పరీక్షలు వంటి ప్రత్యేక వైద్య సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి.

**ప్రారంభోత్సవానికి ప్రముఖుల హాజరు**

ఈ వైద్యశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి రవీందర్ నాయక్, బంజారా గాంధీ సంజీవ్ నాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు, స్థానిక మాజీ కార్పొరేటర్, పాండు నాయక్, మ్యరజ్యోతు హనుమంతు నాయక్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ గిరిజన నాయకులు, ఎన్. బాలు నాయక్, పట్టణ యువజన అధ్యక్షులు, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నూతన వైద్యశాల అందుబాటులోకి రావడంతో మన్నెగూడ పరిసర ప్రాంతాల ప్రజలకు చిన్నపిల్లల వైద్యం, ఛాతీ మరియు ఊపిరితిత్తుల వ్యాధుల చికిత్సకు మరింత సౌకర్యం కలగనుంది.



## ఆరుట్లలో భార్గవి ఎంబ్రాయిడరీ వర్క్ షాప్‌ను సందర్శించిన సర్పంచ్ మానిపాటి శోభాకుమార్

**మంచాల వెలుతురు అక్టోబర్ 15:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో నూతనంగా ప్రారంభించిన భార్గవి కంప్యూటర్ ఎంబ్రా యిడింగ్ వర్క్ షాప్ కు విచ్చేసి సందర్శించిన ఆరుట్ల గ్రామ సర్పంచ్ మానుపాటి శోభా కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంబ్రాయిడరీ వర్క్ షాప్ నిర్వాహకులు చెన్నమోనిభార్గవి శంకర్ ముదిరాజ్ గ్రామంలో స్వయం ఉపాధిగా మహిళలు అందరూ అభివృద్ధి చెందాలని అదేవిధం గా ఇలాంటి స్వయం ఉపాధి కేంద్రాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామంలోని మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది ఈవ్యాపార రంగంలో చెన్నమోని భార్గవి శంకర్ మరింత అ భివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తు వారికి అభినందనలు తెలియజేయడం జరి గింది. అదేవిధంగా సర్పంచ్ శోభ కుమార్ గారిని కంప్యూటర్ ఎంబ్రాయిడింగ్ వర్క్ షాప్ ప్రోపరేటర్ భార్గవి శంకర్ సర్పంచ్ గారిని శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో భార్గవి శంకర్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# ఇబ్రహీంపట్నంలో అంబరాన్నంటిన బతుకమ్మ మహాసంబురాలు

- మల్‌రెడ్డి యువశక్తి ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు
- మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మల్‌రెడ్డి స్నేహ అభిషేక్





**ఇబ్రహీంపట్నం వెలుతురు అక్టోబర్ 15:**
ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ అంబేద్కర్ చౌరస్తాలోతెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్ర తీకగా నిలిచే బతుకమ్మ పండుగ వైభవం బుధవారం రాత్రి అబరాన్నంటిందిమల్‌రెడ్డి యువశక్తి నేతృత్వంలో నిర్వహించిన బతుకమ్మ మహాసంబురాలు క న్నులపండువగా సాగాయి. రంగు రంగుల పూలతో పేర్చిన బతుక మ్మలుమహిళలఉత్సాహభరితమైన ఆటపాటలు ఉయ్యాలపా టలు కోలాటాలతో అంబేద్కర్ చౌరస్తా పూలవనాన్ని తలపించింది తెలంగాణ ఆడబిడ్డలఆత్మీ యతకు ప్రకృతితో ముడిపడిన మన సంస్కృతికి అద్దంపట్టేలా ఈ వేడుకలు సాగాయి ఈమహా సంబురాలకు గౌరవ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మల్‌రెడ్డి యువశక్తి కన్వీనర్ మల్‌రెడ్డి స్నేహ అభిషేక్ రెడ్డి కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు పారిజాతానర్సింహారెడ్డి హాజరై వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు ఇబ్రహీంపట్నంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలోమ హిళలు తరలివచ్చి తమ సృజనాత్మకతను ప్రతిబింబించేలా అందమైన బతుకమ్మలను పేర్చితీ సుకువచ్చారు తంగేడు గునుగు తదితర రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు ప్రాంగణమంతా పండుగ శోభను నింపాయిఉయ్యాల పాటలు కోలాటాలతో హోరెత్తిన వేడుక లు సింగర్ భవానీ నల్గొండ గద్దర్ నర్సిరెడ్డి నేతృత్వంలో సాగిన ఉయ్యాల పాటలు మహిళల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేశాయి త రతరాలుగా తెలంగాణ పల్లెల్లో ప్రతిధ్వనిస్తున్న బతుకమ్మ పా టలు మరోసారి ఆడబిడ్డల గొంతుల్లో సజీవమయ్యాయిపాటల తాళానికి అనుగుణంగామహిళ లు బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు సంప్రదాయ కోలాటాలు జానపద గీతాలతో ప్రాంగణమంతా పండుగ సంద డితో మార్మోగిందిఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మల్‌రెడ్డి స్నేహ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు ప్రజాప్రతినిధులు మహిళలతో మమేకమై పండుగ సంబరాలను పంచుకోవడంతో అక్కడి వాతావరణం మరింత ఆహ్లాదకరంగా మారింది మహిళల ఆనందోత్సాహాలు బతుకమ్మ పాటల సందడి పూల సోయ గాలు కలిసి ఇబ్రహీంపట్నంలో పండుగ వైభవాన్ని చాటిచెప్పాయి విజేతలకు నగదు బహుమ తులు పాల్గొన్న మహిళలందరికి ప్రోత్సాహకాలుబ తుకమ్మ వేడుకల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు సం ప్రదాయానికి ప్రతీకగానిలిచే బతుకమ్మలను అందంగా పేర్చి తీసుకువచ్చిన మహిళలను ప్రోత్స హిస్తూ విజేతలను ప్రకటించారు మొదటి బహుమతి రూ. 25000 మంచాల మండలానికి చెంది న జయమ్మ, యాచారం మండలం తాడిపర్తికి చెందిన మంజుల గెలుచుకున్నారు రెండో బహు మతి రూ15,000 ఇబ్రహీంపట్నంకు చెందిన హంసమ్మకు లభించింది మూడో బహుమతి రూ 10,000 ఇబ్రహీంపట్నంకు చెందిన లావణ్య గెలుచుకున్నారుపోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహం కింద బహుమతులు అందజేసి వారిని అభినందించారు బతుకమ్మ పండుగను కేవ లం పోటీగా కాకుండా మహిళల ఐక్యతకు సంప్రదాయా ల పరిరక్షణకు పరస్పర ఆత్మీయ తకు వేదికగా నిలిపే ప్రయత్నం ఈ కార్యక్రమంలో కనిపించింది ఈకార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ని యోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నా యకులు తదితరులు పాల్గొన్నారు

## సాయి నగర్ ఆలయ పరిధిలో రూ. 20 లక్షల సీసీ రోడ్డు ప్రారంభం



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 15:**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి ప్రగతి నగర్ 276వ డివిజన్ పరిధిలోని సాయి నగర్ ఆలయ ప్రాంతంలో జవీజ నిధులతో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డును కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిలుగా పాల్గొని ప్రారంభించారు. కాలనీ అభివృద్ధిలో భాగంగా జవీజ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతూ, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ, జవీజ నిధులతో కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. అనంతరం భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. దేశ యువతకు స్ఫూర్తిగా నిలిచిన కలాం గారి సేవలను, దేశాభివృద్ధికి ఆయన అందించిన కృషిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి (తాతిరెడ్డి), మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, 277వ డివిజన్ అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆలేటి శ్రీనివాస్, గజ్జెల కాంతం, కూతురు నిర్మల, ప్రవీణ్ (లడ్డు), మల్లికార్జున్,నవీన్ రెడ్డి, వీరబాబు, సురేందర్ యాదవ్,పిల్లి, సునీల్ ఆంజనేయులు, మురళి తదితరులు పాల్గొన్నారు.

## డా. ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణ



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 15:**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బండారి లేఔట్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప వద్ద భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరైన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి డా. ఏపీజే అబ్దుల్ కలాం గారి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలాం దేశానికి అందించిన సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. ఆయన జీవితం, ఆశయాలు యువతకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, బండారి లేఔట్ డివిజన్ అధ్యక్షులు వాసు వరగాని, ప్రగతి నగర్ డివిజన్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి (తాతిరెడ్డి), మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, కె. అమృతయ్య, కమిటీ నిర్వాహకులు మొయినుద్దీన్, రఫత్, రామచంద్ర నాయక్, సరిత లక్ష్మణ్, ప్రభాకర్ రెడ్డి, అబ్దుల్లా, నయాబ్, బాలరాజు, ప్రసాద్ గౌడ్, వెంకటేశ్వర్ గౌడ్, శ్యామ్ గౌడ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## దత్తాత్రేయ కాలనీలో వైభవంగా దేవీ నవరాత్రి పల్లకి ఊరేగింపు

### అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు జిల్లా గణేష్ నేత..

**కూకట్ పల్లి అక్టోబర్ 15 వెలుతురు:**
శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ కాలనీలో టీం దేవీ నవరాత్రి ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నిర్వాహకుల ఆహ్వానం మేరకు కాంగ్రెస్ నాయకుడు జిల్లా గణేష్ నేత ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన పల్లకి ఊరేగింపు కార్యక్రమం అంగరంగ వైభవంగా సాగింది. ఈ సందర్భంగా జిల్లా గణేష్ నేత మాట్లాడుతూ.. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వివిధ దుర్గామాత మండపాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. పల్లకి ఊరేగింపులో కాలనీవాసులు, మహిళలు, పెద్దలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొనడం సనాతన ధర్మ సంప్రదాయాల పట్ల ప్రజలకు ఉన్న భక్తి, విశ్వాసాలకు నిదర్శనమని పేర్కొన్నారు. భక్తిభావంతో అమ్మవారి ఉత్సవాలను నిర్వహిస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పుతున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. అమ్మవారి దర్శనానికి తనను ఆహ్వానించిన కాలనీ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నాగభూషణం, యాదగిరి, వీరేశం, అరుణ్, వికాస్, రాజు, రవి, సాయి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే అరికెపూడి జన్మదిన వేడుకలు



**కూకట్ పల్లి అక్టోబర్ 15 వెలుతురు**
: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి ఎమ్మెల్యే గాంధీని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పురంధర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారని కొనియాడారు. రాత్రింబవళ్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ప్రజలతో కలిసిమెలిసి ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తున్న ఎమ్మెల్యేకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరిన్ని సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు జి. నర్సింగరావు, సూర్యనారాయణ, ఉత్తమ్ చౌదరి, వాసుదేవ్, కోఆపరేటివ్ చైర్మన్ రామారావు, లక్ష్మీనారాయణ, గ్రానైట్ సూర్యనారాయణ, నాని తదితరులు పాల్గొని ఎమ్మెల్యేకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# బిఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం



## మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి.

**మునుగోడు,అక్టోబర్ 15 (వెలుతురు):**
వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈసారి బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని, ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కదనరంగంలోకి దిగాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ఓటరు నమోదు సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు గత ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో చేజారిన విజయాన్ని ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోవద్దని, ప్రతి పట్టభద్రుడిని కలిసి ఓటు నమోదు నుంచి పోలింగ్ వరకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. రాకేష్‌రెడ్డి గెలుపు తెలంగాణలో బీఆర్ఎస్ పునరాగమనానికి నాంది కావాలని ఆయన ఆకాంక్షించారు. అభ్యర్థి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ తన విజయాన్ని కేసీఆర్ విజయం గా భావించి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మునుగోడు మండల పార్టీ అధ్యక్షులు మందుల సత్యం,సీనియర్ నాయకులు మునగాల నారాయణ రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ గుర్రం వెంకట్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి పగిళ్ల సతీష్,సంయుక్త కార్యదర్శి మాదనబోయిన పరమేష్ యాదవ్, మాజీ జెడ్పిటిసిలు కర్నాటి వెంకటేశం, పెద్దింటి బుచ్చిరెడ్డి, నారాయణపురం మండలం అధ్యక్షుడు నర్రి నరసింహ, నాయకులు పూల వెంకటేశం,బొమ్మర బోయిన వెంకన్న, కొత్తపాటి సతీష్,దోటీ కరుణాకర్, నలపరాజు రమేష్, ఈద శరత్ బాబు బండారు శ్రీనివాస్, బోయ లింగస్వామి, సురగి రవి,వివిధ మండలాల మండల అధ్యక్షులు, నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# ప్రజా సంక్షేమమే ధ్యేయం..

## పిఆర్‌కె పార్టీ అధినేత ప్రవీణ్ కుమార్



**యాదగిరిగుట్ట , అక్టోబర్ 15 వెలుతురు**
ప్రజా సంక్షేమమే ప్రజలకు నిరంతరం సేవలు అందించడమే ధ్యేయంగా పి ఆర్ కె పార్టీ పనిచేస్తుందని ఆ పార్టీ అధినేత ప్రవీణ్ కుమార్ అన్నారు గురువారం యాదగిరిగుట్టలో ఆ పార్టీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు అంతకుముందు యాదగిరిగుట్టలో ఆ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పి ఆర్ కె పార్టీ ప్రజల కోసం పుట్టిన పార్టీ అని అన్నారు. గత 2018 నుంచి మా సేవలు ప్రజలందరికీ తెలిసినవే" సెప్టెంబర్ 6వ తేదీన హైదరాబాద్‌లో భారీ పాదయాత్రతో అధికారికంగా 'పి. ఆర్. కే.' (ప్రోగ్రెసివ్ రిఫార్మ్ నాలెడ్జ్) రాజకీయ పార్టీని లాంచ్ చేసినట్లు ఆయన ప్రకటించారు. తొమ్మిదేళ్లుగా ఎలాంటి స్వార్థం లేకుండా, తన తల్లిదండ్రుల స్మరణార్థం అందిస్తున్న సేవా కార్యక్రమాలను ఇకపై మరింత విస్తృత స్థాయిలోకి తీసుకెళ్లేందుకే రాజకీయాల్లోకి వచ్చానని ఆయన వెల్లడించారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వేలాది మందికి గత తొమ్మిది సంవత్సరాలుగా 'అన్నం కార్డ్స్' అందిస్తున్నారు. కందిపల్లి, ఈసీఐఎల్, అమీన్‌పూర్, అంబర్‌పేట్, సంగారెడ్డి తదితర ప్రాంతాల్లో ప్రతి నెలా 10వ తేదీన నిరుపేదలకు బియ్యం, పిండి, రవ్వ, చక్కర వంటి నిత్యావసర సస్తువులతో పాటు వారి వైద్య ఖర్చులను కూడా స్వయంగా భరిస్తున్నారు. హాస్పిటల్స్‌కు వెళ్లే పేదలకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో 'పి. ఆర్. కే. హెల్త్ కార్డ్స్ విడుదల చేశారు. అంబర్‌పేట్, అమీన్‌పూర్, సంగారెడ్డి నియోజకవర్గాల్లో మహేశ్వరం మెడికల్ కాలేజీ సహకారంతో సుమారు 50 మంది వైద్యులను రప్పించి, 1,800 మందికి పైగా మెగా వైద్య శిబిరాల ద్వారా ఉచిత వైద్యం అందించారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆడపిల్లల పెళ్లిళ్లు చేయలేకపోతున్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచారు. కులమతాలకు అతీతంగా హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాలకు చెందిన ఎంతోమంది నిరుపేద యువతుల వివాహాలకు ఆర్థిక సహాయం అందజేశారు. ఇప్పటివరకు సుమారు 3,700 మందికి పైగా ప్రత్యక్షంగా ఆపద్బాంధవుడిగా నిలిచారు. వ్యక్తిగతంగా ఎంత సేవా కార్యక్రమాలు చేసినప్పటికీ, వాటికి కొన్ని ఆర్థిక, వ్యవస్థాపక పరిమితులు ఉంటాయని ప్రవీణ్ కుమార్ అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా లేదా రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది మందికి సేవలు అందించాలంటే ప్రభుత్వ అధికారం లేదా ఒక రాజకీయ శక్తి అవసరమని ప్రజల నుంచి వచ్చిన సూచన మేరకే పార్టీని స్థాపించినట్లు తెలిపారు. మీ కోసం పుట్టిన మీ పార్టీ అని ఆయన స్పష్టం చేశారు.

అన్ని జిల్లాల నుంచి అనుమతులు పొందిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యకలాపాలను విస్తరిస్తామన్నారు. రాష్ట్రంలో మంచి నైపుణ్యం ఉండి కూడా రాజకీయాలకు దూరంగా ఉంటున్న యువత, మహిళలు, ప్రతిభావంతులు ఎవరైనా సరే తమ పార్టీ ద్వారా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పి. ఆర్. కే. పార్టీ ప్రవీణ్ కుమార్ (పి. ఆర్. కే.) గత తొమ్మిదేళ్లుగా ఏ విధంగా అయితే తమ సేవా కార్యక్రమాలను ఆదరించి సహకరించారో, అదే విధంగా ఈ రాజకీయ ప్రయాణంలోనూ ప్రజలందరి సంపూర్ణ సహకారం అందించాలని ఆయన కోరారు.

# అనుమతులు నిల్.. భారీ షెడ్డు నిర్మాణం ఫుల్!

- వివేకానంద నగర్ సప్తగిరి కాలనీలో అక్రమ నిర్మాణం?
- పలుమార్లు వార్తలు ప్రచురించినా పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు!
- హైడ్రా, సీఎంసీ అధికారులు వెంటనే స్పందించాలి.. నిర్మాణంపై సమగ్ర విచారణ జరపాలి!





**కూకట్ పల్లి, అక్టోబర్ 15 వెలుతురు:**
నిబంధనలు బేఖాతరు.. భారీ నిర్మాణాలు యథేచ్ఛ.. అధికారుల స్పందన మాత్రం శూన్యం! కూకట్‌పల్లి పరిధిలోని వివేకానంద నగర్ డివిజన్ సప్తగిరి కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండానే భారీ షెడ్డు నిర్మాణం చేపడుతున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ఈ నిర్మాణంపై పలుమార్లు వార్తా కథనాలు ప్రచురించినప్పటికీ సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం ఎందుకు మౌనం వహిస్తోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### వార్తలు ప్రచురించినా చలనం లేదా?



సప్తగిరి కాలనీలో నిర్మిస్తున్న భారీ షెడ్డు వ్యవహారంపై పలుమార్లు వార్తలు వెలువడినప్పటికీ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నిర్మాణ అనుమతులపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది. నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా? భవన నిర్మాణ నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలపై అధికారికంగా విచారణ జరగాల్సిన అవసరం ఉంది. అయినప్పటికీ ఇప్పటివరకు తగిన చర్యలు కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### టౌన్‌ప్లానింగ్ అధికారుల బాధ్యత ఏమైంది?

నిర్మాణ అనుమతులను పరిశీలించడం, నిబంధనల ఉల్లంఘనలను గుర్తించడం, అక్రమాలు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవడం సంబంధిత అధికారుల బాధ్యత. నిర్మాణ పనులు పూర్తయ్యాక స్పందించడం కంటే, పనులు కొనసాగుతున్న సమయంలోనే తనిఖీలు నిర్వహించి వాస్తవాలను నిర్ధారించాల్సిన అవసరం ఉంది. పలుమార్లు వార్తలు వచ్చినా స్పందన లేకపోవడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

### హైడ్రా, సీఎంసీ అధికారులు వెంటనే స్పందించాలి!

సప్తగిరి కాలనీలో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న భారీ షెడ్డు నిర్మాణంపై హైడ్రా, సీఎంసీ (కూకట్‌పల్లి పరిధి సంబంధిత మున్సిపల్) అధికారులు తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో సమగ్ర తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, స్థల స్వరూపం, వర్తించే నిబంధనలను పరిశీలించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. హైడ్రా పరిధిలోకి వచ్చే ఆక్రమణలు లేదా సంబంధిత ఉల్లంఘనలు ఉన్నట్లయితే వాటిపై కూడా పరిశీలన జరపాలని కోరుతున్నారు.

### ఉన్నతాధికారుల జోక్యం అనివార్యం!

అనుమతులపై స్పష్టత లేకుండా భారీ నిర్మాణం కొనసాగుతోందనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి. ఫిర్యాదులు, వార్తా కథనాలను నిర్లక్ష్యం చేయకుండా క్షేత్రస్థాయి విచారణ చేపట్టి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలి. పలుమార్లు వార్తలు వచ్చినా స్పందన లేకపోవడం.. నిర్మాణ అనుమతులపై స్పష్టత రాకపోవడం.. అధికారుల చర్యలు కనిపించకపోవడం ప్రజల్లో అనేక సందేహాలకు తావిస్తోంది. సప్తగిరి కాలనీలోని భారీ షెడ్డు నిర్మాణంపై హైడ్రా, సీఎంసీ అధికారులు ఇప్పటికైనా స్పందిస్తారా? నిబంధనల ఉల్లంఘనలు ఉంటే అడ్డుకుంటారా? లేక నిర్మాణం పూర్తయ్యే వరకు వేచి చూస్తారా? అన్నది ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.




# సంతలో ఎవరైనా కొనుగోళ్లు, అమ్మకాలు చేసుకోవచ్చు

## సర్పంచ్ పాలకూరి రమాదేవి.



**మునుగోడు,అక్టోబర్ 15(వెలుతురు ):**
మునుగోడు వారపు సంతలో ఏ గ్రామానికి చెందిన వారైనా కొనుగోళ్లు,అమ్మకాలు చేసుకోవచ్చని సర్పంచ్ పాలకూరి రమాదేవి తెలిపారు. ప్రతి గురువారం నిర్వహించే సంతలో వ్యాపారులు గ్రామ పంచాయతీ కేటాయించిన స్థలంలోనే వ్యాపారాలు నిర్వహించాలని సూచించారు. గ్రామ పంచాయతీ నిబంధనల ప్రకారం సంతకు వేలంపాట నిర్వహించినట్లు పేర్కొన్నారు. సంతలో వ్యాపారాలు నిర్వహించే వారు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని,వాటిని ఉల్లంఘిస్తే గ్రామ పంచాయతీ చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని సర్పంచ్ హెచ్చరించారు.

# బీజేపీ లేబర్ సెల్ బలోపేతానికి మండలాల వారీగా కన్వీనర్ల నియామకం

**మునుగోడు,అక్టోబర్ 15 (వెలుతురు):**
భారతీయ జనతా పార్టీ కార్మిక విభాగం (లేబర్ సెల్)ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా మునుగోడు నియోజకవర్గంలోని వివిధ మండలాలకు కన్వీనర్లను నియమించినట్లు లేబర్ సెల్ జిల్లా కో-కన్వీనర్ మాధగోని నరేందర్ గౌడ్ తెలిపారు. బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి సూచన మేరకు, లేబర్ సెల్ రాష్ట్ర కన్వీనర్ అందె శ్రీనివాస్ ఆదేశాలతో, జిల్లా అధ్యక్షుడు వర్షత్‌రెడ్డి, లేబర్ సెల్ జిల్లా కన్వీనర్ ఐతరాజు సిద్ధు అనుమతితో ఈ నియామకాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. మునుగోడు పోలే వెంకటేశ్వర్లు, నారాయణపురం వంటల మల్లేష్ యాదవ్,గట్టుప్పల్ పగిళ్ల శంకర్, మర్రిగూడ పంగ యాదయ్య,నాంపల్లి మేకల శ్రీకాంత్, చండూరు టౌన్ చెనగోని శేఖర్, చండూరు రూరల్ ఉంగరాల దిలీప్, చౌటుప్పల్ టౌన్ కొండాపురం దుర్గయ్య, చౌటుప్పల్ రూరల్ నందగిరి రమేష్ లను నియమించినట్లు తెలిపారు.

# విద్యుత్ ఉత్పత్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం



రాష్ట్రంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ విమర్శించారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా విషయంలో ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించడంలో విఫలమైందని ఆరోపించారు. గురువారం సాయంత్రం హాలియాలోని తన నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

### యాదాద్రి థర్మల్ ప్లాంట్‌పై విమర్శలు

దామరచర్లలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 4,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 400 మెగావాట్ల విద్యుత్ కూడా ఉత్పత్తి చేయలేక పోతున్నారని నోముల భగత్ ఆరోపించారు. ప్లాంట్‌లో బొగ్గు కొరతకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన రూ. 60 వేల కోట్ల బకాయిలు చెల్లించకపోవడం వల్లే ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆరోపించారు.

### కేసీఆర్ హయాంలో విద్యుత్ సామర్థ్యం పెరిగింది

2014లో కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో రాష్ట్రంలో 7,778 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉండేదని నోముల భగత్ తెలిపారు. కేసీఆర్ పదవీకాలం ముగిసే నాటికి విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 24 వేల మెగావాట్లకు పెంచినట్లు పేర్కొన్నారు.

### కరెంటు కోతలతో రైతులకు ఇబ్బందులు

రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడుతున ్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమైందని నోముల భగత్ విమర్శించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతుల పంటలు ఎండిపోతున్నా వ్యవసాయానికి ఐదు గంటల విద్యుత్ కూడా అందించలేక పోతున్నారని ఆరోపించారు. రైతుల పంటలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు దరఖాస్తు చేసుకోండి

వచ్చే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన గ్రాడ్యుయేట్లు దరఖాస్తు చేసుకోవాలని నోముల భగత్ కోరారు. ఈ సమావేశంలో మాజీ ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రామచందర్ నాయక్, బాబురావు నాయక్, రిక్కల ఇంద్రసేనారెడ్డి, కూరాకుల వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

# తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి




సూర్యాపేట: రానున్న రోజుల్లో జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాఖల వారీగా పక్కా ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో భూగర్భ జలాలు, తాగునీటి సరఫరా, రెవెన్యూ రీ-సర్వే, భూభారతి పెండింగ్ దరఖాస్తులపై అధికారులతో సమీక్షించారు.

### భూగర్భ జలాల తగ్గుదలపై ఆందోళన

వర్షాకాలం ముగియకముందే కొన్ని మండలాల్లో భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోవడంపై కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. నేరేడుచర్ల, నూతనకల్, ఆత్మకూర్ (ఎస్), మద్దిరాల మండలాల్లో భూగర్భ జలాల పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. అనంతగిరి, తుంగతుర్తి, మేళ్లచెర్వు మండలాల్లో పరిస్థితి సాధారణంగా ఉన్నప్పటికీ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సూర్యాపేట, చివ్వెంల, మునగాల, గరిడేపల్లి, పెన్‌పహాడ్, మోతె, చిట్యాల, కోదాడ తదితర మండలాల్లో పొట్ట దశలో ఉన్న పంటలకు అవసరమైన నీటిని సమర్థంగా వినియోగించుకునేలా రైతులకు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు.

### తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ

జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా మండల ప్రత్యేక అధికారులు, జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ), పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి సమస్యలు ఉన్న గ్రామాలు, వార్డులను గుర్తించి నివేదికలు సమర్పించాలని సూచించారు. విద్యుత్, నీటిపారుదల, భూగర్భ జల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రాబోయే ఆగస్టు వరకు తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

### రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

జిల్లాలో రెవెన్యూ రీ-సర్వేకు ప్రాధాన్యత ఇవ్వాలని తహశీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మండలంలో రెండు రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి రీ-సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకోసం లైసెన్స్‌డ్ సర్వేయర్లు, సాంకేతిక శిక్షణ పొందిన రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులను 60 రోజుల్లోగా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జీఓ 59 కింద వచ్చిన దరఖాస్తుల ప్రక్రియను అక్టోబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని గడువు విధించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్, సీపీఓ కిషన్, మండల ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మికత తోనే మానసిక ప్రశాంతత : భువనగిరి ఎమ్మెల్యే



పోచంపల్లి: ఆధ్యాత్మికత తోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని ది పోచంపల్లి స్పిరిచువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన పిరమిడ్ ధ్యాన మందిర నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక పెద్ద చెరువు కట్టపై కట్ట మైసమ్మ తల్లి దేవాలయ పునర్నిర్మాణం మహోత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని అలవరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్, పిఎసిఎస్ చైర్మన్లు పాక మల్లేష్ యాదవ్, కళ్లెం రాఘవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు వంగూరి పాండు, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భారత లవ కుమార్, నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, గడ్డం వెంకటేష్, శెట్టి శ్రీనివాస్,చింతకుంట్ల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పది రోజులుగా తాగునీటి సరఫరా బంద్.. ఖాళీ బిందెలతో మహిళల నిరసన!

- ఎన్నికల హామీలు ఏమయ్యాయి?
- సర్పంచ్‌ను నిలదీసిన మహిళలు
- అధికారులకు ఫిర్యాదు చేసినా
- స్పందన లేదని ఆగ్రహం



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 15:** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం దిగ్వాల్ గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలలో గత పది రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజువారీ అవసరాలకు సైతం నీరు అందకపోవడంతో విసిగిపోయిన మహిళలు గురువారం ఖాళీ బిందెలతో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలకు గత పది రోజులుగా మంచినీరు సరఫరా కావడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఇప్పటికే పంచాయతీ సభ్యులకు, సంబంధిత అధికారులకు పలుమార్లు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా అధికారులు స్పందించకపోవడంపై వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నిరసన సందర్భంగా గ్రామ సర్పంచ్‌కు మహిళలు తమ సమస్యలను వివరించి, తాగునీటి సరఫరాను తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సర్పంచ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు కనీస అవసరమైన తాగునీటిని సైతం అందించలేకపోతే గ్రామ సమస్యలను ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ఇంటి అవసరాల కోసం నీటిని సమకూర్చుకోవడం కష్టంగా మారిందని మహిళలు పేర్కొన్నారు. ముఖ్యంగా రోజువారీ పనులు, ఇతర గృహ అవసరాల కోసం నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. సమస్యను వెంటనే పరిష్కరించి, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని గ్రామ ప్రజలు పంచాయతీ అధికారులను హెచ్చరించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దిగ్వాల్‌లోని ఎస్సీ, బీసీ కాలనీలకు తాగునీటి సరఫరాను పునరుద్ధరించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# జహీరాబాద్ వ్యవసాయ అధికారికి జాతీయ పురస్కారం

### రైతులకు పథకాలు చేరవేత.. ఆధునిక సాగుపై అవగాహనకు గుర్తింపు




**జహీరాబాద్ వెలుతురు అక్టోబరు 15:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల వ్యవసాయ అధికారి నీరడి లావణ్య జాతీయ స్థాయి అవార్డును అందుకున్నారు. మహిళా కిసాన్ దివస్‌ను పురస్కరించుకొని వ్యవసాయ రంగంలో విశేష సేవలందించిన వారిని ప్రోత్సహించేందుకు నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు ఈ పురస్కారం లభించింది. తెలంగాణ రాష్ట్రం తరఫున జాతీయ స్థాయిలో ఈ అవార్డుకు ఆమె ఎంపికయ్యారు.

**రైతు సంక్షేమానికి కృషి**

వ్యవసాయ శాఖలో విధులు నిర్వహిస్తున్న లావణ్య.. రైతులకు ప్రభుత్వ పథకాలను చేరవేయడంతో పాటు, ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నారు. రైతులను నూతన వ్యవసాయ విధానాల వైపు ప్రోత్సహిస్తూ, వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఈ సేవలకు గుర్తింపుగా ఆమెకు జాతీయ స్థాయి పురస్కారం లభించింది. జాతీయ వ్యవసాయ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి మహేందర్ కుమార్ ద్వివేది, అతిష్ చంద్ర చేతుల మీదుగా లావణ్య అవార్డును అందుకున్నారు. జహీరాబాద్ మండల వ్యవసాయ అధికారికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడంపై స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది.

# విగ్రహ దాత.. ఆదర్శ ప్రదాత!

- దశాబ్ద కాలంగా దుర్గామాత సేవలో అంకితభావం
- ప్రజాసేవకు ప్రాధాన్యం.. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు చేయూత
- యువతకు ఆదర్శంగా బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు మంగళపర్తి సందీప్ కుమార్



**కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 15:** రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూనే ప్రజాసేవకు పెద్దపీట వేస్తూ.. మరోవైపు ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాల్లో తనదైన ముద్ర వేస్తున్న యువ నాయకుడు మంగళపర్తి సందీప్ కుమార్. పదవులకే పరిమితం కాకుండా ప్రజలతో మమేకమవుతూ, దైవ కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కౌడిపల్లి బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడిగా, కౌడిపల్లి పదో వార్డు సభ్యుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సందీప్ కుమార్ సేవా దృక్పథం స్థానికంగా యువతకు ఆదర్శంగా నిలుస్తోంది.

**గత 8 సంవత్సరాలుగా దుర్గామాత సేవలో..**

గత ఎనిమిది సంవత్సరాలుగా దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో విగ్రహ దాతగా తన వంతు సహకారం అందిస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల తనకున్న భక్తిని చాటుకుంటున్నారు. ప్రతి ఏడాది అమ్మవారి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ముందుండటం ఆయనకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. వినాయక నవరాత్రి ఉత్సవాల్లోనూ కౌడిపల్లి పదవ వార్డులో తన సొంత నిధులతో పర్మనెంట్‌గా వినాయక మండపాన్ని ఏర్పాటు చేశారు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ భక్తి, సేవాభావాన్ని చాటుతున్నారు. పండుగలు కేవలం వేడుకలకే పరిమితం కాకుండా ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించే వేదికలుగా నిలవాలన్న భావనతో ఆయన ముందుకు సాగుతున్నారు.



**రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవే లక్ష్యం..**

రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటూనే ప్రజల సమస్యలపై స్పందించడం, సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామి కావడం సందీప్ కుమార్ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. వార్డు సభ్యుడిగా స్థానిక ప్రజలకు అందుబాటులో ఉంటూ, యువతను సామాజిక సేవ వైపు ప్రోత్సహించాలనే తపనతో ముందుకు సాగుతున్నారు. రాజకీయ బాధ్యతలు, సామాజిక సేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలను సమన్వయం చేసుకుంటూ తనదైన శైలిలో ముందుకు వెళుతున్నారు.

**యువ నాయకులకు ఆదర్శం..**

నేటి యువత రాజకీయాలతోపాటు సామాజిక కార్యక్రమాల్లోనూ భాగస్వాములు కావాలనే సందేశాన్ని తన ఆచరణ ద్వారా చాటుతున్నారు. పండుగలు, ఉత్సవాలు, సామాజిక కార్యక్రమాలకు సహకారం అందించడం ద్వారా సమాజంలో సానుకూల వాతావరణం ఏర్పడేందుకు కృషి చేస్తున్నారు. సేవ చేయాలనే సంకల్పం ఉంటే వయసుతో సంబంధం లేకుండా ప్రజల మన్ననలు పొందవచ్చని తన ప్రయాణం ద్వారా నిరూపిస్తున్నారు.

**పదవులకంటే సేవే ముఖ్యం..**

నాయకుడిగా గుర్తింపు పొందడం కంటే ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ముఖ్యమనే భావనతో సందీప్ కుమార్ ముందుకు సాగుతున్నారు. రాజకీయ రంగంలో తనదైన ముద్ర వేస్తూనే ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాల్లోనూ సేవాభావాన్ని కొనసాగిస్తున్నారు. దుర్గామాత ఉత్సవాలకు విగ్రహ దాతగా అందిస్తున్న సహకారం, వినాయక నవరాత్రుల్లో చూపుతున్న చొరవ యువతకు స్ఫూర్తినిచ్చేలా ఉన్నాయి. ప్రజాసేవ, దైవభక్తి, సామాజిక బాధ్యతలను కలగలిపిన ఆయన ప్రస్థానం మరింత ముందుకు సాగాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

**ప్రజాసేవకే అంకితం మంగళపర్తి సందీప్ కుమార్**

ప్రజా సేవతో పాటు దైవ కార్యక్రమాలలో సేవలు అందించడం తనకెంతో తృప్తినిస్తుందని అన్నారు. పేరు ప్రతిష్టల కన్నా ప్రజాసేవ మిన్న అని దేవుడిచ్చిన శక్తి మేరకు ప్రజాసేవతో పాటు దైవ కార్యక్రమాలలో పాల్గొని తన ధ్యేయం అని తెలిపారు.

# నాగలగిద్ద మండల సర్వసభ్య సమావేశం

### ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి



**వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 15:** సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ నియోజకవర్గంలో నాగలగిద్ద మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మహేష్ కుమార్ కులకర్ణి ఆధ్వర్యంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సమావేశానికి స్థానిక నారాయణఖేడ్ నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశానికి విచ్చేసిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి గారికి స్త్రీనిధి ఉమ్మడి జిల్లా డైరెక్టర్ హీనా బేగం శాలువాతో ఘనంగా సన్మానించి, పూలబొకే అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండలంలోని పలు అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ వినోద్ పటేల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విఠల్ రావు, పార్టీ సీనియర్ నాయకులు రహీమ్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, వైస్ చైర్మన్ అంజిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, తహసిల్దార్ సంగ్రామం రెడ్డి, ఎంఈఓ మన్మోద్ కిషోర్, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఈ శివాజీ, విద్యుత్ శాఖ ఏఈ మోతీరాం, ఏపీఎం నర్సింలు, మండల ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్ర ఉపసర్పంచ్‌ల ఫోరం కార్యాలయం ప్రారంభం



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 15:** హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచ్‌ల ఫోరం కార్యాలయాన్ని గురువారం రోజున రాష్ట్ర ఫోరం అధ్యక్షులు బొట్ల కార్తీక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రంలోని వివిధ గ్రామాలకు చెందిన ఉపసర్పంచ్‌లు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు పాల్గొని, రాష్ట్ర ఫోరం కార్యాలయ ప్రారంభోత్సవానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యాలయం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపసర్పంచ్‌ల ఐక్యతకు, వారి సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు మరియు గ్రామాల అభివృద్ధికి ఒక వేదికగా నిలవాలని ఆకాంక్షించారు.



## ఎల్నినో వేళ..

# సింగూర్ నీటి నిల్వలపై నజర్

### సింగూర్‌లో నీటి లెక్కలు
### అధికారులతో ఎమ్మెల్యే మాణిక్ రావు సమీక్ష



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 15:** ఎల్నినో ప్రభావంతో వర్షపాతంలో మార్పులు చోటుచేసుకునే అవకాశాల నేపథ్యంలో సింగూర్ ప్రాజెక్టు నీటి నిల్వలు, భవిష్యత్తు అవసరాలపై జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు దృష్టి సారించారు. గురువారం సంబంధిత అధికారులతో కలిసి ప్రాజెక్టును సందర్శించి ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారు. ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు, నీటి వినియోగం, రానున్న రోజుల్లో తాగునీటి అవసరాలు, రైతులకు సాగునీటి లభ్యత తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షపాతంలో అనిశ్చిత పరిస్థితులు ఏర్పడితే నీటి నిర్వహణలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా, బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని, తాగునీరు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు.

# రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమే: శేరిగూడెం సర్పంచ్ పి.ప్రభాకర్ యాదవ్



**గట్టుప్పల్ వెలుతురు అక్టోబర్ 15:** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని సర్పంచ్ పి.ప్రభాకర్ యాదవ్ అన్నారు గురువారం గట్టుప్పల మండల పరిధిలో శేరిగూడెం గ్రామంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుండి నేటి వరకు పేద ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆయన విమర్శించారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా లేని లోటు ప్రజలకు ఔపిస్తుందని అన్నారు.. వర్గాల ప్రజలందరూ కెసిఆర్ ని మళ్లీ సీఎం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.. జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంత అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అహర్నిశలు కృషి చేశారని ధీమా వ్యక్తం చేశారు

# బీసీలంతా ఐక్యమై రాజ్యాధికార సాధన కోసం సమష్టిగా పోరాడాలి

- పట్టణ రజక సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకారంలో బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్




**మిర్యాలగూడ వెలుతురు అక్టోబర్ 15:** తెలంగాణ రాష్ట్రంలోని బీసీలంతా కులాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా ఐక్యమై తమ హక్కుల సాధన కోసం సమష్టిగా పోరాడాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని బీసీ భవన్ లో జరిగిన నూతన రజక సంఘం ప్రమాణ స్వీకారం లో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో బీసీలు జనాభాలో అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ విద్య, ఉద్యోగాలు, రాజకీయాలు, ఆర్థిక రంగాల్లో ఆశించిన స్థాయిలో అవకాశాలు, ప్రాతినిధ్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల మధ్య కులాల పేరుతో విభజనలు, రాజకీయ పార్టీల పేరుతో విభేదాలు కొనసాగడం వల్ల బీసీ సమాజానికి నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. కులాలు వేరైనా మన హక్కులు ఒక్కటే.. రాజకీయ పార్టీలు వేరైనా మన లక్ష్యం ఒక్కటే.. బీసీల ఐక్యతే మన బలం, బీసీల అభివృద్ధే మన లక్ష్యం అని జాజుల లింగం గౌడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నూతన రజక సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎర్రబెల్లి దుర్గయ్య కుమ్మరికుంట్ల సుధాకర్ మాజీ కౌన్సిలర్ బాసాని గిరి బీసీ జేఏసీ నేత బంటు వెంకటేశ్వర్లు జానపాటి రవి తదితరులు ఉన్నారు.

# బాగ్ అంబర్పేట్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ వేడుకలు

### పాల్గొన్న డా.పుట్ల శ్రీనివాస్ డిఎంహెచ్ఓ హైదరాబాద్



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 15:** జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి హైదరాబాద్, అంబర్పేట్ క్లస్టర్ పరిధిలోని బాగ్ అంబర్పేట్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో గురువారం రోజున దుర్గామాత, బతుకమ్మ వేడుకలు డా.పుట్ల శ్రీనివాస్ డిఎంహెచ్ఓ హైదరాబాద్ పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.పుట్ల శ్రీనివాస్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ ప్రత్యేకతను కొనియాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి ప్రతీకా అని, మహిళల ఆత్మ గౌరవానికి సంకేతమని, పకృతి పట్ల ప్రేమ, సమాజంలో సామరస్యము, ఐక్యతకు ప్రతీకా అని, ఆరోగ్యకం ^మైన సాంప్రదాయము, మన సంస్కృతి ప్రపంచ దేశాలలో వ్యాపించిందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డా.శ్రీధర్, డా.శ్రీకళ, డా .ఆశ్రిత రెడ్డి ప్రోగ్రామ్ ఆఫీసర్స్, జక్కుల రాములు, జిల్లా మీడియా అధికారి, ఆంజనేయులు, ఇన్చార్జి మలేరియా అధికారి, మరియు అంబర్పేట్ క్లస్టర్ పరిధిలోని మెడికల్ ఆఫీసర్స్ డా. హరిశ్రీ ,డా.దీప్తి పటేల్, సూపర్వైజరీ సిబ్బంది పారామెడికల్ సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొనీ దుర్గామాత, బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు.



# ఎంపీకి తపస్ వినతిపత్రం



**రామాయంపేట వెలుతురు అక్టోబర్ 15:** ఖర్చు చేయని పిఎంశ్రీ నిధులను బాహ్యముల్యాంకనం రెమ్యూనరేషన్ కోసం వినియోగిస్తున్న విషయాన్నీ ఎంపీ రఘునందన్ రావు దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. మౌళిక సదుపాయల కల్పనకోసమే వినియోగించే పిఎం శ్రీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందని ఎంపీ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. అదేవిదంగా మెదక్ జిల్లా కేంద్రంలోని స్టేడియం అభివృద్ధి కోసం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుండి నిధుల మంజూరికి కృషి చేయాలనీ ఎంపీ గారిని కోరడం జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు జిడ్డి ఎల్లం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్, రాష్ట్ర బాద్యులు మన్నే వెంకట స్వామి, జిల్లా బాద్యులు మన్నే గోపాల్, నాగరాజు, సంతోష్, సురేందర్, మండల ప్రధాన కార్యదర్శి సిద్దిరాములు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా బండారు శ్రీనివాస్ కురుమ





**మునుగోడు,అక్టోబర్ 15 (వెలుతురు):** కురుమ యువ చైతన్య సమితి మునుగోడు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా బండారు శ్రీనివాస్ కురుమ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ ఆదేశానుసారం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు బండారు శంకర్ కురుమ బండారు శ్రీనివాస్ కురుమకు అధికారికంగా నియమించి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కురుమ యువతను ఏకం చేస్తూ, సమాజ హక్కుల సాధనకు సంఘం బలోపేతానికి నియోజకవర్గ స్థాయిలో శ్రీనివాస్ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు కుండే వెంకటేష్ కురుమ, ఉపాధ్యక్షులు మందుల సత్యం కురుమ, వర్కింగ్ ప్రెసిడెంట్ మోటే రవి కురుమ, కోశాధికారి రావుల ఐలయ్య కురుమ, జిల్లా కమిటీ నాయకత్వానికి బండారు శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# భారతరత్న అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు మరువలేనివి

### బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం



**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 15:** భారతదేశ మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను బీజేపీ మైనారిటీ మోర్చా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ ఆధ్వర్యంలో కరీంనగర్లోని పార్లమెంట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ముఖ్య అతిథిగా విచ్చేసి, అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం , మైనార్టీ మోర్చా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ముజీబ్ లు మాట్లాడుతూ.. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కేవలం ఒక శాస్త్రవేత్త మాత్రమే కాదని, కోట్ల మంది యువతకు రోల్ మోడల్, నిరుపమాన దేశభక్తుడని కొనియాడారు. దేశ ప్రగతికి యువత శక్తి ఎంతో కీలకమని నమ్మిన కలాం , విద్యార్థుల్లో ఉన్నతమైన ఆలోచనలు నింపడానికి తన జీవితాంతం కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన చూపిన బాటలో నడుస్తూ, దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు,దేశ రక్షణ కోసం అబ్దుల్ కలాం చేసిన కృషి మరువ లేనివన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, సమీయుల్లా అహ్మద్, సైద్, ఫయాజ్, అబూ బకర్, అమెర్, రౌఫ్, తదితరులు కార్యకర్తలు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు.

## సింగరేణిని ప్రైవేటీకరించబోమని శ్రీధర్‌బాబు స్పష్టీకరణ

**హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 15:** సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సంస్థను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని కొట్టిపారేశారు. సింగరేణి భవిష్యత్తుపై కార్మికులు గానీ, ప్రజలు గానీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పదేళ్ల పాలనలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం సొంత సంస్థలా మార్చుకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సంస్థకు భారీగా బకాయిలు పెట్టి ఆర్థికంగా దెబ్బతీశారని విమర్శించారు. అప్పట్లో సంస్థను నిర్వీర్యం చేసిన నాయకులు, ఇప్పుడు కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. సింగరేణి సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. ఆధారాలు లేని విమర్శలను ప్రజలు, కార్మికులు పట్టించుకోవద్దని సూచించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే సింగరేణిని కాపాడిందని, ఇప్పుడు కూడా సంస్థ ప్రయోజనాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడిపిస్తామని ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

## దుర్గమ్మకు రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటం

### దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ ఈ కానుక అందజేత

**విజయవాడ, వెలుతురు అక్టోబరు 15:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారికి దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ భారీ కానుక అందింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ భక్తుడు సుమారు రూ. 75 లక్షల విలువైన స్వర్ణ కిరీటాన్ని అమ్మవారికి విరాళంగా సమర్పించారు. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కుర్మినాయుడు, పద్మావతమ్మ దంపతుల కుమారుడైన కె. దుర్గా శ్రీనివాస్ ఈ కిరీటాన్ని విరాళంగా ఇచ్చారు. 494 గ్రాముల స్వచ్ఛమైన బంగారంతో రూపొందించిన ఈ కిరీటంలో ఎరుపు, నీలం, తెలుపు, ఆకుపచ్చ రంగుల నవరత్నాలను పొదిగారు. దసరా ఉత్సవాల సందర్భంగా దుర్గా శ్రీనివాస్ ఈ కిరీటాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) శీనానాయక్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతోనే ఈ కానుకను సమర్పించానని, పవిత్రమైన నవరాత్రుల సమయంలో కిరీటాన్ని అందించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం ఆలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజలు, దర్శనాల నడుమ ఈ విరాళం అందడం విశేషం.

## అమెరికా సిటిజన్ అయి ఉండి కాక్రోచ్ నిరసనల్లో పాల్గొంటారా

### అమిర్ ఖాన్ మేనల్లుడికి భారత్‌ను వీడాలని నోటీసులు!

**ముంబై, వెలుతురు అక్టోబరు 15:** బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ మేనల్లుడు, ప్రముఖ నటుడు ఇమ్రాన్ ఖాన్‌కు ముంబై పోలీసులు గట్టి షాక్ ఇచ్చారు. అక్టోబర్ 28వ తేదీలోగా భారతదేశాన్ని విడిచిపెట్టి వెళ్లాలని ఆదేశిస్తూ ఆయనకు అధికారికంగా నోటీసులు జారీ చేశారు. భారతీయ విదేశీయుల చట్టం నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలపై పోలీసులు ఈ చర్య తీసుకున్నారు. అమెరికా పౌరసత్వం కలిగిన ఇమ్రాన్ ఖాన్.. విదేశీ పౌరుడై ఉండి భారత గడ్డపై రాజకీయ నిరసన ప్రదర్శనలో పాల్గొనడమే ఈ వివాదానికి ప్రధాన కారణంగా నిలిచింది. అక్టోబర్ 10న ముంబైలో కాక్రోచ్ జనతా పార్టీ'కి మద్దతుగా, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ భారీ ఆందోళన నిర్వహించారు. ఈ రాజకీయ నిరసన ప్రదర్శనలో ఇమ్రాన్ ఖాన్ ప్రత్యక్షంగా పాల్గొని ధర్నా చేశారు. ఆ సమయంలో పోలీసులు ఆయనను అదుపులోకి కూడా తీసుకున్నారు. ఒక విదేశీ పౌరుడు భారతీయ రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం, ఆందోళనలకు దిగడం చట్టరీత్యా తీవ్రమైన నేరం కావడంతో ముంబై పోలీస్ యంత్రాంగం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటోంది. ఈ వివాదంపై స్పందించిన ముంబై పోలీస్ ఉన్నతాధికారులు కీలక ప్రకటన చేశారు. ఇమ్రాన్ ఖాన్ అమెరికా పౌరసత్వం కలిగిన విదేశీయుడు. ఆయన భారత పౌరుడు కాడు. విదేశీయుల చట్టం ప్రకారం.. భారతదేశ భూభాగంలో ఎలాంటి రాజకీయ నిరసనలు లేదా రాజకీయ కార్యకలాపాల్లో విదేశీయులు పాల్గొనడం పూర్తిగా నిషేధం అని స్పష్టం చేశారు. అక్టోబర్ 28లోగా దేశం వీడాలంటూ జారీ చేసిన నోటీసు ప్రపతిని ఇమ్రాన్ ఖాన్ స్వీకరించారని, తదుపరి పరిపాలనాపరమైన ప్రక్రియలు శరవేగంగా సాగుతున్నాయని పోలీసులు వెల్లడించారు. కిరీట్ సోమయ్య ఫిర్యాదు , పోలీసుల ప్రాథమిక విచారణ అనంతరం విదేశీయుల చట్టాల ఉల్లంఘన స్పష్టమవ్వడంతో ముంబై పోలీసులు తక్షణమే దేశం వీడాలంటూ నోటీసులు ఇచ్చారు. అమెరికాలోని మాడిసన్‌లో జన్మించిన ఇమ్రాన్ ఖాన్ వద్ద పుట్టుకతోనే అమెరికన్ పాస్‌పోర్ట్ ఉంది. భారతదేశంలో బాలీవుడ్ నటుడిగా గుర్తింపు పొందినప్పటికీ ఆయన భారతీయ పౌరసత్వాన్ని తీసుకోలేదు. ఇప్పుడు రాజకీయ నిరసనల్లో పాల్గొని లీగల్ చిక్కుల్లో పడటంతో, నిర్ణీత గడువులోగా ఆయన అమెరికాకు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## విద్యారంగ సమస్యల పరిష్కారానికి

# ఉపాధ్యాయుల సమరశంఖం

- 17న ఇందిరాపార్క్ వద్ద సామూహిక నిరాహార దీక్షలు..
- ఉపాధ్యాయులు భారీగా తరలిరావాలి: టీఎస్‌యూటీఎఫ్



**కారేపల్లి,వెలుతురు అక్టోబర్ 15:** ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల హక్కుల సాధన, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమానికి సిద్ధమయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యారంగ విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న సామూహిక నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ సింగరేణి మండల కమిటీ పిలుపునిచ్చింది. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీఎఫ్ఐ) పిలుపు మేరకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బానోత్ రాందాస్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీనపరిచే విధానాల వల్ల ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతోపాటు ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రతకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి**

విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ) అమలుకు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి మినహాయింపు ఇవ్వాలని కమిటీ నాయకులు కోరారు. జాతీయ పెన్షన్ విధానం (ఎన్‌పీఎస్), ఏకీకృత పెన్షన్ పథకం (యూపీఎస్)లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జాతీయ విద్యా విధానం?2020లో ప్రభుత్వ విద్యారంగానికి నష్టం కలిగించే అంశాలను ఉపసంహరించుకోవాలని, పాఠశాలల విలీనాలు, మూసివేతలను నిలిపివేయాలని స్పష్టం చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయడంతోపాటు ప్రాథమిక పాఠశాలలకు ఇబ్బందులు కలిగిస్తున్న జీవో 25ను సవరించాలని కోరారు. ఉపాధ్యాయులను బోధనా విధులకే పరిమితం చేసి, బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

**పీఆర్సీ అమలు.. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి**

తాత్కాలిక, కాంట్రాక్టు ఉపాధ్యాయులను సామాజిక భద్రతతో కూడిన విధానంలో క్రమబద్ధీకరించాలని, కేజీబీవీ, యూఆర్ఎస్, ఎస్ఎస్, టీడబ్ల్యూ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రెండో వేతన సవరణ సంఘం (పీఆర్సీ) నివేదికను తెప్పించి వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం (డీఏ), ఇతర బిల్లులను విడుదల చేయాలని కోరారు. ఎనిమిదో కేంద్ర వేతన సంఘం సిఫార్సులను అమలు చేయడంతోపాటు ఆదాయపు పన్ను శ్లాబులను సవరించి ఉద్యోగులపై పన్ను భారాన్ని తగ్గించాలని పేర్కొన్నారు.

## సద్దుల బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లను పరిశీలించిన మేయర్



**కరీంనగర్, వెలుతురు అక్టోబర్ 15:** : బొమ్మకల్ సద్దుల బతుకమ్మకు ఘనంగా ఏర్పాట్లు చేశామని మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. ?తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండగను పురస్కరించుకుని గురువారం నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, నగరపాలక సంస్థ అధికారులతో కలిసి బొమ్మకల్ లో పర్యటించారు. ఈ ప్రాంత ఆచార వ్యవహారాలకు అనుగుణంగా ఏడు రోజుల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు జరుగనున్న నేపథ్యంలో బొమ్మకల్ ప్రాంతంలోని బతుకమ్మ ఆడే పాయింట్లతో పాటు చెరువు కట్ట ప్రాంతంలో గల నిమజ్జనం పాయింట్లను సందర్శించారు. ఏడు రోజుల సద్దుల బతుకమ్మ వేడుకలకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేసిన ఏర్పాట్లను మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు స్వయంగా తనిఖీ చేసి పరిశీలించారు. బతుకమ్మ ఆడే పాయింట్లతో పాటు చెరువు కట్ట నిమజ్జనం ఘాట్ వద్ద లైటింగ్, సౌండ్ సిస్టమ్, భారికేడింగ్, చదును, త్రాగు నీటి వసతి తదితర ఏర్పాట్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరిశీలించారు. బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచనలు చేస్తూ... ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ..నగరపాలక సంస్థ పరిధిలో పలు ప్రాంత ఆచార వ్యవహారాలకు అనుగుణంగా తొమ్మిది రోజులు, ఏడు రోజులలో జరిగే పవిత్రమైన సద్దుల బతుకమ్మ పండగను నగర ఆడపడుచులు, ప్రజలు ప్రశాంత వాతావరణం లో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకోవాలని పిలుపు నిచ్చారు. తెలంగాణ ప్రాంత సంస్కృతి సాంప్రదాయ పండగైన సద్దుల బతుకమ్మ వేడుకలకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 2.80 కోట్ల నిధులతో గతం కంటే ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం రోజు బొమ్మకల్ ప్రాంతంలో జరిగే ఏడు రోజుల సద్దుల బతుకమ్మ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు. బొమ్మకల్ ప్రాంతంలోని బతుకమ్మ పాయింట్లతో పాటు నిమజ్జనం ఘాట్ ల వద్ద చదును కార్యక్రమాలు, మహిళలు ఆడుకునేలా చక్కటి సౌండ్, లైటింగ్ సిస్టమ్, సులభంగా బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు వీలుగా ఘాట్ వద్ద తగినంత వెలుతురు ఉండేలా భారీ విద్యుత్ దీపాలను ఏర్పాటు నిమజ్జనం సమయంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా బారికేడింగ్ తో బద్రత ఏర్పాట్లు, నిమజ్జనం ఘాట్ వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రత్యేక పారిశుధ్యం, వచ్చే వారికి త్రాగు నీటి సౌకర్యం లాంటి తదితర అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మహిళలు, ప్రజలకు వసతులు, సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూస్కోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. బతుకమ్మ నిమజ్జనం ఘాట్ వద్ద నగరపాలక సంస్థ అధికారులు, కార్మిక సిబ్బందిని కూడ అప్రమత్తం చేశామని తెలిపారు. ఏడు రోజుల సద్దు బతుకమ్మ వేడుకలకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా నగరపాలక సంస్థ ద్వారా అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. ఏడు రోజుల సద్దుల బతుకమ్మ వేడుకలకు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను పెట్టి ఆడపడుచులు ఉయ్యాల పాటలు భక్తిశ్రద్ధలతో బతుకమ్మ ఆడి.. ప్రశాంత వాతావరణం లో బతుకమ్మలను గంగమ్మ ఒడికి చేర్చాలని మేయర్ ఆకాంక్షించారు. నగరపాలక సంస్థ పరిదిలోని బొమ్మకల్ ప్రజలందరికీ ఏడు రోజుల సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల వెంకటేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



**మంచిర్యాల,వెలుతురు అక్టోబరు 15:** మండల తహసిల్దార్ కార్యాల యాలలోని పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి తహసిల్దార్ సిబ్బందితో పలు రెవెన్యూ అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్.- 2026 లో భాగంగా దావాలు అభ్యంతరాల పరిష్కరణ వేగవంతం చేయాలని తెలిపారు కార్యాలయానికి సంబంధించిన పెండింగ్ సర్టిఫికెట్లు,భూ భారతి ద్వారా అందిన దరఖాస్తులు జి.ఓ.ఎం.ఎస్.నం.59, భూదాన్ భూములకు సంబంధించిన అంశాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశిత కాల పరిమితిలోగా వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ధృవీకరణ పత్రాల కోసం నిరీక్షించకుండా పెండింగ్ సర్టిఫికెట్ల మంజూరుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కార్యాలయ సిబ్బందికి సూచించారుఅనంతరం నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఛాంబర్ లో జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్ పాండే సూపరింటెండెంట్లు సంబంధిత సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యాలయంలో పెండిం గ్‌లో ఉన్న అన్ని రకాల ఫైళ్ల పురోగతిపై విభాగాల వారీగా సమీక్షించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఫైలును గడువులోగా పరిష్కరించాలనీ కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు ఇబ్బందులు కలగకుండా వేగవంతమైన పారదర్శ కమైన సేవలు అందించాలని తెలిపారు. కార్యాలయ ఫైల్స్ రికార్డులను పక్కాగా నిర్వహించాలని, రికార్డుల భద్రత నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రతి విభాగం సమర్థ వంతంగా పని చేయాలని తెలిపారుఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సెలెక్టర్ పదవీకి ఇద్దరు దిగ్గజాల నో..

**ముంబై, వెలుతురు అక్టోబరు 15:** బీసీసీఐకి కొత్త తలనొప్పి మొదలైంది. పురుషుల జాతీయ జట్టు సెలెక్షన్ కమిటీలో ఖాళీ అయిన స్థానాన్ని భర్తీ చేసేందుకు ప్రముఖ ఆటగాళ్లను తీసుకురావాలన్న ప్రయత్నాలకు చుక్కెదురవుతోంది. దాదాపు 100 టెస్టులు ఆడిన ఇద్దరు మాజీ దిగ్గజ క్రికెటర్లను సెలెక్టర్ పదవి చేపట్టాలని బీసీసీఐ సంప్రదించగా, వారు ఈ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించినట్లు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. చీఫ్ సెలెక్టర్‌గా వ్యవహరించిన అజిత్ అగార్కర్, తన పదవీకా లాన్ని పొడిగించుకునేందుకు ఇష్టపడక పోవడం తో ఈ నెల ప్రారంభంలో అతడి పదవీకా లం ముగిసింది. దీంతో సెలెక్షన్ కమిటీలో ఒక స్థానం ఖాళీ అయింది. ఈ నేపథ్యంలో వెస్ట్ జోన్ కోటాలో సెలెక్టర్ పదవికి బీసీసీఐ దరఖాస్తులను ఆహ్వానించింది. అక్టోబర్ 14తో ఈ గడువు కూడా ముగిసింది. ప్రస్తుతం ఈ కమిటీలో ప్రజ్ఞాన్ ఓఝా (తాత్కాలిక ఛైర్మన్), ఆర్‌పీ సింగ్, అజయ్ రాత్రా, ఎస్ఎస్ దాస్ సభ్యులుగా కొనసాగుతున్నారు. సెలెక్టర్ల వంటి కీలక పదవుల్లోకి పేరున్న, అనుభవజ్ఞులైన ఆటగాళ్లను తీసుకురావాలని బీసీసీఐ గట్టిగా ప్రయత్నిస్తోంది.

## బెంగళూరు పబ్ ఘటనపై ఏపీ ప్రభుత్వం సీరియస్..

### ఐఏఎస్ అధికారి విక్రాంత్ మర్మత్‌పై బదిలీ వేటు!

**బెంగళూరు, వెలుతురు అక్టోబర్ 15:** కర్ణాటక రాజధాని బెంగళూరులోని ఓ పబ్‌లో పోలీసులపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై ఏపీ కేడర్ ఐఏఎస్ అధికారి విక్రాంత్ మర్మత్ పై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయనను తక్షణమే ఆ పదవి నుంచి తప్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విక్రాంత్ మర్మత్ కుప్పం కెడా పీడీ బాధ్యతల నుంచి బదిలీ చేస్తూ, సాధారణ పరిపాలనా శాఖకు సరెండర్ చేశారు. తక్షణమే జీఏడీలో రిపోర్టు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ విక్రాంత్ మర్మత్‌ను ఆదేశించారు. ఈ మేరకు సీఎస్ అధికారిక ఉత్తర్వులను జారీ చేశారు. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ నిరంతర నిర్వహణ కోసం త్వరలోనే కొత్త ఇన్‌ఛార్జి నియామకానికి ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. ఇటీవల బెంగళూరులోని ఓ పబ్‌లో పోలీసు అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఐఏఎస్ అధికారి విక్రాంత్ మర్మత్, ఆయన మిత్రులు విధులు నిర్వర్తిస్తున్న పోలీసులతో ఘర్షణకు దిగారని ఆరోపణలు వచ్చాయి. పోలీసులతో వాగ్వాదానికి దిగి, వారిపై దాడి చేసి బెదిరింపులకు పాల్పడినట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడం, ఐఏఎస్ అధికారిపై క్రిమినల్ కేసులు నమోదు కావడంతో ఏపీ ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంది. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఆయనను కుప్పం బాధ్యతల నుంచి తొలగిస్తూ విచారణకు ఆదేశించినట్లు సమాచారం.

## సీఎం రేవంత్ ఆదేశాల అమలు..

### విద్యుత్ శాఖలో ఉన్నతాధికారి సస్పెన్షన్

**హైదరాబాద్ వెలుతురు అక్టోబరు 15:** తెలంగాణలో విద్యుత్ కోతలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన గంటల వ్యవధిలోనే ప్రభుత్వం చర్యలకు దిగింది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలతో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) స్టేజ్-1 చీఫ్ ఇంజినీర్ బి. సురేశ్‌ను సస్పెండ్ చేసింది. టీజీ జెన్‌కో సీఎండీ డాక్టర్ ఎస్.హరీశ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుదుత్పత్తి పెంపునకు ప్రాధాన్య పనుల ప్రణాళిక, పర్యవేక్షణ, అమలులో ఆయన తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగనుంది. ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో విద్యుత్ కోతలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నైనీ, మహానది బొగ్గు బ్లాకుల నుంచి బొగ్గు సరఫరా ఉన్నప్పటికీ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో పూర్తి సామర్థ్యంతో విద్యుదుత్పత్తి ఎందుకు జరగడం లేదని అధికారులను ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, టీజీ జెన్‌కో సీఎండీ ఎస్.హరీశ్‌పైనా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు ఎండిపోకుండా వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. పంట చేతికొచ్చే వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. రానున్న 20 రోజులు పంటలకు కీలకమని, విద్యుత్ కొరత కారణంగా రైతులు నష్టపోయే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదని అన్నారు. వ్యవసాయ విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి సరఫరా పెంచాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో లోటు వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్, తాగునీటి సరఫరా పరిస్థితులపైనా సీఎం సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సరఫరా మెరుగుపర్చాలని పలుమార్లు ఆదేశించినా పరిస్థితిలో మార్పు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిర్లక్ష్యాన్ని సహించబోనని, ప్రజలకు తాను జవాబుదారీగా ఉన్నానని స్పష్టం చేశారు.

## కేటీఆర్ ఎంఎన్సీలను బెదిరించి వ్యాపారం చేశారు

**హైదరాబాద్ వెలుతురు అక్టోబరు 15:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై శాసనమండలి ప్రభుత్వ విప్ వెంకట్ బల్మూర్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. గతంలో చెప్పినట్టుగానే కేటీఆర్ చీకటి బాగోతాలను వరుసగా బయటపెడుతూనే ఉంటానని, అందులో భాగంగానే ఆయన హోటల్ వ్యాపారానికి సంబంధించిన కొన్ని విషయాలను వెల్లడిస్తున్నట్లు తెలిపారు. రూ.5 కోట్ల షేర్ విలువ ఉన్న డెక్కన్ సరాయ్ హోటల్ ఆదాయం పదేళ్లలో రూ.175 కోట్లకు ఎలా పెరిగిందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంపై తాను ఆరా తీయగా విస్తుపోయే నిజాలు బయటకు వచ్చాయని బల్మూర్ అన్నారు. కేటీఆర్ ఐటీ మంత్రిగా, షాడో ముఖ్యమంత్రిగా తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. బహుళజాతి సంస్థ (ఓౌఅ)లను బెదిరించి, తమ కంపెనీలకు చెందిన ఫుడ్, ఈవెంట్స్, మీటింగ్స్ వంటివి తన హోటల్‌లోనే నిర్వహించేలా ఒప్పందాలు చేయించుకున్నారని విమర్శించారు. ఈ ఒప్పందాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని, ఇది కేటీఆర్, ఆయన టీమ్ చేస్తున్న నయా దందా అని అభివర్ణించారు. ఆ హోటల్ రోజువారీ ఆదాయం సుమారు రూ.75 లక్షలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. తాను చేసిన ఆరోపణలపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని బల్మూర్ స్పష్టం చేశారు. కేటీఆర్‌కు దమ్ముంటే తన ఆరోపణలపై స్పందించాలన్నారు.

## రోబోటిక్ సర్జరీతో 25 ఏళ్ల యువతికి యూరెటరిక్ స్ట్రిక్చర్ చికిత్స

**మంచిర్యాల వెలుతురు అక్టోబరు 15:** మూత్రం తగ్గిపోవడం, నడుము నొప్పికి కారణమైన కుడి డిస్టల్ యూరెటరిక్ స్ట్రిక్చర్ చికిత్స ద్వారా కుడివైపు నడుము నొప్పి మూత్రం తగ్గిపోవడం కింది పొత్తికడుపులో నొప్పి మూత్ర సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 25 ఏళ్ల యువతికి మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోబోటిక్ సర్జరీ ద్వారా విజయవంతంగా చికిత్స అందించారు. పరీక్షల్లో కుడి డిస్టల్ యూరెటరిక్ స్ట్రిక్చర్ ఉన్నట్లు గుర్తించారు దీంతో పాటు కుడివైపు యూరెటర్ విస్తరించి ఉన్నట్లు గుర్తించారు సమస్య ఉన్న ప్రదేశాన్ని పరిగణనలోకి తీసుకుని రోగికి రోబోటిక్ రైట్ యూరెటరిక్ రీ-ఇంప్లాంటేషన్ నిర్వహించారు. శస్త్రచికిత్స సమయంలో కుడి డిస్టల్ యూరెటరిక్ స్ట్రిక్చర్ విస్తరించిన యూరెటర్‌తో పాటు మూత్రాశయం ముందు పొత్తికడుపు గోడ మధ్య అడ్హీషన్స్ ఉన్నట్లు గుర్తించారు. శస్త్రచికిత్స అనంతరం ఎలాంటి సమస్యలు లేకుండా కోలుకున్న రోగి హీమోడైనమికల్‌గా స్థిరమైన పరిస్థితిలో డిశ్చార్జి అయ్యారు. డా. యశస్వి రెడ్డి టి. కన్సల్టెంట్ యూరాలజిస్ట్ ఆండ్రాలజిస్ట్ యూరో-ఆంకాలజిస్ట్ రోబోటిక్ మరియు రీనల్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ మాట్లాడుతూ యూరెటరిక్ స్ట్రిక్చర్ వల్ల మూత్ర మార్గం సంకుచితమై నడుము నొప్పి మూత్రం తగ్గిపోవడం వంటి సమస్యలు రావచ్చన్నారు. ఈ యువతిలో స్ట్రిక్చర్ ఉన్న ప్రదేశాన్ని పరిగణనలోకి తీసుకుని రోబోటిక్ యూరెటరిక్ రీ-ఇంప్లాంటేషన్ నిర్వహించామని తదుపరి ఫాలోఅప్ అవసరమని తెలిపారు. డా. పరిక్షిత్ అనస్థీషియా సేవలు అందించారు మూడు నెలల తర్వాత వైద్యుల క్లినికల్ అంచనా ప్రకారం డీటీపీఏ రీనోగ్రామ్ అవసరం కావచ్చని వైద్యులు సూచించారు. నిరంతరాయంగా నడుము నొప్పి మూత్రం తగ్గిపోవడం లేదా ఇతర మూత్ర సంబంధిత సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో యూరాలజిస్ట్‌ను సంప్రదించాలని మలక్ పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అధునాతన వైద్య సదుపాయాలతో కూడిన యూరాలజీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలిపారు ఈ కార్యక్రమం లో వాసుదేవ కిరణ్ యశోద సిబ్బంది పాల్గొన్నారు

## స్వాతి గ్రాండ్ రెస్టారెంట్ హోటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే సాంబశివరావు, మేయర్ గణేష్

**పాల్వంచ, వెలుతురు అక్టోబరు 15:** పట్టణంలో నూతనంగా 'స్వాతి గ్రాండ్ రెస్టారెంట్' అత్యంత వైభవంగా ప్రారంభమైంది. స్వాతి గ్రాండ్ రెస్టారెంట్ ను స్థానిక ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, కొత్తగూడెం మేయర్ మూడు గణేష్ , బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు వనమా రాఘవేంద్ర రావు, సిపిఐ నాయకులు సాబీర్ పాష రిబ్బన్ కట్ చేసి గురువారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పట్టణంలోని పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు హాజరయ్యారు. ?కార్పొరేటర్ బత్తుల మధుచంద్, ముక్తేవి ఫౌండేషన్ చైర్మన్ ముక్తే గిరీష్, రేగళ్ల శ్రీను ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవంతంగా సాగింది. అతిథులకు ఘనంగా స్వాగతం పలికిన అనంతరం, పట్టణంలోని ప్రముఖులందరినీ నిర్వాహకులు రంగారావు, శాలువాలతో సత్కరించారు. ?ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ధరలు ఉన్నాయని, రుచికరమైన నాణ్యమైన వంటకాలు ప్రజలకు అందిస్తున్నారని అందులో 'స్వాతి గ్రాండ్ రెస్టారెంట్' ముందంజలో ఉంటుందని ఆకాంక్షించారు. ముఖ్యంగా ఇక్కడ లభించే చికెన్ బిర్యానీ, మండి రుచులు ప్రజలను అలరిస్తాయని తెలిపారు. రెస్టారెంట్ యజమానికి హోటల్ వ్యాపారంలో 30 సంవత్సరాల అనుభవం ఉండటం ఈ రెస్టారెంట్ విజయానికి ఒక ప్రధాన కారణమని వారు పేర్కొన్నారు. ?పట్టణ ప్రజలందరికీ రుచికరమైన మరియు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు తాము కట్టుబడి ఉన్నామని రెస్టారెంట్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సాబీర్ పాష, కార్పొరేటర్ లు సిరిపురం లలిత, సుగుణ, రాంబాబు, నరేష్, సింధు తపస్వి, నామ కీర్తి, అన్నపూర్ణ, పట్టణంలోని నాయకులు కనగాల బాలకృష్ణ, ఎర్రంశెట్టి ముత్తయ్య, నాయుడు, అచ్చ కోటిలింగం, తదితరులు పాల్గొన్నారు.

## బేతంచెర్లలో సంప్రదాయబద్ధంగా దుర్గామాత నిమజ్జనం

**బేతంచెర్ల, వెలుతురు అక్టోబరు 15:** దుర్గామాత విగ్రహాల నిమజ్జన వేడుకలను సంస్కృతి,సంప్రదాయాలు ప్రతిబింబించేలా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సీఐ వెంకటేశ్వరరావు,సూచించారు. ఈ నెల 21న నిమజ్జన వేడుకలు నిర్వహించనున్న నేపథ్యంలో బుధవారం స్థానికపోలీస్‌స్టేషన్‌లో ఉత్సవ కమిటీనిర్వాహకులు హుస్సేన్‌రెడ్డి,చంద్రమౌళీశ్వర్‌రెడ్డి,మారుతి శర్మ, ఆధ్వర్యంలో విగ్రహాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నిమజ్జన వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. నిబంధనల ప్రకారం వేడుకలు నిర్వహించాలని,డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్ రెడ్డి,విగ్రహాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సంక్షోభం..

# బొగ్గు కుంభకోణానికి రేవంత్‌దే బాధ్యత!

- విద్యుత్ రంగాన్ని నాశనం చేశారు.. సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు మాయం
- సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి
- సీఎం వెంటనే రాజీనామా చేయాలి: ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 15 :** తెలంగాణలో విద్యుత్ సంక్షోభం, సింగరేణి బొగ్గు కుంభకోణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తి బాధ్యత వహించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. విద్యుత్ రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టిందని, సింగరేణిలో రూ. 1,600 కోట్ల విలువైన 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయమైనట్లు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. గోదావరిఖనిలో కేటీఆర్ బహిరంగ సభను విజయవంతం చేసిన సింగరేణి కార్మికులకు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**విద్యుత్ రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ ఉత్పత్తిని 7,000 మెగావాట్ల నుంచి 20,000 మెగావాట్లకు పెంచి, విద్యుత్ కోతలు లేని పరిస్థితిని కల్పించామని శ్రవణ్ పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సబ్‌స్టేషన్ల ఎదుట రైతులు ఆందోళనలు చేస్తున్నారని, పరిశ్రమలు జనరేటర్లపై ఆధారపడాల్సి వస్తోందని అన్నారు. అయినప్పటికీ విద్యుత్ కోతలు లేవని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెబుతున్నారని విమర్శించారు. యాదాద్రి విద్యుత్ ప్లాంట్ 4,000 మెగావాట్ల సామర్థ్యానికి బదులుగా 400 మెగావాట్లకే, జైనూర్ ప్లాంట్ 1,200 మెగావాట్లకు బదులుగా 544 మెగావాట్లకే పరిమితమయ్యాయని ఆరోపించారు. ప్లాంట్ల సామర్థ్యం తగ్గడానికి కారణాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**సింగరేణిలో బొగ్గు మాయంపై విచారణ జరపాలి**

సింగరేణిలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయమైనట్లు ఆరోపణలు వస్తున్నా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని శ్రవణ్ ప్రశ్నించారు. ఎన్నికల వ్యవస్థపై ఆరోపణలతో ఇతరుల రాజీనామా కోరుతున్న కాంగ్రెస్ నాయకులు, సింగరేణి వ్యవహారంపై ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సింగరేణిని ప్రైవేటీకరించి అదానీకి అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని కూడా ఆరోపించారు.

**కాళేశ్వరంపై రాజకీయ కక్ష**

కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయ కక్షతో పక్కనపెట్టడం వల్ల ఉత్తర తెలంగాణలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, రైతులు మళ్లీ బోర్లపై ఆధారపడాల్సి వస్తోందని శ్రవణ్ విమర్శించారు. విద్యుత్ సంక్షోభం, సింగరేణి వ్యవహారాలపై సీఎం రేవంత్‌రెడ్డి నైతిక బాధ్యత వహించాలని, రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిన పాలనకు రాజీనామాతో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## భారత రాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు పలికిన గవర్నర్

**గన్నవరం, వెలుతురు అక్టోబర్ 15 :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం మధ్యాహ్నం 2.45 గంటలకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో న్యూఢిల్లీకి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌తో పాటు పలువురు ప్రముఖులు రాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు పలికారు. రాష్ట్రపతి రెండు రోజుల పాటు ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పర్యటన ముగించుకుని న్యూఢిల్లీకి తిరుగు ప్రయాణమైన రాష్ట్రపతికి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్ తో పాటు కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ మంత్రి వంగలపూడి అనిత, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా, 4(ఏ), గర్ల్స్ ఎన్సిసి బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ప్రవీణ్ యాదవ్, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, జిల్లా ఎస్పీ వి. విద్యా సాగర్ నాయుడు భారత రాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు పలికారు

## తిరుపతి రూరల్ ఎక్సైజ్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

**రేణిగుంట, వెలుతురు అక్టోబర్ 15:** చిత్తూరు జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసా ఆచారి ఆదేశాల మేరకు, స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎలక్షన్ కోడ్) అమలులోకి వచ్చిన సందర్భంగా తిరుపతి రూరల్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ నరస నాయుడు, సబ్ ఇన్స్పెక్టర్ కవీశ్వర్ నాయుడు మరియు వారి సిబ్బంది కలసి అక్టోబర్ 15 తేదీ గురువారం రేణిగుంట రైల్వే స్టేషన్ మరియు రేణిగుంట పార్సల్ ఆఫీస్ నందు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పొరుగు రాష్ట్రాల నుండి అక్రమంగా తరలించే నాన్-డ్యూటీ పెయిడ్ లిక్కర్ గంజాయి మరియు ఇతర నిషేధిత మాదక ద్రవ్యాల రవాణాను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా ఈ విస్తృత సోదాలు చేపట్టడం జరిగింది. ఈ ఆకస్మిక తనిఖీల్లో భాగంగా రైల్వే పార్సల్ కార్యాలయానికి వచ్చిన పలు అనుమానాస్పద పార్సళ్లను, లగేజ్ బాక్సులను అలాగే ప్రయాణికుల సంచులను ఎక్సైజ్ బృందం అణువణువూ క్షుణ్ణంగా తనిఖీ చేయగా, ఎటువంటి అక్రమ పదార్థాలు గానీ లేదా నిషేధిత వస్తువులు గానీ లభించలేదని ఎక్సైజ్ అధికారులు స్పష్టం చేశారు. అనంతరం తిరుపతి రూరల్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ నరస నాయుడు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పూర్తయ్యేంత వరకు ఎక్కడ కూడా అక్రమ మద్యం, గంజాయి రవాణా జరగకుండా నిరంతరంగా తనిఖీలు కొనసాగిస్తామని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## దివ్యాంగులకు పరికరాలు

# పంపిణి చేసిన ఎంపీ రఘునందన్ రావు

**రామాయంపేట, వెలుతురు అక్టోబర్ 15 :** మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని మెహర్ సాయి ఫంక్షన్ హాలులో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆర్విపై మరియు ఏడిఐపి పథకాల కింద అలీంకో సంస్థ ద్వారా రామాయంపేట నిజాంపేట నార్సింగి చేగుంట చిన్నశంకరంపేట మండలాలకు సీనియర్ సిటిజన్లు అర్హులైన దివ్యాంగులను గుర్తించి ఉచిత సహాయక పరికరాలను ప్రత్యేక శిబిరం నిర్వహించి మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు చేతుల మీదుగా ట్రై సైకిళ్ళు,వినికిడి పరికరాలు,బ్యాటరీ సైకిళ్ళు,విల్ చేర్లు మొత్తం 296 మందికి పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఓ హేమ భార్గవి మెదక్ జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కుమ్మరి కుమార్ రామాయంపేట భారతీయ జనతా పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు శీలం అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు జిల్లా ఉపాధ్యాక్షులు 8వ వార్డు కౌన్సిలర్ శంకర్ గౌడ్ వెలుముల సిద్ధరాములు జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు బాలరాజ్ సర్పంచులు ప్రవీణ్ ,శైలజ శ్రీనివాస్ ముఖ్యనాయకులు పంజా విజయ్ కుమార్ పబ్బ సత్యనారాయణ భాను చందర్ గోపిశెట్టి అనంత లక్ష్మి, నవాత్ రాజు ఎల్లం దయానంద్ సంగయ్య కన్నయ్య లావణ్య శేఖర్ రంగయ్య చిన్నోళ్ల నాగరాజు వినయ్ శేఖర్ బండిగిరి అనిల్ స్వామి దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా అమర్చిన 12 మోటార్లు స్వాధీనం

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 15 :** తాగునీటి సరఫరా పైపులైన్లకు అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడుకుంటున్న వారిపై జలమండలి విజిలెన్స్ అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం కూకట్‌పల్లి జోన్ పరిధిలోని డివిజన్-22, గాయత్రీనగర్ వార్డులోని వివేకానందనగర్ కాలనీలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి 12 అక్రమ మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు జలమండలి విజిలెన్స్ బృందం సంబంధిత మేనేజర్‌తో కలిసి ఈ తనిఖీలు చేపట్టింది. తాగునీటి సరఫరా పైపులైన్లకు అక్రమంగా అమర్చిన మోటార్లను గుర్తించి తొలగించారు. తాగునీటి పైపులైన్లకు నేరుగా మోటార్లు బిగించి నీటిని తోడుకోవడం వల్ల ఇతర వినియోగదారులకు సరిపడా నీరు అందకపోవడంతో పాటు సరఫరా ప్రెషర్ తగ్గే అవకాశం ఉందని జలమండలి పేర్కొంది. అక్రమ మోటార్ల వినియోగాన్ని అరికట్టేందుకు తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# దేశంలోని అన్ని జిల్లాల్లో ఏఐపీసీ కమిటీలు

- పదవిగా కాకుండా బాధ్యతగా భావిస్తున్నా: మధుయాష్కీ గౌడ్
- ఢిల్లీలో ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ
- వీడియో కాల్ ద్వారా శుభాకాంక్షలు తెలిపిన సామ్ పిట్రోడా





**న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 15 :** దేశంలోని అన్ని జిల్లాల్లో ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపీసీ) కమిటీలను ఏర్పాటు చేసి, అన్ని రంగాల వృత్తి నిపుణులను భాగస్వాములను చేస్తామని మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ తెలిపారు. ఏఐపీసీ చైర్మన్‌గా నియామకాన్ని పదవిగా కాకుండా బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. గురువారం ఢిల్లీలోని ఏఐసీసీ భవన్‌లో ఏఐపీసీ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. మాజీ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి నుంచి బాధ్యతలు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు దీపాదాస్ మున్షి, రాజ్‌పాల్ గౌతమ్, కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు గురుదీప్ సింగ్ సప్పాల్, రాజ్యసభ సభ్యుడు దీపేందర్ హుడా, మాజీ ఎంపీ ఉదిత్ రాజ్ తదితరులు హాజరయ్యారు.

**వృత్తి నిపుణుల భాగస్వామ్యంతో అభివృద్ధి**

ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 50 వేల సభ్యత్వంతో పాటు అభివృద్ధి చెందిన 100 పట్టణ జిల్లాల్లో ఏఐపీసీ కమిటీలను విస్తరించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ సూచించిన 'బోధించు.. సమీకరించు.. పోరాడు' అనే సూత్రంతో సంస్థను ముందుకు తీసుకెళ్తానన్నారు. రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు వృత్తి నిపుణులను భాగస్వాములను చేస్తామని చెప్పారు. రాహుల్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుతూ, ప్రతి పౌరుడికి స్వేచ్ఛగా, గౌరవప్రదంగా జీవించే పరిస్థితులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. పార్టీ విధానాల రూపకల్పనతో పాటు దేశ అభివృద్ధి ప్రణాళికల్లో నిపుణుల పాత్రను పెంచుతామని పేర్కొన్నారు.

**ప్రజాస్వామ్య పరిరక్షణలో నిపుణుల పాత్ర కీలకం**

ఏఐపీసీ మాజీ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి మాట్లాడుతూ.. వృత్తి నిపుణులు రాజకీయాలకు దూరంగా ఉంటే దేశాభివృద్ధికి వారి అనుభవం పూర్తిస్థాయిలో ఉపయోగపడదన్నారు. పట్టణ ప్రాంతాల్లో నిపుణులను ఒక వేదికపైకి తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మధుయాష్కీ గౌడ్ సంస్థను సమర్థంగా బలోపేతం చేస్తారన్న నమ్మకం ఉందన్నారు. గురుదీప్ సింగ్ సప్పాల్ మాట్లాడుతూ.. కార్పొరేట్ సంస్థల ఆదాయాలు పెరుగుతున్నా ఉద్యోగుల వేతనాలు ఆశించిన స్థాయిలో పెరగడం లేదని విమర్శించారు. దీపేందర్ హుడా మాట్లాడుతూ.. శాస్త్రసాంకేతిక, సాఫ్ట్‌వేర్ సహా వివిధ రంగాల నిపుణులను ఏఐపీసీ ద్వారా ఒక వేదికపైకి తీసుకురావాలని సూచించారు. రాజ్‌పాల్ గౌతమ్ మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్య, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు నిపుణులు కృషి చేయాలని కోరారు. ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మన్ సామ్ పిట్రోడా వీడియో కాల్ ద్వారా మధుయాష్కీ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్యానంతరం దేశాభివృద్ధిలో నిపుణుల పాత్ర కీలకమైందని, అన్ని రంగాలకు చెందిన వారిని ఏఐపీసీలో భాగస్వాములను చేయాలని సూచించారు. వైద్యులు, ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లతో పాటు వివిధ రంగాల నిపుణులకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఐపీసీ నూతన గీతాన్ని దీపాదాస్ మున్షి విడుదల చేశారు.

# ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలి

- నామినేషన్ల స్వీకరణ నుంచి ఓట్ల లెక్కింపు వరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- ప్రతి అర్హుడికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలి
- ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్
- సున్నిత, అత్యంత సున్నిత ప్రాంతాలను గుర్తించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి
- ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలి : సుబ్బారాయుడు



**తిరుపతి, వెలుతురు అక్టోబర్ 15 :** స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫిరెన్స్ హాలు నుండి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పై జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు, జే సి ఆర్. గోవిందరావుతో కలసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ఎన్నికల షెడ్యూల్ నేపథ్యంలో తిరుపతి నగరపాలక సంస్థతో పాటు జిల్లాలోని సంబంధిత మున్సిపాలిటీల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసి, అభ్యర్థులకు అవసరమైన సమాచారం అందించాలని, బారికేడింగ్, రద్దీ నియంత్రణ, వాహనాల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణకు నిర్ణయించిన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సమయపాలన పాటించాలని, నామినేషన్ పత్రాలు, ఓటరు వివరాలు, అర్హతలు, ధ్రువపత్రాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. అభ్యర్థులందరినీ సమానంగా చూడాలని, నో డ్యూస్ ధ్రువపత్రాల జారీలో అనవసర జాప్యం చేయరాదని స్పష్టం చేశారు. ఓటరు జాబితాలు, వార్డుల పరిధులు, పోలింగ్ కేంద్రాల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, విద్యుత్, సూచిక బోర్డులు, బారికేడింగ్, భద్రతా ఏర్పాట్లు కల్పించాలని తెలిపారు. ఓటరు స్లిప్పులను బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ పంపిణీ చేసి, ప్రతి అర్హుడికి తమ పోలింగ్ కేంద్రం వివరాలు తెలియజేయాలని సూచించారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో వార్డుల సంఖ్య 50 నుంచి 66కు పెరిగిన నేపథ్యంలో కొత్త వార్డులు, పోలింగ్ కేంద్రాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, నిల్వ, రవాణా, వినియోగంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎన్నికల సామగ్రిని పటిష్ట భద్రత మధ్య భద్రపరచాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను ముందుగానే పరిశీలించి సీసీ కెమెరాలు, భద్రతా సిబ్బంది, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, బారికేడింగ్ తదితర ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బందికి రెండు విడతల్లో శిక్షణ ఇచ్చి, బ్యాలెట్ బాక్సుల నిర్వహణ, పేపర్ సీల్స్ వినియోగం, ఎన్నికల పత్రాల భద్రతపై ప్రాయోగిక అవగాహన కల్పించాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసు అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించినా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నామినేషన్ల స్వీకరణ నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలో సమయపాలన, పారదర్శకత, సమన్వయానికి ప్రాధాన్యతనిస్తూ ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎస్ పి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని ఉన్నతాధికారులు సూచించారు. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖలు, రిటర్నింగ్ అధికారులు పరస్పర సమన్వయంతో ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు కలెక్టరేట్‌లో ఎన్నికల సెల్‌లను ఏర్పాటు చేయాలని, సాధారణ, సున్నిత, అత్యంత సున్నిత ప్రాంతాలను గుర్తించి బందోబస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా ఎంసీసీ, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్ బృందాలు సమర్థంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనలపై క్షేత్రస్థాయి సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్, నామినేషన్ కేంద్రాలను ముందుగానే గుర్తించి సీసీ కెమెరాలు, పార్కింగ్, రవాణా మార్గాలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ నుంచి ఓట్ల లెక్కింపు వరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా

# నిర్వహించేందుకు ఏర్పాట్లు



- సహాయం కొరకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు: 08772256766, 9000822909
- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు కమిషనర్ ఎం.జయకృష్ణ

**తిరుపతి, వెలుతురు అక్టోబర్ 15 :** తిరుపతి నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పక్కాగా చేపట్టామని, అలాగే ఏదేని సహాయం కొరకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని కమిషనర్ ఎం. జయకృష్ణ తెలిపారు. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డిఎస్పీ భక్తవత్సలం, డిప్యూటీ కలెక్టర్ భరత్ నాయక్, అదనపు కమిషనర్ శారదాదేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్యలతో కలసి కమిషనర్ ఎం. జయకృష్ణ విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తిరుపతి నగరపాలక సంస్థ సాదారణ ఎన్నికలను ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. ఈ ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది, ఎన్నికల సామగ్రి, భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, ఇతర మౌలిక సదుపాయాలపై సమగ్ర ప్రణాళిక రూపొందించామని తెలిపారు. నగరంలో 66 వార్డుల్లో 304 పోలింగ్ కేంద్రాలని ఏర్పాటు చేశామని తెలిపారు. 2,90,492 ఓటర్లు ఉండగా అందులో మహిళలు 1,47,171 మంది, పురుషులు 1,43,292 మంది , 29 మంది ఇతరులు ఉన్నారని తెలిపారు. ఈనెల 16,17,18 వ తేదీలలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ అభ్యర్థి నామినేషన్ల స్వీకరణకు కేంద్రం ఏర్పాటు చేశామని, కార్పొరేటర్ అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ కొరకు నగరంలోని 22 కేంద్రాలని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెల 19వ తేదీన నామినేషన్ల పరిశీలన, 21వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపసంహరణ అనంతరం అదే రోజు సాయంత్రం పోటీలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీన పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా రిటర్నింగ్ అధికారులకు ఇప్పటికే శిక్షణ అందించామని, ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును పర్యవేక్షించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు తదితర ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే అధికారులు, రాజకీయ నాయకులు, అభ్యర్థులు లేదా ఇతరులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలకు సంబందించిన ఏదైనా సాయం కొరకు హెల్ప్ డెస్క్ (08772256766, 9000822909) ఏర్పాటు చేశామని కమిషనర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ముందుగానే ప్రణాళికాబద్ధంగా గుర్తించామని, జిల్లా ఎస్పీ సూచన మేరకు ఆయా కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లను చేపడుతున్నామని డిఎస్పీ భక్తవత్సలం తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద అవసరమైన బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను పూర్తి చేస్తూ, సంబంధిత రిటర్నింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# రూ.8.56 కోట్ల ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కేసు



**కడప జిల్లా, వెలుతురు అక్టోబర్ 15 :** జమ్మలమడుగు పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయంలో ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి సంబంధించి నమోదైన కేసులో దర్యాప్తు చేపట్టిన జమ్మలమడుగు పోలీసులు నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. 01.07.2022 నుంచి 31.05.2025 మధ్య కాలంలో ప్రభుత్వ నిధుల లావాదేవీల్లో అక్రమాలు జరిగినట్లు శాఖాపరమైన విచారణలో గుర్తించడంతో ఈ కేసు వెలుగులోకి వచ్చింది. శాఖాపరమైన విచారణ నివేదిక ప్రకారం, నగదు పుస్తకాలు, వోచర్లు, ఇతర సంబంధిత రికార్డుల్లో అవకతవకలు జరిగినట్లు, పనుల చెల్లింపులకు సంబంధం లేని వివిధ బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వ నిధులు బదిలీ అయినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ వ్యవహారంలో సుమారు రూ. 8.56 కోట్ల ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఉన్నతాధికారులు, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఆదేశాల మేరకు, జమ్మలమడుగు పంచాయతీరాజ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కింజరపు సీతారామ మోహన్ రావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా జమ్మలమడుగు పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 280/2026, సెక్షన్ 316(5)రెడ్ విత్ 3(5)బీఎన్ఎస్ కింద 25.09.2026న కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అరెస్టయిన నిందితుల వివరాలు 1. మిాసరగండ శ్యామ్ సుందర్ రాజు (64) ? అప్పటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (రిటైర్డ్), ప్రస్తుతం బెంగళూరు, కర్ణాటక రాష్ట్రం. 2. గురువు గారి సుధాకర్ (58) ? డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (ఆా), పులివెందుల పట్టణం. 3. గోకుల యదార్ధ భాస్కర్ (41) టైపిస్ట్, జమ్మలమడుగు పట్టణం. 4. జమ్మలమడుగు షాహిర్ హుస్సేన్ (35) ? అవుట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్, ప్రొద్దుటూరు పట్టణం.

# ఉపాధి కేంద్రాలుగా గ్రామాలు

## మహిళా శక్తికి వేదికగా సరస్ మేళా-2026

### మహిళా సాధికారతే వికసిత్ భారత్‌కు పునాది

### గ్రామీణ మహిళల ఉత్పత్తులకు 'స్వయం ఏపీ' బ్రాండ్

### విజయవాడలో సరస్ మేళాను ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు







**విజయవాడ, వెలుతురు అక్టోబరు 15:**

గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేందుకు స్వయం ఏపీ బ్రాండ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఏడాది కాలంలో లక్ష మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదిగారని, మరో ఐదు లక్షల మందిని ఆ దిశగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. విజయవాడలో తొలిసారిగా నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా-2026ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దసరా శరన్నవరాత్రుల వేళ జాతీయ సరస్ మేళా నిర్వహించడం విజయవాడకు మరింత శోభ తెచ్చిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఆడబిడ్డకు స్ఫూర్తిదాయకమని చెప్పారు. మారుమూల గిరిజన ప్రాంతంలో జన్మించి ఉపాధ్యాయురాలిగా ప్రస్థానం ప్రారంభించిన ఆమె.. ఎన్నో సవాళ్లను అధిగమించి దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిని అధిరోహించారని కొనియాడారు. సంకల్ప బలం, ధైర్యం ఉంటే మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఆమె నిరూపించారని తెలిపారు. జాతీయ సరస్ మేళాలో 650 స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయని సీఎం తెలిపారు. ఇది కేవలం 14 రోజులపాటు జరిగే ప్రదర్శన కాదని, గ్రామీణ మహిళల ఉత్పత్తులకు ఏడాది పొడవునా మార్కెట్ అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. మహిళల ఆదాయాన్ని పెంచడం, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, గ్రామీణ ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో

గుర్తింపు తీసుకురావడం మేళా ప్రధాన ఉద్దేశమని వివరించారు. దేశంలోని వివిధ ప్రాంతాల మహిళలు తమ అనుభవాలను పంచుకోవడం తోపాటు విజయగాథలను తెలుసుకోవాలని, కొత్త వ్యాపార అవకాశాలను అన్వేషించాలని సూచించారు. రూ.69 వేల కోట్ల టర్నోవర్‌తో డ్వాక్రా సంఘాలుఆంధ్రప్రదేశ్‌లో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు, 1.10 కోట్ల మంది సభ్యులు ఉన్నారని చంద్రబాబు తెలిపారు. ఈ సంఘాల ద్వారా రూ.69 వేల కోట్ల టర్నోవర్ నమోదవుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు 3.5 కోట్ల మందికి చేరుతున్నాయని వివరించారు. గతంలో వెలుగు కార్యక్రమం ద్వారా మహిళలు సంపద సృష్టించే దిశగా అడుగులు వేశారని గుర్తుచేశారు. నిన్నటి వరకు పొదుపు సంఘాలుగా ఉన్న ఎస్ హెచ్ జీలు నేడు వ్యాపార సంస్థలుగా ఎదుగుతున్నాయని..

భవిష్యత్తులో అంతర్జాతీయ బ్రాండ్లుగా మారాలని సీఎం ఆకాంక్షించారు. మహిళలు ఉద్యోగాలు కోరుకునే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులను ఈ-కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ వేదికల ద్వారా స్వయం ఏపీ పేరుతో మార్కెటింగ్ చేస్తామని తెలిపారు. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను వ్యాపార అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. గ్రామీణ మార్కెట్ల నుంచి ప్రపంచ మార్కెట్ల వరకు మహిళల ఉత్పత్తులు చేరేలా సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని చెప్పారు. మహిళల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించు కున్నప్పుడే వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోగలమని స్పష్టం చేశారు. మహిళలను గౌరవించడం, వారి ఆలోచనలకు విలువ ఇవ్వడం, కలలను సాకారం చేసుకునేందుకు అవసరమైన అవకాశాలు, సహకారం అందించడం సమాజ బాధ్యత అని అన్నారు.




# 59 ఏళ్లు పైబడిన చేనేత కార్మికులక ఎక్స్‌గ్రేషియా పథకాన్ని పునరుద్ధరించాలి

- టెస్కోకు ఎన్నికలు నిర్వహించి, పర్సన్ ఇన్‌చార్జి కమిటీని నియమించాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు పద్మశాలి సంఘాల నేతల వినతి



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 15:**

తెలంగాణ రాష్ట్రంలోని 59 సంవత్సరాలు పైబడిన చేనేత కార్మికులకు ప్రభుత్వం గతంలో అందజేసిన ఎక్స్‌గ్రేషియా పథకానికి సంబంధించిన జీవోను పునరుద్ధరించి, పథకాన్ని తిరిగి అమలు చేయాలని కోరుతూ పద్మశాలి సంఘాల నాయకులు రాష్ట్ర వ్యవసాయ, చేనేత మరియు జౌళి శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, చేనేత వృత్తినే జీవనాధారంగా చేసుకొని జీవితాంతం శ్రమించిన కార్మికులు వృద్ధాప్యంలో అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా 59 సంవత్సరాలు పైబడిన కార్మికులు వయోభారం, అనారోగ్య సమస్యలు, ఉపాధి అవకాశాల కొరత కారణంగా కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గతంలో అమలులో ఉన్న ఎక్స్‌గ్రేషియా పథకం అనేక చేనేత కార్మిక కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలిచిందని గుర్తుచేశారు.

ప్రభుత్వం ఈ పథకానికి సంబంధించిన జీవోను పునరుద్ధరించి, అర్హులైన చేనేత కార్మికులకు తిరిగి ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, వారి కుటుంబాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు.

## టెస్కోకు ఎన్నికలు నిర్వహించాలి

తెలంగాణ రాష్ట్ర చేనేత రంగానికి కీలకమైన టెస్కో (తెలంగాణ స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ)కు ఎన్నికలు నిర్వహించి, ప్రజాస్వామ్యబద్ధంగా పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని నాయకులు మంత్రిని కోరారు. ఎన్నికలు నిర్వహించే వరకు సంస్థ కార్యకలాపాలు సమర్థవంతంగా సాగేందుకు పర్సన్ ఇన్‌చార్జి కమిటీని నియమించాలని విజ్ఞప్తి చేశారు. చేనేత సహకార రంగం అభివృద్ధి, కార్మికుల సంక్షేమం, సహకార సంఘాల సమస్యల పరిష్కారం కోసం టెస్కోలో సమర్థవంతమైన పరిపాలన అవసరమని వారు పేర్కొన్నారు. ఈ అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చేనేత కార్మికుల సంక్షేమంతో పాటు సహకార రంగాన్ని బలోపేతం చేసే దిశగా ఎక్స్‌గ్రేషియా పథకం పునరుద్ధరణ, టెస్కోకు ఎన్నికలు, పర్సన్ ఇన్‌చార్జి కమిటీ నియామకం వంటి అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్థపు మురళి, అఖిల భారత పద్మశాలి సంఘం సెక్రటరీ జనరల్ గడ్డం జగన్నాథం, అఖిల భారత పద్మశాలి సంఘం యువజన విభాగం జాతీయ ఇన్‌చార్జి అవ్వారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# లలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనం

- మహాశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- నవరాత్రి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే రామారావుపటేల్ సహా పలువురు నేతలు



**కరీంనగర్, వెలుతురు అక్టోబర్ 15:**

దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ శ్రీ మహాశక్తి ఆలయంలో 5వ రోజైన గురువారం నాడు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి(స్కంద మాత) అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలయ నిర్వాహకులు అమ్మవారిని పండ్లతో అలంకరించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మహాచండీ దేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మరోవైపు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా, నగర పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, నగర కార్పొరేటర్లతోపాటు బైంసా మున్సిపల్ ఛైర్మన్ తుమ్మోళ్ల దత్తాత్రి, బైంసా మున్సిపాలిటీ కార్పొరేటర్లు ఈరోజు శ్రీ మహాశక్తి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సకల సౌభాగ్యాల ప్రదాయిని.. లలితా త్రిపుర సుందరీ దేవి!

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో లలితా త్రిపుర సుందరీ దేవి ఆరాధనకు విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది. ఆదిపరాశక్తి స్వరూపిణిగా కొలువుదీరే అమ్మవారు సౌందర్యం, జ్ఞానం, కరుణ, అపారమైన దైవశక్తికి ప్రతీకగా భక్తుల పూజలందుకుంటారు. శ్రీవిద్యా సంప్రదాయంలో పరమేశ్వరిగా పూజలందుకునే లలితాదేవిని సకల లోకాలకు మూలశక్తిగా భక్తులు విశ్వసిస్తారు. లలితా త్రిపుర సుందరీ దేవిని శ్రీచక్ర అధిష్ఠాన దేవతగా ఆరాధిస్తారు. శ్రీచక్రం శ్రీవిద్యా ఉపాసనలో అత్యంత పవిత్రమైన యంత్రంగా ప్రసిద్ధి చెందింది. అమ్మవారిని సాధారణంగా పాశం, అంకుశం, చెరకు విల్లు, పుష్పబాణాలు ధరించిన రూపంలో చిత్రిస్తారు. ఈ ఆయుధాలు మనస్సును నియంత్రించడం, కోరికలను సన్మార్గంలో నడిపించడం, దైవిక సంకల్పానికి ప్రతీకలుగా ఆధ్యాత్మికంగా వివరించబడతాయి. లలితాదేవిని ఆరాధించడం ద్వారా మనశ్శాంతి, జ్ఞానం, వివేకం, కుటుంబ సౌభాగ్యం కలగాలని భక్తులు ప్రార్థిస్తారు. కోపం, అహంకారం, దురాలోచనలను విడిచిపెట్టి ప్రేమ, కరుణ, ధర్మబద్ధమైన జీవనాన్ని అలవర్చుకోవాలనే సందేశాన్ని అమ్మవారి ఆరాధన గుర్తుచేస్తుంది. సకల శక్తులకు మూలమైన జగన్మాతగా, భక్తుల పాలిట కరుణామయిగా కొలువుదీరే లలితా త్రిపుర సుందరీ దేవి ఆరాధన దేవీ నవరాత్రులకు ఆధ్యాత్మిక శోభను చేకూరుస్తుంది. అమ్మవారి అనుగ్రహంతో సకల జనులకు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని భక్తులు ప్రార్థిస్తారు.

# ఇటు కొరడా.. అటు వేటు..!!

(మొదటిపేజీ తరువాయి)

హాజరుపరిచారు.

## బాధితుల ఫిర్యాదులతో సీఐపై చర్యలు

ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామిపై వచ్చిన అవినీతి ఆరోపణలు విచారణలో నిజమని తేలడంతో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి సస్పెండ్ చేశారు. న్యాయం కోసం వచ్చే బాధితుల ఫిర్యాదులను డబ్బుల కోణంలో చూస్తూ వేధిస్తున్నారని, భూ వివాదాలతో పాటు పలు కేసుల్లో నిందితులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆయనపై ఆరోపణలు వచ్చాయి. దీంతో విసిగిపోయిన 12 మందికి పైగా బాధితులు నేరుగా సీపీని కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

## విచారణలో అవినీతి బాగోతం బట్టబయలు

బాధితుల ఫిర్యాదులపై స్పందించిన ఉన్నతాధికారులు అంతర్గత విచారణ చేపట్టి, ఇన్‌స్పెక్టర్ వ్యవహారశైలికి సంబంధించిన ఆధారాలను సేకరించి నివేదిక సమర్పించారు. విచారణలో ఆరోపణలు రుజువు కావడంతో బుధవారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఒకవైపు ఏసీబీ దాడుల్లో లంచగొండి అధికారులు పట్టుబడుతుండగా, మరోవైపు ఫిర్యాదులపై విచారణతో పోలీసు అధికారిపై చర్యలు తీసుకోవడం ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిపై మరోసారి చర్చకు దారితీసింది.

## వేములవాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

### రూ 8 వేల లంచం తీసుకుంటూ తహసీల్దార్, భూభారతి ఆపరేటర్ అరెస్ట్

**సిరిసిల్ల, వెలుతురు అక్టోబర్ 15:**



వేములవాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం సాయంత్రం దాడులు నిర్వహించారు.భూ సంబంధిత పనికి లంచం తీసుకుంటుండగా తహసీల్దార్ అబూబాకర్, కార్యాలయ ప్రైవేట్ ఉద్యోగి భూభారతి ఆపరేటర్ అనిల్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ మహేందర్ రెడ్డి వెల్లడించారు.

కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ మహేందర్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వేములవాడ రూరల్ మండలానికి చెందిన నూకలమర్రి గ్రామానికి చెందిన ఓ బాధితుడు తన పేరిట భూమిని మ్యుటేషన్ చేయించుకునేందుకు వేములవాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయాన్ని పలుమార్లు సంప్రదించినట్లు తెలిపారు. అయినప్పటికీ తన పని పూర్తికాకపోవడంతో విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఏసీబీ అధికారులు ప్రణాళిక ప్రకారం నిఘా ఏర్పాటు చేయగా బాధితుడి నుంచి భూభారతి ఆపరేటర్ అనిల్ ద్వారా రూ 8,000 లంచం తీసుకుంటున్న సమయంలో తహసీల్దార్ అబూబాకర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు అయన తెలిపారు. అనంతరం కార్యాలయంలో సోదాలు నిర్వహించి, ఈ వ్యవహారానికి సంబంధించి ఇద్దరినీ అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.అరెస్టు చేసిన నిందితులను శుక్రవారం ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# ఇస్లాంలోకి మారితే బీసీ రిజర్వేషన్ వర్తించదు..

## సుప్రీంకోర్టు కీలక తీర్పు

**న్యూఢిల్లీ, వెలుతురు:**



హిందూ మతం నుంచి ఇస్లాంలోకి మారినంత మాత్రాన తమిళనాడులోని బీసీ ముస్లిం (బీసీఎం) రిజర్వేషన్ ప్రయోజనాలు పొందలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ శ్రీ చంద్రశేఖర్‌తో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. హిందూ సామాజిక వ్యవస్థ నుంచి ఇతర మత సామాజిక వ్యవస్థలోకి మారిన వ్యక్తి.. గతంలో తనకు ఉన్న సామాజిక వెనుకబాటుతనాన్ని మాత్రమే ఆధారంగా చేసుకుని రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4) కింద రిజర్వేషన్ కోరలేరని ధర్మాసనం పేర్కొన్నట్లు బార్ అండ్ బెంచ్ వెల్లడించింది. మత మార్పిడి జరిగినంత మాత్రాన గుర్తింపు పొందిన వెనుకబడిన ముస్లిం సమాజాల్లో ఏదో ఒకదానికి చెందినవారిగా పరిగణించలేమని స్పష్టం చేసింది.తమిళనాడు ప్రభుత్వ ఉత్తర్వు ఏంటి?: 2024 మార్చి 9న తమిళనాడు ప్రభుత్వం ఓ ఉత్తర్వు జారీ చేసింది. వెనుకబడిన తరగతులు (బీసీ), అత్యంత వెనుకబడిన తరగతులు (ఎంబీసీ), డీనోటిఫైడ్ కమ్యూనిటీలు (డీఎన్‌సీ), షెడ్యూల్డ్ కులాలకు (ఎస్సీ) చెందినవారు ఇస్లాంలోకి మారితే.. వారికి బీసీ ముస్లిం కేటగిరీలో కమ్యూనిటీ సర్టిఫికెట్లు ఇచ్చి రిజర్వేషన్ ప్రయోజనాలు కల్పించాలని అందులో పేర్కొంది. అయితే, ఈ ఉత్తర్వును మద్రాస్ హైకోర్టు రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించింది. తమిళనాడులో బీసీ ముస్లింలుగా గుర్తించిన ఏడు సమాజాల్లో సభ్యత్వం జన్మ ఆధారంగా నిర్ధారితమవుతుందని, మతం మారడం వల్ల మాత్రమే వాటిలో సభ్యత్వం లభించదని తెలిపింది. ఈ తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.ఏడు ముస్లిం సమాజాల అంశంతమిళనాడులో బీసీ ముస్లిం కేటగిరీ కింద అన్సార్, దెక్కనీ ముస్లింలు, దుబేకులా, లబ్బాయిస్ (రోవ్థర్, మరక్కాయర్ సహా), మాపిళ్ల, షేక్, సయ్యద్ సమాజాలను గుర్తించారు. హిందూ మతం నుంచి ఇస్లాంలోకి మారినంత మాత్రాన వీటిలో ఏదో ఒక సమాజానికి చెందినవారిగా ధ్రువీకరించలేమని హైకోర్టు పేర్కొంది. ప్రభుత్వం మాత్రం మత మార్పిడి వల్ల సామాజిక, విద్యాపరమైన వెనుకబాటుతనం తొలగిపోదని వాదించింది. రిజర్వేషన్ ప్రయోజనాలు కోల్పోకుండా చూడటమే ఉత్తర్వు ఉద్దేశమని తెలిపింది. కానీ సుప్రీంకోర్టు ఆ వాదనను అంగీకరించలేదు.

ఈ కేసు సమీర్ అహ్మద్ అనే వ్యక్తి పిటిషన్‌తో మొదలైంది. ఆయన 2015లో హిందూ మతం నుంచి ఇస్లాంలోకి మారి, లబ్బాయి ముస్లిం సమాజానికి చెందిన వ్యక్తిగా కమ్యూనిటీ సర్టిఫికెట్ కోరారు. అధికారులు దరఖాస్తును తిరస్కరించడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో భాగంగానే తమిళనాడు ప్రభుత్వ ఉత్తర్వుపై న్యాయపోరాటం సాగింది.

# పేదల పక్షాన పోరాడిన ప్రజావీరుడు పండుగ సాయన్న

## ముదిరాజ్‌లతో పాటు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు

### ముస్లాయిపల్లిలో విగ్రహావిష్కరణ చేసిన మంత్రి వాకిటి శ్రీహరి





**మక్తల్, వెలుతురు:**

అన్యాయాన్ని ఎదిరించి పేదల పక్షాన నిలిచి అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన ప్రజావీరుడు పండుగ సాయన్న జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, మత్స్య,యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ మండలం ముస్లాయిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగ సాయన్న ఆశయాలు, పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. పండుగ సాయన్న కేవలం ముదిరాజ్ సామాజిక వర్గానికే పరిమితమైన నాయకుడు కాదని, పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిలిచిన ప్రజానాయకుడని మంత్రి పేర్కొన్నారు. ధనవంతులు, భూస్వాములు, పెత్తందారుల దోపిడీని ఎదిరించి వారి ఆధిపత్యానికి సవాల్ విసిరిన ధైర్యశాలి సాయన్న అని కొనియాడారు. ఉన్నవారి సంపదను పేదలకు పంచి, ఆకలితో అలమటించే నిరుపేదలకు అండగా నిలిచిన మహనీయుడిగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. అందుకే ఆయనను ప్రజలు తెలంగాణ రాబిన్‌హుడ్‌గా గుర్తించారని అన్నారు.

#### నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డి పోరాటం

పాలమూరు ప్రాంతానికి చెందిన పండుగ సాయన్న 19వ శతాబ్దంలో భూస్వామ్య దోపిడీ, సామాజిక అసమానతలు, అధికారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన ప్రజావీరుడిగా చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని మంత్రి గుర్తుచేశారు. పేదల హక్కుల కోసం నిలబడిన ఆయనను అణచివేయడానికి అప్పటి ఆధిపత్య శక్తులు కుట్రలు పన్ని నిజాం పాలనలో ఆయనకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. సాయన్న వీరగాథలు నేటికీ జానపద కళారూపాలు, ప్రజల కథల్లో సజీవంగా ఉన్నాయని తెలిపారు.

ముదిరాజ్ సామాజిక వర్గం ఆర్థికంగా, రాజకీయంగా, విద్యా, ఉద్యోగ, సామాజిక రంగాల్లో అభివృద్ధి సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. యువత విద్యకు ప్రాధాన్యతనిస్తూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, రాజకీయ చైతన్యంతో పాటు సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. పండుగ సాయన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడం గొప్ప విషయమని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.

పండుగ సాయన్న పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ సమాజంలోని పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముస్లాయిపల్లిలో పండుగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్న మంత్రి, ఈ విగ్రహం గ్రామ ప్రజలకు, ముఖ్యంగా యువతకు ఆయన చరిత్రను గుర్తుచేసే స్ఫూర్తి కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు. మహనీయుల ఆశయాలను గౌరవిస్తూ సమానత్వం, సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు.

### గ్రామాల్లో బతుకమ్మ వేడుకలకు

# పకడ్బందీ ఏర్పాట్లు

- మంత్రి పొన్నం ప్రభాకర్
- అలిమ్కో ఆధ్వర్యంలో ఏడీఐపీ పథకం కింద వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సహాయక పరికరాలు
- హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని మూడు జిల్లాల అధికారులతో దూరవాణి సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, వెలుతురు:**

హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని కరీంనగర్, హనుమకొండ, సిద్దిపేట జిల్లాల అధికారులతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయం నుంచి దూరవాణి సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో పాటు అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు సహాయక పరికరాలు అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

#### బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

గ్రామాల్లో బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద బతుకమ్మ ఘాట్ల వద్ద శుభ్రత, మట్టి పనులు, ఇతర అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ అధికారులు, మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి వేడుకలను విజయవంతం చేయాలని తెలిపారు. ఏర్పాట్ల విషయంలో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

#### దివ్యాంగులు, వృద్ధులకు సహాయక పరికరాల పంపిణీపై ప్రత్యేక దృష్టి

హుస్నాబాద్ నియోజకవర్గంలో అలిమ్కో ఆధ్వర్యంలో ఏడీఐపీ పథకం కింద దివ్యాంగులు, వృద్ధులకు సహాయక పరికరాల పంపిణీ కోసం ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ప్రత్యేక శిబిరాల నిర్వహణపై సమాచారం క్షేత్రస్థాయి వరకు చేరిందా? అనే అంశాలపై మంత్రి అధికారులను ఆరా తీశారు.

కరీంనగర్ జిల్లాలో రెండు మండలాలకు ఒక రోజు, హనుమకొండ జిల్లాలో రెండు మండలాలకు ఒక రోజు, సిద్దిపేట జిల్లాలో మూడు మండలాలకు రెండు రోజుల పాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. శిబిరాల నిర్వహణకు ముందుగానే అర్హులైన లబ్ధిదారుల వివరాలను సేకరించి పూర్తిస్థాయి సమాచారం సిద్ధం చేయాలని తెలిపారు. అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన సహాయక పరికరాలు అందించడంలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## మెడికల్ కాలేజీల అభివృద్ధికి రూ.379 కోట్ల కేంద్ర నిధులు

- పీజీ సీట్ల పెంపునకు అనుగుణంగా వసతుల కల్పన
- మరో రూ.253 కోట్లు సమకూర్చనున్న రాష్ట్ర ప్రభుత్వం



**హైదరాబాద్, వెలుతురు:**

రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పెరిగిన ఎంబీబీఎస్, పీజీ సీట్లకు అనుగుణంగా ఆయా కాలేజీలు, అనుబంధ హాస్పిటళ్లను అభివృద్ధి చేసేందుకు సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్(సీఎస్ఎస్) కింద 379 కోట్ల రూపాయలు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలకు అనుమతులు తెలుపుతూ, కేంద్ర ఆరోగ్యశాఖ గురువారం రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శికి గురువారం లేఖ రాసింది. గత రెండేళ్లలో రాష్ట్రంలోని 26 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 465 పీజీ సీట్లు పెరిగాయి. సీఎస్ఎస్ స్కీమ్ కింద ఒక్కో పీజీ సీటుకు సగటున 81.57 లక్షల చొప్పున, 379.29 కోట్ల రూపాయలను కేంద్రం ఇవ్వనుంది. రాష్ట్ర ప్రభుత్వం మరో 253 కోట్ల రూపాయలను కలిపి.. మొత్తం 632 కోట్ల రూపాయలతో కాలేజీలు, హాస్పిటళ్లను అభివృద్ధి చేయనుంది.

ఈ ఏడాది ఆదిలాబాద్ రిమ్స్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, సిద్దిపేట గవర్నమెంట్ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లు కూడా పెరిగాయి. 4 కాలేజీల్లో కలిపి 110 సీట్లు పెంపునకు ఎన్ఎంసీ అనుమతులు ఇచ్చింది. ఈ కాలేజీలు, వాటి అనుబంధ హాస్పిటల్స్‌లో సౌకర్యాలు మెరుగు పర్చేందుకు 108 కోట్లతో ప్రభుత్వం పనులు చేపట్టనుండగా, ఇందులో 64 కోట్లు కేంద్ర ప్రభుత్వం ఇవ్వనుంది.

# ఎల్‌నినోపై ముందస్తు కార్యాచరణ

- ఏజెన్సీ ప్రాంతాల్లో కుటుంబాలకు తప్పనిసరిగా 125 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలి
- రాబోయే ఐదు నెలల్లో ప్రతి జాబ్‌కార్డుకు నెలకు కనీసం రూ.7,500 వేతనం అందేలా లక్ష్యం
- గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించాలి
- చిట్టచివరి గ్రామంలోని చిట్టచివరి వ్యక్తి అభివృద్ధి చెందడమే నిజమైన సమగ్ర అభివృద్ధి : మంత్రి సీతక్క



**హైదరాబాద్, వెలుతురు:**

ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో తలెత్తే పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికారులు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణతో సిద్ధం కావాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత, ఉపాధి సమస్యలు, పశువులకు పశుగ్రాసం కొరత వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా ఏజెన్సీ, గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి ఆదివాసీ గిరిజన కుటుంబానికి కనీసం 125 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని స్పష్టం చేశారు.

బేగంపేటలోని హోటల్లో గురువారం విబీజీ రామ్ జీ ద్వారా ఎల్‌నినో కరువు నివారణ చర్యలపై నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సుకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పంచాయతీ రాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్‌తో పాటు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, సబ్ కలెక్టర్లు, ఐటీడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అదనపు డీఆర్‌డీఓలు, పీఓలు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

#### ప్రజల అభివృద్ధే గ్రామ అభివృద్ధి

గ్రామపంచాయతీల పరిధిలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల ద్వారా పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికి జీవనోపాధి, కనీస మౌలిక సదుపాయాలు అందినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. "చిట్టచివరి గ్రామంలోని చిట్టచివరి వ్యక్తి అభివృద్ధి చెందడమే నిజమైన సమగ్ర అభివృద్ధి" అని స్పష్టం చేశారు. మారుమూల గిరిజన గ్రామాలు కూడా ఇతర గ్రామాలతో సమానంగా అభివృద్ధి చెందేలా అధికారులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. గతంలో ఆదివాసీ గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం వివిధ శాఖల సమన్వయంతో చేపట్టిన కార్యక్రమాల స్ఫూర్తితో ప్రస్తుతం కూడా ఐటీడీఏలు, పంచాయతీ రాజ్ శాఖ, పేదరిక నిర్మూలన సంస్థ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

#### వర్షపాతం లోటు నేపథ్యంలో ముందస్తు చర్యలు

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 16 నుంచి 18 జిల్లాలు సాధారణ వర్షపాతం కంటే 20 శాతానికి పైగా లోటుతో ఉన్నాయని సదస్సులోని నివేదిక పేర్కొంది. 18 జిల్లాల పరిధిలోని 320 మండలాలను తీవ్ర ఎల్‌నినో ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించినట్లు వివరించింది. ఈ సీజన్‌లో ఎల్‌నినో పరిస్థితులు మరింత బలపడే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు.

#### ఆదివాసీ గిరిజన కుటుంబాలకు 125 రోజుల ఉపాధి

ఏజెన్సీ ప్రాంతాల్లో వ్యవసాయం ప్రధానంగా ఒకే పంటకు పరిమితమవుతుందని, రెండో పంట సాగు చేసే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని మంత్రి వివరించారు. దీంతో ఆదివాసీ గిరిజన కుటుంబాలకు ఆదాయ భద్రత కల్పించడంలో ఉపాధి హామీ పథకం కీలకమని పేర్కొన్నారు.

ప్రతి ఆదివాసీ గిరిజన కుటుంబానికి తప్పనిసరిగా 125 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, ప్రతి కుటుంబానికి జాబ్‌కార్డు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోయే ఐదు నెలల్లో ప్రతి జాబ్‌కార్డుకు నెలకు కనీసం రూ.7,500 వేతనం లభించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి ఆదివాసీ గిరిజన నివాస ప్రాంతంలో కనీసం ఒక మేట్‌ను నియమించాలని, వేతనాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉపాధి పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

#### ఉపాధి పనులతో గ్రామాలకు శాశ్వత ఆస్తులు

ఉపాధి హామీ పథకం కింద కేవలం కూలీలకు పని కల్పించడమే కాకుండా, గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చే శాశ్వత ఆస్తులను సృష్టించాలని మంత్రి సీతక్క సూచించారు. అందుబాటులో ఉన్న 370 రకాల పనులను గ్రామాల అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలని అన్నారు.

#### పశుసంపదకు నీరు, పశుగ్రాసం అందేలా చర్యలు

ఏజెన్సీ ప్రాంతాల్లో పశుసంపద ఎక్కువగా ఉంటుందని పేర్కొన్న మంత్రి, పశువులకు అవసరమైన నీరు, పశుగ్రాసం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో చెక్‌డ్యాంల నిర్మాణం, నీటి సంరక్షణ పనులు చేపట్టి వర్షపు నీటిని ఒడిసిపట్టాలని అన్నారు. ఉపాధి హామీ పనులను స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తే గ్రామాల అభివృద్ధితో పాటు కరువు ప్రభావాన్ని తగ్గించవచ్చని తెలిపారు.

#### గ్రామాల్లో పర్యటిస్తేనే ప్రజల సమస్యలు తెలుస్తాయి

అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా నిరంతరం గ్రామాల్లో పర్యటించాలని మంత్రి సీతక్క సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడే ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలు తెలుస్తాయని, వాటికి తగిన పరిష్కారాలు కనుగొనగలమని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు వంటి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.

### సంక్షేమ గురుకులాల్లో

# సరుకుల కొరత ఉండొద్దు

- పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల్లో బఫర్ స్టాక్ తప్పనిసరి
- సరఫరా వ్యవస్థపై నిరంతర పర్యవేక్షణ..
- విద్యార్థుల కిట్ల పంపిణీపైనా ప్రత్యేక నివేదిక ఇవ్వాలి
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



**హైదరాబాద్, వెలుతురు:**

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల్లో విద్యార్థులకు అవసరమైన నిత్యావసర సరుకుల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గురువారం ఆదేశించారు.

సరుకుల సరఫరా,నిల్వలు,పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని టీజీఎస్ డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ, టీజీటీడబ్ల్యూఆర్ఈఐ సొసైటీల కార్యదర్శులను ఆదేశించారు.సంబంధిత సొసైటీల పరిధిలోని అన్ని పాఠశాలలు, కళా శాలలు, వసతిగృహాలకు నిత్యావసర సరుకుల సరఫరా కోసం టెండర్ల ప్రక్రియ పూర్తయిన నేప థ్యంలో.. ఇకపై సరఫరా వ్యవస్థపై మరింత అప్ర మత్తంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు.

#### నెలవారీ నివేదిక తప్పనిసరి

సరుకుల సరఫరా, నిల్వల పరిస్థితి, క్షేత్రస్థాయి తనిఖీల్లో గుర్తించిన అంశాలు, సరుకుల నాణ్యత లేదా లభ్యతపై వెలువడే ప్రతికూల వార్తా కథనాలు, వాటిపై తీసుకున్న దిద్దుబాటు చర్యల వివరాలతో కూడిన సమగ్ర నెలవారీ నివేదికను సమర్పించాలని మంత్రి ఆదేశించారు.

#### విద్యార్థుల కిట్లపై ప్రత్యేక పర్యవేక్షణ

విద్యార్థులకు అందజేసే కిట్ల కొనుగోలు, సరఫరా, పంపిణీ ప్రక్రియను కూడా ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు. ఏయే జిల్లాల్లో, ఏయే సంస్థల్లో ఎంతమంది విద్యార్థులకు కిట్లు అందాయి, ఇంకా ఎక్కడెక్కడ పంపిణీ పూర్తి కావాల్సి ఉంది తదితర వివరాలతో సంస్థల వారీగా,జిల్లాల వారీగా నెలవారీ నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

#### జిల్లా కలెక్టర్లతో సమన్వయం

సరుకుల సరఫరాకు సంబంధించి తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తక్షణమే పరిష్కరించాలని మంత్రి సూచించారు. ఇందుకోసం సంబంధిత జిల్లా కలెక్టర్లు, ఇతర శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ సరఫరా వ్యవస్థ సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు.

## బార్ల లక్కీడ్రాకు ఏర్పాట్లు పూర్తి

**హైదరాబాద్, వెలుతురు:**

టీసీయుఆర్ (తెలంగాణ క్యూర్ అర్బన్ రీజియన్) పరిధి లోని 14 బార్లకు, మిగిలిన కార్పొరేషన్ మునిసిపాలిటీల్లో 27 బార్లకు వచ్చిన దరఖాస్తుల్లో శుక్రవారం జరిగే లక్కి డ్రా ద్వారా బార్ లైసెన్సీలను ఎంపిక కోసం ఎక్సైజ్శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.టీసీయుఆర్ పరిధిలోని 14 బార్లకు 4251 దరఖాస్తులు వచ్చాయి. కార్పొరేషన్ మునిసిపాలిటీల్లోని 27బార్లకు 4519 దరఖాస్తులు వచ్చాయి. టీసీయుఆర్తో పాటు అన్ని జిల్లాలో ఈ నెల 16 శుక్రవారం ఉదయం 11 గంటలకు దరఖాస్తుదారుల సమక్షంలో డ్రా ద్వారా బార్ లైసెన్సీలను ఎంపిక చేస్తారని ఎక్సైజ్ శాఖ పేర్కొంది. టీసీయుఆర్ పరిధిలోని 14 బార్లకు సంబంధించిన లక్కి డ్రాను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ తీస్తారు. మిగిలిన జిల్లాలో ఆయా జిల్లా కలెక్టర్ల చేతుల మీదుగా లక్కి డ్రాలో బార్ లైసెన్సీలను ఎంపిక చేస్తారు.

# కూకట్ పల్లి నాలా విస్తరణకు హైడ్రా చర్యలు

- ఫతేనగర్, బాలానగర్ ప్రాంతాల ముంపు సమస్య పరిష్కారానికి అడుగులు
- సంబంధిత శాఖల అధికారులతో హైడ్రా కమిషనర్ సమీక్ష



**హైదరాబాద్, వెలుతురు:**

ఫతేనగర్ - బాలానగర్ పారిశ్రామిక, నివాస ప్రాంతాల్లో వరద ముప్పును శాశ్వతంగా పరిష్కరించేందుకు హైడ్రా చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఇప్పటికే కూకట్పల్లి నాలాలో పూడికతీత పనులను ముమ్మరంగా చేపట్టిన హైడ్రా.. ఆక్రమణలు తొలగించడంపై దృష్టి పెట్టింది. పెదవాళ్ళ నివాసాల జోలికి వెళ్లకుండా చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు గురువారం సంబంధిత శాఖల అధికారులతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హైడ్రా కార్యలంలో సమీక్షించారు.

సీఎంసీ, ఎంఎంసీ, పారిశ్రామికవాడ కోఆపరేటివ్ సొసైటీ ప్రతినిధులు, ఐలా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు ఇందులో పాల్గొన్నారు. ఫతేనగర్-బాలానగర్ పారిశ్రామిక ప్రాంతాల్లో వరద ముప్పును శాశ్వతంగా నివారించాలంటే నాలాల్లో పూడికతీతతో పాటు, ఆక్రమణలను తొలగించి నాలాను విస్తరించడం అత్యంత కీలకమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు.చెరువుల నుంచి వచ్చే వరద నీరు ఎలాంటి ఆటంకాలు లేకుండా నా లాల ద్వారా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులకు సూచించారు. ప్యాట్నీ నాల విస్తరణతో ఎగువున ఉన్న వేల కుటుంబాలకు, పదులసంఖ్యలో ఉన్న బస్తీలకు వరద ముప్పు తప్పించామని గుర్తు చేశారు.

#### భారీమొత్తంలో వరద సాఫీగా సాగేలా..

పరికిచెరువు, ఐడీఎల్ చెరువుల నుంచి వచ్చే వరద నీరు కూకట్‌పల్లి నాలా ద్వారా ప్రవహిస్తుండగా, ఫాక్స్ సాగర్ నుంచి జీడిమెట్ల మీదుగా వచ్చే వరద కాలువ గౌతంనగర్ పరిసరాల్లో ఈ నాలాలో కలుస్తుంది.

#### 40 మీటర్ల వెడల్పు నాలా 9 మీటర్లకు చేరింది

ఫతేనగర్ ప్రాంతంలో సుమారు 40 మీటర్ల వెడల్పు ఉండాల్సిన నాలా కొన్ని ప్రాంతాల్లో ఆక్రమణల కారణంగా కేవలం 9 మీటర్లకు కుంచించుకుపోయిందని అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఫతేనగర్-బాలానగర్ పారిశ్రామిక ప్రాంతాల్లోని నాలా మొత్తం సుమారు 4.2 కిలోమీటర్ల మేర విస్తరించి ఉందని, ఇందులో 2.2 కిలోమీటర్ల పరిధి సీఎంసీ పరిధిలోకి, మరో 2 కిలోమీటర్లు ఎంఎంసీ పరిధిలోకి వస్తాయని అధికారులు తెలిపారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ నాలా హద్దులను గుర్తించాలని, ఆక్రమణల తొలగింపునకు అవసరమైన చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు.

#### పారిశ్రామికవాడకు 47 ఎకరాల భూ కేటాయింపు

పారిశ్రామికవాడ కోఆపరేటివ్ సొసైటీకి 1963లో 30 ఎకరాలు, 1964లో 17 ఎకరాలు కేటాయించినట్లు సమావేశంలో అక్కడి పారిశ్రామిక ప్రతిందులు ప్రస్తావించారు. నాలా హద్దులు, పారిశ్రామిక ప్రాంతంలోని నిర్మాణాలు, ప్రస్తుత పరిస్థితులను పరిశీలించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు. 30నిమిషాల పాటు వర్షం కురిసినా పారిశ్రామిక యూనిట్లు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నాయని పారిశ్రామికవేత్తలు తెలిపారు.




## రూ. 400ల కోట్ల ఆస్తిని కాపాడిన హైడ్రా

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మాదాపూర్లోని ఖనమేట్ గ్రామంలో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. ఆక్రమణదారుల చేతిలో ఉన్న రూ. 400 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని గురువారం కాపాడింది. 2 ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. రెవెన్యూ అధికారుల విజ్ఞప్తి మేరకు హైడ్రా చర్యలు తీసుకుంది. ఈ భూమిని కబ్జా చేసిన వాళ్లకు కోర్టులో కూడా చుక్కెదురైంది. ఈ భూమిని కాపాడడానికి రెవెన్యూ అధికారులు ప్రయత్నించినప్పుడు ప్రతిఘటన ఎదురయ్యింది. అక్కడ ప్రహరీ నిర్మించి ఆక్రమించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. అయినా ఎప్పటికప్పుడు ఆక్రమించడానికి ఒకరితో ఒకరు పోటీపడ్డారు. తాజాగా 2 ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమి చుట్టూ ఆక్రమణ దారులు బ్లూ షీట్స్ ఫెన్సింగ్ వేశారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు హైడ్రాను ఆశ్రయించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు హైడ్రా అధికారులు గురువారం రంగంలోకి దిగి ఆక్రమణదారులు వేసిన బ్లూషీట్లను తొలగించారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITOR G BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com